# పండుగ శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు

**సెలవు** పర్వదిన సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. శనివారం పునఃదర్శనం.

- ఎడిటర్



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం.

హైదరాబాద్ - గురువారం 15 జనవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 12 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## జ్యోతి దర్శనంతో పులకించిన అయ్యప్పలు



2

## పొంగలి వండి వార్చిన ప్రధాని

**కేంద్ర మంత్రి నివాసంలో పండుగ వేడుకల్లో పాల్గొన్న మోడీ**



**ఢిల్లీ, జనవరి 14:** ఢిల్లీలోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ప్రజలకు పండుగ శుభాంకాంక్షలు తెలిపిన ప్రధాని గోవులకు పూజ చేసి.. అనంతరం పొంగలి వండారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. వేడుకల అనంతరం మోడీ మాట్లాడుతూ.. గతేడాది తాను తమిళనాడులో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైనట్లు గుర్తు చేసుకున్నారు. వెయ్యి సంవత్సరాల పురాతనమైన గంగైకొండ చోళపురం ఆలయ సందర్శన, పంబన్ వంతెన ప్రారంభోత్సవ సమయాల్లో తమిళుల చరిత్ర గొప్పతనాన్ని తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం సహజ వ్యవసాయంపై తమిళనాడులో జరిగిన ఓ సమావేశానికి తాను హాజరైనట్లు

...మిగతా 2లో

# నాలుగు స్తంభాలాట

## మున్సిపల్ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్న జనసేన

### పంచాయతీ ఎన్నికల ఫలితాలతో జోష్‌మీదున్న సేనానులు

### ఆ పార్టీ చీల్చే ఓట్లు ఎవరివంటూ రాజకీయ వర్గాల్లో చర్చ

### మున్సిపాలిటీల్లో 'కట్ త్రోట్ కాంపెటీషన్'!

**హైదరాబాద్, జనవరి 14 (మనం బ్యూరో):** రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలకు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సిద్ధమవుతుండగా పోటీలో మేము సైతం పోటీలో ఉంటామని జనసేన ప్రకటించింది. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో జనసేన పార్టీ తొలిసారిగా బరిలోకి దిగింది. అంతేకాకుండా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఆ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో మున్సిపల్ ఎన్నికలలో సైతం పోటీ చేయనున్నట్లు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ఎవరి ఓట్లను చీలుస్తుందనే చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా సాగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనే జనసేన పార్టీ పోటీ చేయనున్నట్లు ప్రచారం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఢిల్లీకి వెళ్లి పవన్‌ను కలిసి ఇదే అంశంపై చర్చలు జరిపారు. అయితే, బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న కారణంగా మిత్రధర్మాన్ని పాటించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయబోమనీ పవన్ కల్యాణ్ ప్రకటించారు. తాజాగా, త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి దిగనున్నట్లు స్వయంగా పవన్ ప్రకటించడంతో ఆ పార్టీ ఎవరి ఓట్లను చీలుస్తుందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ప్రముఖ సినీ హీరోగానే కాకుండా సామాన్యుల సమస్యలపై వేగంగా స్పందిస్తాడన్న రాజకీయ కోణంలోనూ పవన్ కల్యాణ్‌కు రాష్ట్రంలో

...మిగతా 2లో

# 'ఐఏఎస్' కేసులో సిట్ ఫిట్టింగ్

**ఇద్దరు మీడియా ప్రతినిధుల అరెస్ట్, రిమాండ్ • మీడియా కార్యాలయంలో సోదాలు • కీలక ఆధారాల సేకరణ**



**హైదరాబాద్,జనవరి 14(మనం,ప్రత్యేకప్రతినిధి):** మంత్రి, మహిళా ఐఏఎస్ పై ఆరోపణల కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలోని ఓ మీడియా కార్యాలయంలో బుధవారం రెండు పర్యాయాలు సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. మొదట సెర్చ్ వారెంట్ చూపమని సిబ్బంది అడగడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన అధికారులు.. మరోసారి సాయంత్రం సోదాలు నిర్వహించారు. రెండవసారి సెర్చ్ ఆపరేషన్ కోసం వచ్చిన పోలీసులు ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా కార్యాలయంలోని కంప్యూటర్లను, ఇతర సాంకేతిక పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ మాట్లాడుతూ మహిళా ఐఏఎస్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా కథనాలు ప్రసారం చేశారనే కేసులో ఇద్దరు రిపోర్టర్లను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఈ కేసు విచారణకు

...మిగతా 2లో

## కల'కలం'పై డీజీపీ కన్నెర్ర

అసత్య ప్రచా(సా)రాలపై

తప్పుడు రాతలపై ఇక ఉక్కుపాదం

పరిధి దాటితే...కటకటాలే

2

## 18న ఖమ్మంలో సీఎం పర్యటన

- సీపీఐ జాతీయ మహాసభల్లో పాల్గొనున్న రేవంత్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం



**హైదరాబాద్, జనవరి 14:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ

...మిగతా 2లో



## ఇరాన్‌ను వీడండి

భారతీయులకు విదేశాంగశాఖ అడ్వైజరీ

2

## ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు కిడ్నాప్ చేసిండ్రు?

బెయిల్ వచ్చే సెక్షన్లకే ఇంత దౌర్జన్యమా? అని కేటీఆర్ నిలదీత

2

## రూ. 3 లక్షలకు చేరువలో వెండి

మరింత పైపైకి బంగారం ధర



2



















## జ్యోతి దర్శనంతో పులకించిన అయ్యప్పలు

శబరిమల, జనవరి 14: హరిహర అవతారుని క్షేత్రం శబరిమల '.. అయ్యప్ప' నామస్మరణతో మార్మోగింది. ఆలయానికి ఈశాన్య దిశలో పర్వతశ్రేణుల నుంచి వెలుగులీనుతున్న జ్యోతి దర్శనమిచ్చింది. జ్యోతి దర్శనంతో వేలాది మంది భక్తులు మైమరచి అయ్యప్పలు చేసిన శరణుఘోషలతో శబరిగిరులు ప్రతిధ్వనించాయి. కాంతమాల కొండలపై దేవతలు, రుషులు కలిసి భగవంతునికి హారతి ఇస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతకుముందు పందాళం నుంచి తీసుకువచ్చిన తిరువాభరణాలను ప్రధాన అర్చకులు స్వామివారికి అలంకరించారు. అనంతరం మూలమూర్తికి హారతి నిచ్చారు. ఆ వెంటనే క్షణాల్లో చీకట్లను తొలగిస్తూ పొన్నాంబలంమేడు పర్వత శిఖరాల్లో జ్యోతి దర్శనమైంది. మకర సంక్రాంతి జ్యోతి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు శబరిమలకు తండోపతండాలుగా తరలి వచ్చారు.

# 'ఐఏఎస్' కేసులో సిట్ ఫిట్టింగ్

(మొదటి పేజీ తరువాయి)

సహకరించకుండా రాత్రికి రాత్రే దేశం విడిచి పారిపోయే ప్రయత్నం చేస్తుంటే తాము అదుపులోకి తీసుకున్నామన్నారు. పోలీసుల అదుపులో ఉన్న రిపోర్టర్స్ నుంచి అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. సిట్ అంటేనే దర్యాప్తు అని ఇంకా నోటీసులు ఎందుకు ఇవ్వాలి అని ప్రశ్నించారు. రిపోర్టర్లు సక్రమంగా ఉంటే విచారణకు ఎందుకు భయపడుతున్నారని, విచారణకు పిలిస్తే ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించారు. విచారణలో కీలకంగా ఉన్నవారు విచారణకు వస్తానని చెప్పి సెల్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారని, బ్యాంకాక్ పేరుతో బయటకు వెళ్తుంటే పట్టుకోకుండా ఉంటామా? తప్పు చేసిన ఎవరినైనా అరెస్టు చేస్తామన్నారు. విచారణకు సహకరించకుంటే ఇళ్లకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఎక్కడికి వెళ్లినా పట్టుకువచ్చి చట్టం ముందు ప్రవేశపెడతామన్నారు.

**సారీ చెబితే..సరిపోదు :**

తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన మహిళా ఐఏఎస్ ఆఫీసర్, మంత్రిపై వచ్చిన కథనాల వ్యవహారంలో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మహిళా ఐఏఎస్ అధికారి ప్రతిష్టకు భంగం కలిగించేలా ఇటీవల కథనాలు ప్రసారం చేసిన న్యూస్ చానల్ యాజమాన్యం క్షమాపణలు కోరింది. దీంతో ఈ సమస్య ముగిసిపోయిందని అందరూ భావించారు. కానీ గత అర్ధరాత్రి ఊహించని ట్విస్ట్ నమోదైంది. కుటుంబంతో విదేశాలకు వెళుతున్న క్రమంలో ఆ చానల్ ఇన్ పుట్ ఎడిటర్‌ను శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో పోలీసులు అరెస్ట్ చేశారు. అదే చానల్‌కు చెందిన మరో ఇద్దరు రిపోర్టర్లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. అయితే అసత్య ప్రచారం చేసి సారీ చెబితే సరిపోదని పోలీసు బాసుల తేల్చిచెబుతున్నారు.

**సిట్...ఫిట్టింగ్ :**

మహిళా ఐఏఎస్ పై తప్పుడు కథనంతో ఓ మంత్రిని ఇరుకున పెట్టేందుకు వెనుక ఎవరి ఉన్నారన్న కోణంలో సిట్ దూకుడు పెంచింది. ఈ క్రమంలో సిట్ మీడియా ప్రతినిధులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది. ఈ వ్యవహారంలో యాజమాన్యం పాత్రపై సిట్ విచారణ చేపడుతోంది. అసలు ఈ కథనం ప్రచారం వెనుక అసలు వాస్తవాలు ఏమిటి అనే అంశాలను వెలుగులోకి తెచ్చేందుకు పలు కోణాలలో దర్యాప్తు సాగిస్తున్నారు. అయితే సదరు న్యూస్ చానల్ సంస్థ యాజమాన్యం అధికారికంగా వెల్లడిస్తే మంచిదని, లేనిపక్షంలో తామే విచారణ చేపట్టి నిజానిజాలను వెలుగులోకి తెస్తామని పోలీసులు చెబుతున్నారు.

# ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు కిడ్నాప్ చేసిండ్రు?

- రాజ్యాంగ హక్కులను రేవంత్ సర్కార్ కాలరాస్తోంది?
- బెయిల్ వచ్చే సెక్షన్లకే ఇంత దౌర్జన్యమా? అని కేటీఆర్ నిలదీత

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు అపహరించారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆయన ఘాటుగా స్పందించారు. 'రాహుల్ గాంధీ.. మీరు నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్' తెలంగాణ శాఖ, పౌరుల రాజ్యాంగ హక్కులను ఎలా కాలరాస్తోందో గమనిస్తున్నారని ఆశిస్తున్నా' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మంగళవారం రాత్రి రాష్ట్ర పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అపహరించారని, ఒకరి ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ లోపలికి ప్రవేశించారని ఆరోపించారు.
కేవలం బెయిల్ ఇవ్వదగిన సెక్షన్లు ఉన్న కేసులో, బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. మీడియా, డిజిటల్ మీడియాపై ఈ తరహా అణచివేత ధోరణి ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనకు ఒక నమూనాగా మారిందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.



## రూ. 3 లక్షలకు చేరువలో వెండి

### మరింత పైపైకి బంగారం ధర

ముంబై, జనవరి 14: భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఎన్నడూలేని రీతిలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతూ దూసుకెళుతున్నాయి. ఫ్యూచర్ మార్కెట్లో కిలో వెండి ధర మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఒక్క రోజులోనే రూ.12,803 పెరిగి రూ.2.87 లక్షలకు చేరింది. బంగారం సైతం 10 గ్రాములు రూ.1.43 లక్షల వద్ద ట్రేడవుతోంది. గత నాలుగు రోజుల్లోనే వెండి ధర రూ.35 వేలు పెరిగింది. 2026లో ఇప్పటివరకు రూ.52 వేలు పెరగడం గమనార్హం. గతేడాది డిసెంబర్ 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉంది.

ఇక బంగారం సైతం ఫ్యూచర్ మార్కెట్లో ఫిబ్రవరి కాంట్రాక్ట్ ఒక్క రోజులో రూ.932 పెరిగి రూ.1.43 లక్షల వల్ల సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,600 పలుకుతుండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,650గా ఉంది. కిలో వెండి ధర రూ.2,88,300 ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 90.20గా ఉంది. రూపాయి విలువ క్షీణత కూడా దేశీయ బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతోంది.

# నాలుగు స్తంభాలాట

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కొండగట్టు అంజన్నను ఇష్టదైవంగా పూజించే పవన్ ఇటీవలే ఆ దేవాలయ ప్రాంగణంలో రూ.34 కోట్ల టీటీడీ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని పటిష్ఠం చేసేందుకు జనసేనాని ప్రణాళిక రూపొందిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే ఆ పార్టీ ఎవరి ఓట్లను చీలుస్తుందనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. జనసేన మాకు ప్రత్యర్థి కాదంటూ ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రకటించగా బీజేపీ మాత్రం మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ఆ పార్టీతో మా ఓటు బ్యాంకుకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఏ పార్టీ అయినా మద్దతిస్తే స్వాగతిస్తామని తెలిపారు.

అంటే జనసేన పార్టీతో నష్టం జరిగేది తమ పార్టీకే అని ఆయన పరోక్షంగా అంగీకరించినట్లేనన్న చర్చ కూడా సాగుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపిన పక్షంలో జనసేనాని పవన్‌కల్యాణ్ అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తమ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రచారం చేస్తారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలనే ప్రచారం చేస్తాయి. మున్సిపల్ ఎన్నికల్లో జరిగే ఈ నాలుగు స్థంభాలాటలో ప్రజలు ఎవరి వైపు మొగ్గ చూపుతారో చూడాలి.

# ఇరాన్‌ను వీడండి

ఢిల్లీ, జనవరి 14: ఇరాన్‌లో ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో.. అక్కడి భారత రాయబార కార్యాలయం ఆ దేశంలో ఉంటున్న మన పౌరులను అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచిందింది. మరోవైపు భారత విదేశాంగశాఖ సైతం.. తదుపరి నోటీసు ఇచ్చేవరకు ఆ దేశానికి ప్రయాణించొద్దని సూచించింది.

''స్థానికంగా మారుతున్న పరిస్థితుల దష్ట్యా ఇరాన్‌లోని భారత పౌరులు, భారత సంతతికి చెందినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆందోళనలు, ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. రాయబార కార్యాలయంతో టచ్లో ఉండాలి. భారత పౌరులు తమ పాస్‌పోర్ట్‌లు, గుర్తింపు కార్డులు సహా ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఎంబసీలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలి'' అని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ఇప్పటివరకు 2500 మందికిపైగా మృతి చెందారు. మరోవైపు.. నిరసనలు కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగశాఖ ఇప్పటికే ఓసారి పౌరులను అప్రమత్తం చేసింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను మానుకోవాలని తెలిపింది.



## అమెరికా మరో కీలక నిర్ణయం

### 75 దేశాల పౌరులకు వీసా జారీ నిలిపివేత

వాషింగ్టన్, జనవరి 14: అగ్రరాజ్యం అమెరికా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. 75 దేశాల పౌరులకు జనవరి 21 నుండి వీసా ప్రాసెసింగ్ మొత్తాన్ని నిలిపివేస్తున్నట్టు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. ప్రస్తుత చట్టం ప్రకారం వీసాలను తిరస్కరించాలని కాన్సులర్ అధికారులను ఆదేశించింది. వీసా జారీ నిలిపివేసిన దేశాలలో రష్యా, బ్రెజిల్, థాయిలాండ్, యెమెన్, ఆఫ్ఘనిస్తాన్ తో పాటు ఇరాన్ సైతం ఉన్నాయి. అయితే ఇరాన్, రష్యా, సోమాలియా లాంటి దేశాల పౌరులకు అమెరికా వీసా జారీ అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. కానీ బ్రెజిల్ లాంటి దేశానికి సైతం వీసాలు జారీ చేయడాన్ని నిలివేయడం ఇప్పుడు షాకింగ్ గా మారింది. వలసలను నియంత్రించడం కోసమే ట్రంప్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే తాత్కాలికంగానే వీసాల జారీని నియంత్రింగా ఈ సమయంలో డిపార్ట్‌మెంట్ స్క్రీనింగ్, వెట్టింగ్ విధాలను తిరిగి అంచనా వేయబోతున్నట్టు తెలుస్తుంది.

## స్థానిక సంస్థలకు రూ.11వేల కోట్లకు పైగా నిధుల విడుదల

### హర్షం ప్రకటించిన కిషన్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 14: తెలంగాణలో గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికి నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గత దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ.11వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేసిందని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. 2015-16 నుంచి 2019-20లలో కేంద్రం తెలంగాణలో గ్రామపంచాయతీలకు రూ.5,060 కోట్లు విడుదల చేయగా 2020-21 నుంచి 2025-26లలో ఈ కేటాయింపులు 80% (రూ.9,050 కోట్లు) పెరిగాయన్నారు. దీనిలో రూ.6,051 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు.గ్రామీణ స్థాయి నుంచి ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల వరకు జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోందని, ఇందుకోసం, స్థానిక సంస్థలకు సంబంధించిన నిధులను మొదట్నుంచీ సమయానుగుణంగా విడుదల చేస్తోందన్నారు. ఇటీవల తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయినందున కేంద్రం మిగిలిన నిధులను కూడా త్వరలోనే విడుదల చేయనున్నదని కిషన్ రెడ్డి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల ఖర్చుపై యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇటీవలే సబ్‌మిట్ చేశారని, దీనికి తోడు గ్రామపంచాయతీలకు ఎన్నికలు కూడా పూర్తయినందున 2024-25 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు రూ.260 కోట్లను త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నదని, వీటి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇవ్వగానే దశల వారిగా మిగిలిన రూ.2,500 కోట్ల నిధులు కూడా విడుదల కానున్నాయని ఆయన చెప్పారు.కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నిధుల వినియోగం కోసం తప్పనిసరిగా ప్రత్యేక బ్యాంకు అకౌంట్ తెరవాలని, ఈ అకౌంట్ పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) పోర్టల్ లో నమోదు చేసుకుని యూనిక్ ఏజెన్సీ కోడ్ ను పొందాలని కిషన్ రెడ్డి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీల అకౌంట్లను జప్తుచేసుకుని, ఆ నిధులను ఇతర అవసరాలకోసం దారి మళ్లించింది..దీని కారణంగా చాలా మంది సర్పంచ్‌లు తమ హయాంలో చేసిన పనులకు నిధులు రానందున రాజీనామాలు చేశారు..కొందరు సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.. ఇది చాలా దురదష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకుని గ్రామాభివద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్ని ప్రయత్నాలకు సహకరిస్తూ, గ్రామ పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనకు చొరవతీసుకోవాలని కోరుతున్నట్లుగా కిషన్ రెడ్డి ఆకాంక్షించారు.

# పొంగలి వండి వార్చిన ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

మోడీ తెలిపారు. అక్కడ లాభదాయకమైన వృత్తులను వదిలి వ్యవసాయం వైపు మళ్లిన యువతను కలిశానని, వ్యవసాయ రంగంలో విప్లవాన్ని తీసుకురావడానికి వారు చేస్తున్న కృషిని మరింత విస్తరించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. దేశంలో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, పర్యావరణానికి అనుకూలంగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత వంటివి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రైతులు దేశ నిర్మాణంలో బలమైన భాగస్వాములని వారిని మరింత శక్తిమంతంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిబద్ధతతో పనిచేస్తోందన్నారు.

## 18న ఖమ్మంలో సీఎం పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

మహసభల్లో పాల్గొననున్నారు. అదేరోజు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ.25 కోట్లతో నూతనంగా నిర్మించిన మద్దులపల్లి మార్కెట్ యార్డ్, రూ.25 కోట్లతో నిర్మించిన నర్సింగ్ కళాశాల ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ.108 కోట్లతో నిర్మించబోయే జేఎన్టీయూ భవన నిర్మాణానికి వర్చువల్గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

## రేపు శ్రీవారి పార్వేట ఉత్సవం

# ఆర్జిత సేవల రద్దు



తిరుపతి, జనవరి 14: శ్రీవారి పార్వేట ఉత్సవం ఈనెల 16న కనుమ రోజు వైభవంగా జరగనుంది. అదేరోజున గోదా పరిణయోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 5.30 నుంచి 6.30 గంటల మధ్య ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్దజీయర్ మఠం నుంచి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మలయప్ప, శ్రీకృష్ణ స్వామివార్లు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఆస్థానం, పార్వేట పూర్తయ్యాక స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది.



- అసత్య ప్రచా(సా)రాలపై
- తప్పడు రాతలపై ఇక ఉక్కుపాదం
- పరిధి దాటితే...కటకటాలే

# కల 'కలం'పై డీజీపీ కన్నెర

హైదరాబాద్,జనవరి 14(మనం,ప్రత్యేకప్రతినిధి): సోషల్ 'మీడియా'లో వ్యక్తిత్వ హననానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి తేల్చిచెప్పారు. ఈ మేరకు తాను పదవీ బాధ్యతలు చేపట్టిన రోజే అసత్యప్రచారాలపై ఉక్కుపాదం మోపుతామని వెల్లడించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా బుధవారం డీజీపీ కీలక ప్రకటన విడుదల చేశారు. తాను డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ 1న మీడియా సమావేశంలో ...సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశం చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు.సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం వంటి వంటి చర్యలకు పాల్పడితే ఎంతటి వారైన ఉపేక్షించేదిలేదన్నారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం, ప్రసారం చేసే వారిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పామన్నారు. ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్క్యులేట్ చేయడం నేరమన్నారు. ప్రజల వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరో మారుస్పష్టం చేశారు.చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సోషల్ మీడియాలో పరిమితులను దాటి అబద్ధాలను ప్రచారం చేస్తే ఏమాత్రం ఉపేక్షించమని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు.

**అడ్మిన్‌లే బాధ్యులు :**

వాట్సప్ గ్రూపులలో అనుచిత పోస్టులపై ఆయా గ్రూప్‌ల అడ్మిన్‌లను సైతం బాధ్యులను చేస్తామని డీజీపీ హెచ్చరించారు. అభ్యంతరకరమైన పోస్టులు పెట్టిన వారిపై సాంకేతిక నిఘా సారిస్తున్నామని, ఆ పోస్టును ఎవరు పెట్టారు? వారు ఏ ప్రాంతానికి చెందినవారన్నది గుర్తించి వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాతో పాటు పీడీఎఫ్ పత్రికలపైనా నిఘా సారిస్తున్నామని, కర్ణాటక రాష్ట్రంలో మిస్ ఇన్ఫర్మేషన్ అండ్ ఫేక్ న్యూస్ యాక్ట్ పేరుతో రూపొందించిన చట్టాలను ఇక తెలంగాణలో అమలు చేసేందుకు సమాలోచనలు సాగిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ బిల్లును కేబినెట్ ముందు ప్రవేశ పెట్టిన విషయం విదితమే. సోషల్ మీడియా వేదికగా నకిలీ వార్తలు ప్రచారం చేసే వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష రూ. 5 లక్షల నుంచి 10 లక్షల జరిమానా విధించేవిధంగా కఠిన చట్టాలను అమలు చేయనున్నామన్నారు. తప్పుడువార్తలకు సంబందించిన కేసులను వేగంగా పరిష్కరిం చేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి కోర్టుకు ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించనున్నామని డీజీపీ తెలిపారు.

**ఇక...కఠిన చర్యలు :**

సామాజిక మాధ్యమాలలో ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపై ఐటీ చట్టం, బుల్లీషీట్‌ల పేరిట చర్యలు చేపడుతున్న పోలీసులు తాజాగా నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు సమాలోచనలు సాగిస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యే పోస్టులు ఎవరి ప్రోద్బ లంతో పెడుతున్నారో సమగ్రంగా విచారణ జరిపి తెరవెనుక ఉన్నవారిపైనా కేసులు పెట్టే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఇరు వర్గాలను రెచ్చగొట్టే పోస్టులను, ఫోటోలను, వీడియోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడం, షేర్ చేయడం కూడా నేరంగా పరిగ ణించనున్నారు. కొత్త చట్టాలతో రాష్ట్రంలో సోషల్ మీడి యా పోస్టులపై నిరంతర నిఘా ఉంటుందని, అసభ్యకరమైన పోస్టులపై కఠిన చర్యలు తప్పవని పోలీసు బాసులు హెచ్చరి స్తున్నారు. సోషల్ మీడియాలో పొలిటికల్ సెన్సిటివ్ లాంగ్వేజ్, పొలిటికల్ అఫెన్సివ్ లాంగ్వేజ్ వాడుతున్న వారిని గుర్తించి వారిపై కొత్త చట్టాల కింద చర్యలు తప్పవంటున్నారు. ఆదేవిధంగా సామాజిక మాధ్యమాలలో నకిలీ ఖాతాలు, మారుపేర్లతో పోస్టులు పెట్టేవారిని గుర్తించే సాంకేతికతకు మరింత పదును పెట్టేందుకు స్పెషల్ పోలీసులు సన్నద్ధమౌతు న్నారు. అసభ్యకర, అశ్లీల, అవమానకర పోస్టులు పెట్టేవారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయని పోలీసు బాసులు తేల్చి చెబుతున్నారు.

**పీడిఎఫ్ పత్రిలపై నిఘా :**

సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఊహాజనిత వార్తలు ప్రచురించే పీడీఎఫ్ పత్రికలపై చర్యలకు రంగం సిద్ధమౌతోంది. ఈ నేపథ్యంలో ఊరు, పేరు లేకుండా వార్తలను ప్రచురి స్తున్న పీడీఎఫ్ పత్రికలను గుర్తించాలని ఐ అండ్ పీఆర్‌కు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖకు ఆదేశాలిచ్చిందని పోలీసు బాసులు వివరిస్తున్నారు. ప్రెస్ రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు రాష్ట్ర పోలీసులు సైతం అన్ని జిల్లాలలోని పీడీఎఫ్ పత్రికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా పోలీసు బాసులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీపీఆర్‌ఓలకు పీడీఎఫ్ పత్రికల సమాచారం అందించాలని లేఖ రాయనున్నట్లు తెలియవచ్చింది. ఇప్పటికే రాష్ట్రసమాచార పౌర సంబంధాల శాఖ ఉన్నతాధికారులు 33 జిల్లాలలో ఆర్ఎన్ ఐ లేని పత్రికల పూర్తి సమాచారాన్ని సేకరించి నివేదిక ఇవ్వాలని ఆదేశాలిచ్చాయి. ఒకవైపు సమాచార శాఖ, మరోవైపు పోలీసు బాసులు ఊరు, పేరు లేని పత్రికలను గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకునేందుకు సమాయత్తమౌతున్నాయి.

## మెడికల్ పీజీ కటాఫ్

# 'జీరో'కు తగ్గింపు

### దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమైన డాక్టర్ల సంఘం

ఢిల్లీ, జనవరి 14: నీట్ పీజీ 2025-26 కటాఫ్ పర్సంటైల్‌ను 'సున్నా'కు తగ్గిస్తూ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నిర్ణయం తీసుకుంది. కాగా ఎన్బీఈ నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ రాసింది. ఈ నిర్ణయం వల్ల మైనస్ 40 మార్కులు వచ్చిన వారు కూడా స్పెషలిస్ట్ డాక్టర్ కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుందని, ఇది వైద్య విద్య యొక్క పవిత్రతను, నాణ్యతను పూర్తిగా దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. కేవలం ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్లను భర్తీ చేయడం కోసమే మెరిట్‌ను పక్కనబెట్టి ఇలాంటి అశాస్త్రీయమైన నిర్ణయాలు తీసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వారు స్పష్టం చేశారు.



అర్హత ప్రమాణాలను ఇలా భారీగా తగ్గించడం వల్ల భవిష్యత్తులో రోగుల భద్రతకు, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఛీవీ హెచ్చరించింది. ప్రభుత్వం తక్షణమే ఈ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుని, మెరిట్ ఆధారిత కటాఫ్‌ను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గని పక్షంలో, దేశవ్యాప్తంగా ఉన్న రెసిడెంట్ డాక్టర్లతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని సంఘం నేతలు ఈ లేఖ ద్వారా ప్రభుత్వాన్ని, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ హెచ్చరించారు.

# తలసానిపై కేసు నమోదు

- 'సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే... నిన్ను ముక్కలు చేస్తాం' అన్న కామెంట్స్‌పై కాంగ్రెస్ నేత రవి కిరణ్ ఫిర్యాదు..
- ఆవేశంలో అన్నానంటూ వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న తలసాని

హైదరాబాద్, మనం ప్రతినిధి : సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదైంది. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నేత రవి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తలసాని మాట్లాడారు. 'సికింద్రాబాద్‌ను ముక్కలు చేయాలని చూస్తే నిన్ను ముక్కలు చేస్తాం' అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన హెచ్చరికలు జారీ చేశారంటూ ఫిర్యాదు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, తలసాని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వివాదం ముదరడంతో తలసాని శ్రీనివాస్ యాదవ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కేవలం ఆవేశంలోనే ఆ మాటలు అన్నానని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని తలసాని వివరణ ఇచ్చారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని తాను గౌరవిస్తానని తెలిపారు. అయినప్పటికీ, కాంగ్రెస్ నేత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడతామని తలసాని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# మహిళలకు చీరలు పంపిణీ చేసిన మంత్రి సీతక్క

## సంక్రాంతి సందర్భంగా సొంత గ్రామానికి సీతక్క



ములుగు,జనవరి 14మనం ప్రతినిధి : సంక్రాంతి పండుగ సందర్భంగా ములుగు మండలం మంత్రి సీతక్క సొంత గ్రామం జగ్గన్నపేటలో మహిళలతో రాష్ట్ర మంత్రి సీతక్క సరదాగా గడిపారు. ఇటీవలే జరిగిన స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో తన సొంత గ్రామమైన జగ్గన్నపేట గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం తనపై ఉన్న నమ్మకానికి సహకరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అర్రెం వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం సహకరించిన గ్రామ మహిళా సోదరీమణుల సంతోషం కోసం గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న గుంటూరుపల్లి, అన్నంపల్లి, పులిగుండం, జగ్గన్నపేట గ్రామ మహిళలకు చీరలు అందించి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జగ్గన్నపేట గ్రామ సర్పంచ్ అర్రెం వెంకన్న, ఉప సర్పంచ్ దేవిరెడ్డి పద్మ, కిసాన్ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి నూనెటి శ్యామ్ యాదవ్, సీనియర్ నాయకులు దేవిరెడ్డి అంజిరెడ్డి, బీసీ సెల్ అధికార ప్రతినిధి గండ్రత్ జయాకర్, మాజీ సర్పంచ్ ఆది రెడ్డి మండల సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మేడారంలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



- జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర

ములుగు, జనవరి 14, మనం ప్రతినిధిః మేడారం జాతర నిర్వహణ నేపథ్యంలో మేడారం ప్రాంతంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మేడారం పరిసర ప్రాంతాల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, రహదారులు మరియు యాత్రికుల బస ప్రాంతాల్లో నిరంతర శుభ్రత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్వహణ, వ్యర్థాల సేకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తూ రోజంతా పరిశుభ్రత పనులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని, పరిశుభ్రతను కాపాడడంలో సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జాతర ముగిసే వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర స్పష్టం చేశారు.

# సీఎం కార్యక్రమానికి ప్రత్యేక అధికారుల నియామకం

- పనుల్లో ఎక్కడా లోపాలు లేకుండా క్షుణ్ణ పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు, జనవరి 14, మనం ప్రతినిధిః ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్ తో కలిసి మేడారంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఎలాంటి లోపాలు లేకుండా ఉండేలా ముందస్తు చర్యలుగా ఈ పరిశీలన చేపట్టారు. దాదాపు మూడు గంటల పాటు జిల్లా అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ మేడారం పరిసరాల్లో జరుగుతున్న పనులను సూక్ష్మంగా పరిశీలించారు. ప్రతి పనిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని అక్కడికక్కడే పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. సీఎం పర్యటన దృష్ట్యా అన్ని పనులు సమన్వయంతో, నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం వీఐపీలు బస చేసే టెంట్ సిటీని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వసతులు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వీఐపీలకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్, భద్రత, వసతి, రవాణా, పారిశుద్ధ్యం వంటి అంశాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం సమన్వయంతో పనిచేసి సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అధికారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాళ్లేమైనా ఉగ్రవాదులా?

- 'అర్ధరాత్రి ఇళ్లపై పడి అరెస్ట్ చేస్తారా?
- అరెస్టులను తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి హరీశ్ రావు
- ఇది ప్రజాస్వామ్యంపై దాడేనన్న బీఆర్ఎస్
- బ్యాంకాక్ వెళుతుండగా ఎన్‌టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్ అరెస్ట్..
- మరో ఇద్దరు జర్నలిస్టులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఓ తెలుగు ఛానెల్ తెలంగాణ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్‌ను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు అదే సంస్థకు చెందిన మరో ఇద్దరు జర్నలిస్టులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడమే ఇప్పుడు మీడియా వర్గాల్లో కలకలం రేపింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే, బుధవారం ఉదయం దొంతు రమేశ్ బ్యాంకాక్ వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా, మరికొద్ది క్షణాల్లో ఫ్లైట్ ఎక్కేందుకు సిద్ధమవుతుండగా రమేష్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు జర్నలిస్టులు చారి, సుధీర్‌లను కూడా అరెస్ట్ చేసినట్లు సమాచారం. అయితే, ఏ కేసులో వీరిని అరెస్ట్ చేశారనే విషయంపై పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అరెస్టుకు గల కచ్చితమైన కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. జర్నలిస్టుల అరెస్టును బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా ఆయన అభివర్ణించారు. మీడియా గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. 'అర్ధరాత్రి ఇళ్లపై పడి అరెస్ట్ చేయడానికి వాళ్లేమైనా ఉగ్రవాదులా?' అని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో నిలదీశారు. ఈ విషయంపై డీజీపీతో ఫోన్‌లో మాట్లాడినట్లు హరీశ్ రావు తెలిపారు. అయితే, ప్రస్తుతం అదుపులోకి తీసుకున్న ముగ్గురు జర్నలిస్టులు కూడా సీసీఎస్ పోలీసుల కస్టడీలో ఉన్నారన్నారు. ఈ ఘటన తెలంగాణ రాజకీయ, మీడియా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అయ్యప్ప ఆలయం ఆవరణలో ముగ్గుల పోటీలు



- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

గంగాధర, జనవరి 14, ( మనం న్యూస్) : గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామంలోని ఆనందగిరి సుందర శాస్త అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలో ఆలయ నిర్మాణ ధర్మకర్త శ్రీరామ్ మధుకర్ - శ్వేత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా ముగ్గులు వేశారు. తెలుగు సంస్క ృతి ఉట్టిపడేలా భోగి మంటలు, గొబ్బెమ్మలు, హరిదాసు చిత్రాలు వంటి అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. ఇలపై ఇంద్రధనుస్సులు విరిసినట్లు, నింగిలోని చుక్కలన్నీ నేలపై వాలినట్లుగా తీర్చిదిద్దిన రంగురంగుల ముగ్గులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలకు శ్రీరామ్ మధూకర్ - శ్వేత బహుమతులు అందజేశారు. అనంతరం మధూకర్ మాట్లాడుతూ ముగ్గులు వేయడం మన భారతీయ సంస్క ృతిలో ఒక భాగమని, మహిళలను ప్రోత్సహించేందుకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అరెస్టులు.. తీవ్రంగా ఖండిస్తున్నాం

- కాంగ్రెస్ ప్రజాపాలనలో దాడులు నిత్యకృత్యం
- ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని తలపించేలా రేవంత్ పాలన
- జర్నలిస్టులు ఏమైనా టెర్రరిస్టులా? : మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- ప్రతిపక్షాలపై కేసులు, అరెస్టులు, దాడులు, అణచివేతలు హేయం: ఆర్ఎస్ ప్రవీణ్..
- వాస్తవాలు బయట పెట్టాలి? కానీ, జర్నలిస్టులనే అరెస్ట్ చేస్తారా?
- ఇది, రేవంత్, వికృత రాజకీయాలకు పరాకాష్ట...
- జర్నలిస్టుల అరెస్టులపై ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



ప్రతిపక్షాలపై కేసులు, అరెస్టులు, దాడులు, సంఘాలపై అణచివేతలు..

హైదరాబాద్, మనం ప్రతినిధి : రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అర్ధరాత్రి సమయంలో జర్నలిస్టులతో పాటు ఇతర మీడియా ప్రతినిధులను అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానం అని మండిపడ్డారు. జర్నలిస్టులు ఏమైనా టెర్రరిస్టులా? రాత్రి నుండి వారి ఇళ్లపై దాడులు చేస్తూ, ఇంటి తలుపులు పగులగొడుతూ పండుగల సందర్భంలో కూడా వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉండనివ్వకుండా, భయభ్రాంతులకు గురిచేస్తూ అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. చట్టప్రకారం నోటీసులు జారీ చేసి, పండుగల అనంతరం విచారణకు పిలవాల్సి ఉండగా, ఇలా రాత్రివేళ దాడులు చేయడం ఏ ప్రజాస్వామిక విధానమని నిలదీశారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా గొంతు నొక్కే ప్రయత్నం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన అధికార దుర్వినియోగాన్ని బహిర్గతం చేసుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చర్చ మొదలయ్యే సరికి, దానిని దారి మళ్లించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిసారీ డైవర్షన్ పాలిటిక్సుకు పాల్పడుతోందని వేముల ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న జర్నలిస్టులను వేధించడం, అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. ఇది ఇందిరాగాంధీ కాలం నాటి ఎమర్జెన్సీని తలపించే పాలనగా ఉందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని, తక్షణమే అరెస్ట్ చేసిన జర్నలిస్టులందరినీ విడుదల చేసి చట్టప్రకారం నోటీసులు ఇచ్చి పండగ తర్వాత విచారణ చేయాలనీ ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

**వాస్తవాలు బయటవెట్టాలి?... జర్నలిస్టులను అరెస్ట్ చేస్తరా?**

ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తే నిరుద్యోగులను, యూరియా అడిగితే రైతులను, ఫీజు రీ ఎంబర్స్ మెంట్ అడిగితే విద్యార్థులను, పదవీవిరమణ చేసిన తర్వాత బెనిఫిట్స్ అడిగితే రిటైర్డ్ ఉద్యోగులను ఈ ప్రభుత్వం అరెస్టు చేసి బెదిరిస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఎంత అణచివేస్తే అంత ఎక్కువగా తిరుగుబాటు వస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎమర్జెన్సీ నడుస్తున్నదని ఆయన అన్నారు. రజాకార్లను ఎదుర్కొన్న తెలంగాణకు కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం పెద్ద లెక్క కాదన్నారు. అక్రమ అరెస్టులను ఆపకుంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని జగదీష్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్‌టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు.

**రేవంత్, వికృత రాజకీయాలకు పరాకాష్ట... ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**

జర్నలిస్టులను అక్రమ అరెస్టులు చేస్తూ వికృతానందం పొందుతున్నడు...ఇది, రేవంత్‌రెడ్డి వికృత రాజకీయాలకు ఇది పరాకాష్ట అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టుల అరెస్టులతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిండని దుయ్యబట్టారు. మీడియా కార్యాలయంపై పోలీసులు దాడి చేయడం హీనమైన చర్యగా ఆయన అభివర్ణించారు. మీడియా ఆఫీసుకి వెళ్లి కంప్యూటర్లు సీజ్ చేస్తాం అని బెదిరించడం అంటే మీడియా గొంతు నొక్కడమే? పత్రికా స్వేచ్ఛను హరించడమే? అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచక పాలన మొదలైందని దేశపతి అన్నారు.

**ప్రతిపక్షాలపై కేసులు, అరెస్టులు, దాడులు, సంఘాలపై అణచివేతలు..**

తెలంగాణ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మీడియాపై ఆంక్షలు, అక్రమ కేసులు, బెదిరింపులు నేడు జరుగుతున్నాయని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడిగా ఆయన పేర్కొన్నారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గం అని అన్నారు. తక్షణమే అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయితే, సిట్ వేయాల్సింది న్యూస్ ట్యాంపరింగ్ మీద... ఫోన్ ట్యాపింగ్ మీద కాదన్నారు. ఎన్‌టీవీ చైర్మన్‌ను అరెస్ట్ చేసి రోకలిబండలు ఎక్కిస్తేనే కుట్ర కోణం తెలుస్తదన్నారు. నైతిక విలువలు పాటించని ఛానెల్స్‌లో పనిచేయొద్దని మహిళా జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల అరెస్టును ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఖండించారు.

ఆంధ్ర పెత్తందారీ దాదాగిరి-తెలంగాణ ముఖ్యమంత్రి గులాంగిరికి మళ్లీ బలి పశువులు అయింది తెలంగాణ బహుజన బిడ్డలేనన్నారు. జర్నలిస్ట్‌లు దొంతు రమేష్, చారి, సుధీర్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇందులో వీరంతా కేవలం పావులు మాత్రమేనన్నారు. ఒక మహిళా ఉన్నతాధికారి- ఒక సీనియర్ మంత్రిపై అసభ్య కరమైన వార్తలను ప్రచురించడం యాదృచ్ఛికం కాదన్నారు. ఇది ఒక లోతైన కుట్రతోనే జరిగిందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆయన అనుమతి లేకుండా ఇలాంటి సెన్సేషనల్ వార్తలు రావని.. అలాంటి చైర్మన్‌కు రోకలిబండలు ఎక్కియ్యకుండా ఈ 'కుట్ర' ఎవరి సూచన మేరకు జరిగిందన్నది తెలిసే అవకాశం లేదని ఆయన అన్నారు. అది చేయకుండా ఆ వార్తను రిలే చేసిన చిన్న చిన్న తెలంగాణ ఛానల్స్‌పై కేసు పెట్టడం 'ఎవరినో' కాపాడడానికి, ఎవరి మీదనో కక్ష తీర్చుకోవడానికి చేస్తున్న హడావిడి అనేది క్లియర్‌గా తెలుస్తోందన్నారు. ఈ ఫేక్ న్యూస్‌కు తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రికి, ముఖ్యమంత్రి-హోంమంత్రికి, ఆంధ్ర సినిమా లాబీకి ఎక్కడో సంబంధం ఉందన్నారు. ఇక్కడ ఏదో లోతైన కుట్ర విచ్చలవిడి అక్రమ సంపాదన కోసం జరిగిందన్నారు. అత్యాచారం కేసులో చనిపోయిన దిశ- నేడు వికృత రాజకీయ క్రీడలో బలి అవుతున్న మహిళా ఉద్యోగులు వేరు వేరు కాదని ఆయన పేర్కొన్నారు. ఐ బొమ్మ రవికి ఒక న్యాయం ఎన్‌టీవీ నరేంద్ర చౌదరికి మరో న్యాయం ఉండకూడదన్నారు. వెంటనే ఆయన్ని అదుపులోకి తీసుకోని నిజం చెప్పించకపోతే మీరు ప్రభుత్వ అధినేతను కాపాడడానికి అటెన్షన్ డైవర్ట్ చేస్తున్నారని అనుకోవాల్సి ఉంటదని డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇది, ఆంధ్ర పెత్తందారీ చానల్లకు ఒకన్యాయం, తెలంగాణ చానల్లకు, జర్నలిస్టులకు మరో న్యాయం ఎట్ల ఉంటదన్నారు. మహిళల మీద ఘోరమైన ఫేక్ న్యూస్ (మీరే ఒప్పుకున్నారు)నడిపే మీరు ఏ మొఖం పెట్టుకోని ఇంకా భక్తి, వనిత చానళ్లు, కోటి దీపోత్సవాలు నడిపిస్తరు?? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.

# మాంజా పంజా... ప్రాణం పా(పో)యే

- తెలంగాణలో మరో వ్యక్తిని బలిగొన్న చైనా
- సంగారెడ్డిలో చైనా మాంజాకు ఉత్తరప్రదేశ్ వాసి బలి
- హైదరాబాద్‌లో ఏఎస్ఐ సహా పలువురికి తీవ్ర గాయాలు
- మాంజా ఘటనలపై మానవ హక్కుల కమిషన్ ఘాటు వ్యాఖ్యలు
- నెల రోజుల్లో రూ. 1.68 కోట్ల విలువైన మాంజా స్వాధీనం
- నిషేధిత మాంజాను అమ్మినా, కొన్న జైలు శి(క్ష)క్షే
- గట్టిగా హెచ్చరించిన కమిషనర్ సజ్జనార్



హైదరాబాద్, మనం ప్రతినిధి : సంక్రాంతి పండుగ వేళ తెలంగాణలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిషేధిత చైనా మాంజా ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. సంగారెడ్డి జిల్లాలో బుధవారం జరిగిన ఈ దుర్ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవిదేశ్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అవిదేశ్ తన బైక్‌పై ప్రయాణిస్తుండగా గాలిపటం దారమైన చైనా మాంజా అతడి మెడకు చుట్టుకుంది. దీంతో గొంతుకు తీవ్రమైన గాయం కావడంతో అధిక రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత కొద్ది వారాలుగా హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆదివారం రామాంతపూర్‌లో ఓ అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎఎస్ఐ) మెడకు మాంజా చుట్టుకుని తీవ్రంగా గాయపడ్డారు. ఆయనకు వైద్యులు 10 కుట్లు వేశారు. తాజాగా రెండు రోజుల క్రితం మీర్‌పేటలో 70 ఏళ్ల వృద్ధురాలి కాలికి మాంజా చిక్కుకుని గాయాలయ్యాయి. 2024లో హైదరాబాద్‌లోనే మాంజా కారణంగా విశాఖపట్నంకు చెందిన ఆర్మీ జవాన్ కడితాల కోటేశ్వర్ రెడ్డి (30) మరణించిన ఘటన తెలిసిందే. ఈ వరుస ప్రమాదాలపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. ఇమ్మానేని రామారావు అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. నిషేధిత మాంజా అమ్మకాలను అరికట్టడంలో తీసుకుంటున్న చర్యలపై ఫిబ్రవరి 26లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌ను ఆదేశించింది. మరోవైపు, నగరంలో చైనా మాంజా విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత నెల రోజుల్లో 132 కేసులు నమోదు చేసి, రూ. 1.68 కోట్ల విలువైన 8,376 మాంజా రీళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో 200 మందిని అరెస్ట్ చేశారు. నిషేధిత మాంజాను అమ్మినా, కొనుగోలు చేసినా జైలు శిక్ష తప్పదని కమిషనర్ సజ్జనార్ గట్టిగా హెచ్చరించారు.2

## సంక్రాంతికి స్వాగతం

ప్రజలనూ,జీవరాసినీ వణికించిన
పొడుగు రాత్రుల చలికాలానికి-
ఇప్పటికి చాలు మళ్ళీ వచ్చే ఏడు
వద్దువు గానీ అంటూ

సెలవులు మంజూరు చేసి
వీడ్కోలు పలికి పంపిస్తూ,
సుదీర్ఘదినాలకు అనుమతులను ఇచ్చేసి
సూర్యుడిని ఉత్తరాయణం లోకి తీసుకొచ్చిన
మకరసంక్రాంతీ నీకు స్వాగతం!

ప్రజలకు జీవనాధారమైన
పంటలను పండించే రైతు కలలను
సాకారం చేస్తూ

పంట కోతలను ముగించేసి
ధాన్యధనాలతో ఇళ్ళల్లోని గాదెలను నింపుతూ
రైతుల,సేద్యశ్రమకూలీల వదనసీమల్లో
ఆనందాల పంటలు పండిస్తూ

సర్వప్రజల కళ్ళను కళకళలాడిస్తూ,
తెలతెలవారక ముందే
ఇళ్ళ ముంగిళ్ళలో ముద్దుగుమ్మలతో
ముద మారగా ముగ్గులు వేయిస్తూ,
డూడూ బసవన్నల వెంబడి తిరుగుతూ

హంగామా చేసే బాలబాలికలతోనూ
సకినాలూ,అరిసెలూ వగైరా పిండివంటలతో
వంటిళ్ళనూ ఘుమఘుమలాడిస్తూ

మూడురోజుల పండుగగా జనహృదయాలపై
నీదైన సంతకం చేసే
సంక్రాంతిలక్ష్మీ నీకు స్వాగతం!!!

- 'రఘువర్మ'
9290093933

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# సంక్రాంతి రైతు కేంద్రిత పండుగ



భారతీయ సంస్కృతి అనేది కేవలం ఆచారాల సమాహారం మాత్రమే కాదు. అది మానవ జీవన విధానానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి, కాలచక్ర మార్పులకు ప్రతిబింబంగా నిలిచిన ఒక విశాలమైన జీవన తత్వం. ఈ సంస్కృతిలో పండుగలు ఆనందోత్సవాలుగా మాత్రమే కాకుండా, సామాజిక వ్యవస్థను సమగ్రంగా నిలబెట్టే సాధనాలుగా రూపుదిద్దుకున్నాయి. భారతదేశంలో పండుగలు వ్యవసాయం, కుటుంబ వ్యవస్థ, ఆర్థిక చక్రం, సామాజిక ఐక్యతతో గాఢంగా ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు ఒక విశిష్టమైన స్థానం ఉంది.

మానవ నాగరికత ప్రారంభ దశలో, సుమారు 8000 సంవత్సరాల క్రితం వ్యవసాయం స్థిరపడిన తరువాత కాలగణనకు, ఋతు మార్పులకు ప్రాధాన్యం పెరిగింది. వేట ఆధారిత జీవితం నుండి వ్యవసాయ ఆధారిత జీవనానికి మారిన మనిషి, విత్తనం వేసే కాలం, పంట కోసే కాలం మధ్య ఉన్న సహజ సంబంధాన్ని గమనించాడు. ఈ అనుభవమే పండుగల రూపకల్పనకు పునాది అయింది. భారత ఉపఖండంలో సూర్యుని చలనాన్ని, భూమి ఋతువుల మార్పును శాస్త్రీయంగా గమనించిన సంప్రదాయం కనీసం 5000 సంవత్సరాల నాటిదిగా చరిత్ర సూచిస్తుంది. సంక్రాంతి ఈ ఖగోళ జ్ఞానానికి, వ్యవసాయ అనుభవానికి ప్రతిరూపంగా ఎదిగింది.

సంక్రాంతి అనే భావన సూర్యుడు ఒక రాశి నుండి మరో రాశిలోకి ప్రవేశించే క్షణాన్ని సూచిస్తుంది. సంవత్సరంలో 12 సంక్రాంతులు ఉన్నప్పటికీ, మకర సంక్రాంతికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ సమయంలో సూర్యుడు దక్షిణాయనం నుండి ఉత్తరాయనానికి ప్రయాణం ప్రారంభిస్తాడు. ఈ మార్పు భూమిపై వెలుగు పెరగడానికి, ఉష్ణోగ్రతల మార్పుకు, జీవచక్రంలో చైతన్యానికి దోహదపడుతుంది. భారతీయులు దీనిని కేవలం ఖగోళ ఘటనగా కాకుండా, జీవన పునరుత్థానానికి ప్రతీకగా భావించారు.

వేదకాలం నుంచే సంక్రాంతి ఆచరణలో ఉన్నట్లు వేద సాహిత్యంలో సూచనలు కనిపిస్తాయి. ఋగ్వేదంలో సూర్యుని శక్తి, జీవనానికి అతని పాత్ర విస్తృతంగా ప్రస్తావించబడింది. యజుర్వేద కాలంలో ఋతువుల ప్రాముఖ్యత, వ్యవసాయ క్రమబద్ధత స్పష్టంగా రూపుదిద్దుకున్నాయి. ఉపనిషత్తుల కాలంలో ఉత్తరాయణాన్ని మోక్ష మార్గంగా భావించడం ప్రారంభమైంది.

భారతీయ వ్యవసాయ సంస్కృతిలో సంక్రాంతి ప్రధానంగా పంట కోత పండుగ. ధాన్యం ఇంటికి చేరిన సమయంలో రైతు తన శ్రమకు ఫలితం పొందుతాడు. సంప్రదాయ గ్రామీణ సమాజాల్లో వార్షిక ఆదాయంలో సుమారు 40% నుండి 50% వరకు భాగం సంక్రాంతి కాలంలోనే రైతుల చేతికి వచ్చేది.

గ్రామీణ జీవనంలో సంక్రాంతి భోగి, సంక్రాంతి, కనుమ అనే దశలుగా విస్తరించిన సామాజిక ప్రక్రియ. భోగి నాడు పాత వస్తువులను తొలగించడం ద్వారా పాత సమస్యలను వదిలివేయాలనే సంకేతం కనిపిస్తుంది. సంక్రాంతి నాడు కుటుంబ సభ్యులు, బంధువులు ఒకచోట చేరతారు. కనుమ నాడు పశువులను గౌరవించడం ద్వారా వ్యవసాయంలో వాటి పాత్రను గుర్తిస్తారు.

సామాజిక స్థాయిలో సంక్రాంతి కుల, వర్గ భేదాలను కొంతవరకు మసకబార్చుతుంది. పరస్పరం ఆహారం పంచుకోవడం, దానధర్మాలు చేయడం, ముగ్గులు, జానపద కళలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయి. కాలక్రమంలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ప్రభావంతో పండుగ ఆచరణలో మార్పులు వచ్చినప్పటికీ, సంక్రాంతి భావసారం కొనసాగుతోంది. సాంకేతిక పురోగతి కారణంగా దూరంలో ఉన్న కుటుంబ సభ్యులు కూడా భావోద్వేగ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. పట్టణ యువతలో సుమారు 70% మంది సంక్రాంతి సందర్భంగా సాంకేతిక మాధ్యమాల ద్వారా కుటుంబంతో సంప్రదింపులు కొనసాగిస్తున్నారు.

పర్యావరణ చైతన్యం పెరిగిన నేపథ్యంలో సహజ రంగులతో ముగ్గులు, స్థానిక ఆహార వినియోగం వంటి చర్యలు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ సమగ్ర విశ్లేషణను ముగిస్తూ ఒక మూల సత్యాన్ని మరింత స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. సంక్రాంతి అసలైన అర్థంలో రైతు పండుగ. భూమిని దున్ని, విత్తనం వేసి, వర్షాన్ని ఎదురుచూసి, పంటను పెంచి, కోసి, ధాన్యాన్ని ఇంట్లో రాసులుగా పోసుకున్న రైతు పొందే అంతర్లీన సంతృప్తికి ప్రతిరూపమే ఈ పండుగ. ఇది కేవలం ఆచారాల సమాహారం కాదు; శ్రమకు సమాజం ఇచ్చే నైతిక గుర్తింపు.

ఆధునిక జీవన ఒత్తిడులు, వినియోగ ధోరణులు ఎంత పెరిగినా, సంక్రాంతి రైతు కేంద్రిత భావనను పూర్తిగా కోల్పోలేదు. గ్రామీణ సమాజంలోనే కాదు, పట్టణాల్లో నివసించే తెలుగు ప్రజల మనస్సుల్లో కూడా ఈ పండుగ రైతు శ్రమను గుర్తుచేసే ఒక సాంస్కృతిక జ్ఞాపకంగా నిలిచింది. అందుకే సంక్రాంతి తెలుగు ప్రజల సామాజిక జీవనానికి మూలాధారంగా, వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా, రైతు శ్రమకు గౌరవ చిహ్నంగా తరతరాలుగా శాశ్వతంగా నిలుస్తుంది.

- డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి



# శాంతిని, కాంతిని పంచే సంక్రాంతి



తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి. ఈ పండుగ పేరు వినగానే ముగ్గులు, గొబ్బెమ్మలు, హరి దాసులు, గంగిరెద్దులు, భోగిమంటలు, కోడి పందేలు, గాలిపటాలు, చెరుకు గడలు, రేగిపళ్ళు, తేగలు, అరిసెల వంటి పలు పిండి వంటలు ఇలా ఎన్నో గుర్తు కొస్తాయి. ఈ పండుగలో కనిపించే ప్రతి అంశం వెనుక స్పష్టమైన ఆధ్యాత్మిక, సామాజిక కారణాలున్నాయి. ఇది మూడు రోజుల పండుగ. ఇందులో తొలి రోజు భోగి. దక్షిణాయణ పుణ్యాకాలానికి చిట్టచివరి రోజు ఇదే. మన పండుగలన్నింటికీ స్పష్టమైన తిథులుండగా, ఈ భోగిపండుగకు మాత్రం ఎలాంటి తిథి ఉండదు. రుగ్వేదం లోని 'అగ్నిమిళే పురోహితం' అనే సూక్తిని అనుసరించి, అగ్ని ఆరాధనతో తొలిరోజు ప్రారంభమవుతుంది. అసలైన భోగాన్ని కలిగించమని, అమంగళాలు తొలగించాలని ప్రార్థిస్తూ అగ్నిహోత్రునికి చేసే పూజగా దీనిని భావించొచ్చు. మన పురోగతికి ఆటంకాలు కలిగించి ఆలోచనలను, రాగద్వేషాదాలను, అక్కరలేని కోపతాపాలను, అజ్ఞానాన్ని.. జ్ఞానం అనే మంటలో దగ్ధం చేయాలనే సందేశాన్ని ఈ భోగిమంట మనకు చెబుతోంది. భోగి రోజే చిన్నారులకు భోగి పళ్లు పోస్తారు. చిన్నారులకు దృష్టిదోషం పోవాలని, సకల శుభాలు చేకూరాలని కోరుతూ చేసుకునే సామాజిక సంబరమిది.



ఇందులో ఔషధగుణాలున్న రేగిపళ్లు, దేవగురువైన బృహస్పతి అనుగ్రహం కోసం నానబెట్టిన శనగలు, దిష్టిని పోగొట్టే కొన్ని ద్రవ్యాలు, వక్కలు, శుభాలు కలిగించే చామంతి, గులాబీ, అక్షతలు, చిల్లర నాణేలను కలిపి చిన్నపిల్లల తలపై పోస్తారు.

రెండవ రోజు మకర సంక్రాంతి. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సందర్భం గనుక ఈ రోజును మనం మకర సంక్రాంతి అంటున్నాం. సూర్యుడు కొత్త రాశిలోకి మారిన ప్రతి సందర్భాన్నీ సంక్రాంతి అనే అంటారు. అయితే, ఇతర సంక్రాంతుల కంటే మకర సంక్రాంతి రోజు సూర్యుడి చుట్టూ భూమి తిరిగే కక్ష్యలో ఒక ముఖ్యమైన మార్పు ఉంటుంది. ఈ రోజున మనం పుడమి తల్లిని అనుభూతి చెందే విధానంలో ఒక కొత్త మార్పుని తీసుకువస్తుంది. ఈ మార్పే ఈ భూమిమీద సకల జీవరాశి పాలనా, పోషణకు ఆధారంగా ఉంది. మన పంట వేసింది మొదలు ఇంటికి చేరేవరకు.. తమకు సాయపడిన శ్రామిక వర్గాన్ని ఈ పండగనాడు రైతులు ఇంటికి పిలిచి, పిండివంటలతో వారికి భోజనం పెట్టి, వారికి తమకున్నంతలో పంటను పంచటం జరుగుతుంది. ఇందులో ఎదుటివారి శ్రమను గుర్తించాలనే సందేశం, ఉన్న సంపదను నలుగురూ పంచుకోవటంలో ఉండే ఆనందం వేరనే భావనలు ఇమిడి ఉన్నాయి.

మూడవ రోజైన కనుమనాడు.. ఏడాది పొడవునా వ్యవసాయంలో సాయపడిన పశువులను కుటుంబ సభ్యులుగా భావించి, ఈ రోజున వాటికి పూర్తి విశ్రాంతినిస్తారు. ఆ రోజున పశువులను అలంకరించి పూజ చేస్తారు. మద్ది, నల్లేరు, మారేడు వంటి పలు చెట్ల నుంచి సేకరించిన భాగాలను చిన్న ముక్కలుగా చేసి రోట్లో వేసి దంచి, ఉప్పు కలిపి దీనిని పశువులకు తినిపిస్తారు. ఔషధ గుణాలున్న ఈ ఉప్పు చెక్క సర్వరోగ నివారిణిగా పనిచేసి పశువులు అనారోగ్యం పాలవకుండా కాపాడుతుంది. కనుమ రోజు మినుము తినాలని సామెత. శరీరానికి అవసరమైన వేడిని పుట్టించే స్వభావమున్న మినుములతో చేసిన గారెలు తినటం వల్ల శరీరానికి తగినంత ఇనుము కూడా అందుతుంది.

ఈ పండుగ రోజుల్లో కనిపించే హరిదాసు హరినామం చేస్తూ వచ్చి భిక్ష స్వీకరిస్తారు. తన భక్తుల కోసం సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే హరిదాసుగా వస్తాడని, ఆయన నెత్తిమీద పెట్టుకుని గుండ్రటి పాత్ర.. భూమికి సంకేతమని పెద్దలు చెబుతారు. 'తిలవస్నేహ మాదస్య గుడవాన్ మధురం వద!'(నువ్వులతో శక్తి అనే స్నేహాన్ని పంచు. తీయని బెల్లంలాగా ఇతరులతో మాట్లాడు) అనే సూక్తిని అనుసరించి ఈ పండుగ వంటల్లో నువ్వులు, బెల్లం వాడ తారు. ఈ పండుగ వేళ.. నువ్వులు, బెల్లం కలిపి చేసిన వంటకాలు తినటం వల్ల 6 నెలలకు అవసరమైన శక్తి లభిస్తుందని ఆరోగ్య సూత్రం. సంక్రాంతి ముగ్గుల వెనక సాంస్కృతిక, ఆధ్యాత్మిక, తాత్విక, శాస్త్రీయ దృక్పథాలున్నాయి. రాళ్లు, రప్పలు తొలగించి చక్కగా అలికిన నేల.... మేఘాలు లేని ఆకాశానికి సంకేతమైతే, పద్ధతి ప్రకారం పెట్టే చుక్కలు ఆకాశంలోని నక్షత్రాలను సూచిస్తాయి. ఆ చుక్కలను కలుపుతూ అందంగా తీర్చిదిద్దే ముగ్గు ఖగోళంలో ఎప్పటికప్పుడు జరిగే మార్పులకు సంకేతం. ముగ్గు మధ్యలో పెట్టే చుక్క సూర్య స్థానానికి సంకేతం కాగా, ముగ్గులో పెట్టే గీతలు స్థితి శక్తికి, చుక్కలు గతి శక్తికి సంకేతాలుగా చూస్తారు. పండగ చివరి రోజు వేసే రథం ముగ్గు సామాజిక ఐక్యతను సూచిస్తుంది. మూడు రోజులు అందరికీ ఆనందాన్ని పంచే సంక్రాతిని ఘనంగా సాగనంపడానికి ఉద్దేశించినదే రథం ముగ్గు. ఈ ముగ్గును ప్రతి ఒక్కరూ తమ పొరుగింటి ముగ్గుతో అనుసంధానం చేయటం వెనక అందరూ కలిసి సమైక్య జీవనాన్ని కొనసాగించాలనే సందేశంతో బాటు 'సంఘేశక్తిః కలౌయుగే'అనే సామాజిక సూత్రాన్ని మనకు గుర్తుచేస్తుంది.

- గోరంట్ల శివరామకృష్ణ
9985216695

# మహోద్భుతం...మకర జ్యోతి దర్శనం



మకర జ్యోతి అనేది కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంతో ముడిపడి ఉన్న ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక దృశ్యం. ఇది ప్రతి సంవత్సరం జనవరి 14 (మకర సంక్రాంతి) నాడు భక్తుల దృష్టికి వస్తుంది. లక్షలాది మంది భక్తులు అయ్యప్ప స్వామి ఆశీర్వాదం పొందేందుకు శబరిమల చేరుకుంటారు. ఈ కాంతి భక్తుల హృదయాల్లో భక్తి, విశ్వాసం, మరియు ఆధ్యాత్మికతను కలిగిస్తుంది.

మకర జ్యోతి... మకర సంక్రాంతి రోజున శబరిమల వద్ద కనిపించే ఓ ప్రకాశం. ఈ కాంతి పొన్నంబలమేడు అనే కొండ ప్రాంతంలో వెలువడుతుంది. భక్తుల నమ్మకం ప్రకారం, అయ్యప్ప స్వామి తన భక్తులపై కరుణ చూపించడానికి ప్రత్యక్షమవుతాడని భావిస్తారు. ఈ జ్యోతి దర్శనం ఒక పవిత్రమైన అనుభవంగా పరిగణించ బడుతుంది.మకర జ్యోతి చరిత్ర పురాణాలతో ముడిపడి ఉంది.

అయ్యప్ప స్వామి, శివుడి మరియు విష్ణుమూర్తి అవతారం అయిన మోహిని సంయోగంతో పుట్టిన దేవతా అవతారం. ఆయన మహిషాసురుని సంహరించి, భక్తుల రక్షణ కోసం శబరిమల కొండలపై నివాసముండాలని నిర్ణయించుకున్నారని,మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి తన భక్తులకు దివ్య దర్శనం ఇస్తాడనే విశ్వాసం ఉంది.

మకర సంక్రాంతి అనేది సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలం. ఇది కొత్త ఆరంభాలకు సంకేతం. భూమి మరియు ఆకాశం పరమాత్మతో ఒకటైనట్లు ఈ జ్యోతి సూచిస్తుంది.మకర జ్యోతి సందర్భంగా మరో ముఖ్యమైన అంశం మకర విలక్కు. ఇది అయ్యప్ప ఆలయ ప్రధాన గర్భగృహంలో వెలిగే దివ్య దీపం. ఈ దీపం భక్తుల హృదయాల్లో దేవతా కాంతి వెలిగించే పావన చిహ్నంగా పరిగణించ బడుతుంది.మకర జ్యోతి చుట్టూ కొన్ని వివాదాలు, చర్చలు ఉన్నాయి.భక్తుల నమ్మకం ప్రకారం, మకర జ్యోతి దైవికమైనది. ఇది స్వామి అయ్యప్ప స్వరూపంలో భక్తుల కరుణకు సంకేతంగా ప్రత్యక్షమవుతుంది.

కొంతమంది శాస్త్రవేత్తలు మకర జ్యోతిని సహజ ఖగోళ సంబంధిత సంఘటనగా వివరిస్తారు.కొంతమంది మకర జ్యోతిని మానవ నిర్మిత కాంతి అని, ప్రామాణికతపై అనుమానాలను వ్యక్తం చేస్తూ, ఇది భక్తులను ఆకర్షించే ఆచారంగా మాత్రమే ఉందని వాదిస్తారు.

మకర జ్యోతి గురించి విభిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఇది లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక ప్రేరణను ఇస్తూనే ఉంది.

మకర జ్యోతి దర్శనం కోసం భక్తులు శబరిమల యాత్ర చేపడతారు. ఈ యాత్రలో 41 రోజుల దీక్ష ముఖ్యమైనది.భక్తులు వ్రతం ద్వారా శారీరక మరియు మానసిక శుద్ధి సాధిస్తారు. పంబా నదిలో పవిత్ర స్నానం చేసి, అయ్యప్ప గుడికి చేరుకుంటారు.భక్తులు పంబా నది తీరాన పాండవులు తపస్సు చేసిన ప్రదేశాన్ని సందర్శిస్తారు.మకర జ్యోతి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యమైనది. ఇది ఆధ్యాత్మిక స్పష్టతకు, దివ్య ప్రకాశానికి సంకేతం. దీక్ష ద్వారా భక్తులు తమ ఆత్మను పరిశుభ్రం చేసుకుంటారు. మతం, కులం, భాషతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాల నుండి భక్తులు ఒక చోట చేరి సమైక్యతను ప్రదర్శిస్తారు. మకర జ్యోతి అనేది హిందూ సంప్రదాయంలో ఒక పవిత్రమైన సంఘటన. ఇది దైవం పట్ల విశ్వాసం, ఆధ్యాత్మికత, మరియు భక్తి పరిపూర్ణతకు ప్రతీక. వివాదాలు ఉన్నప్పటికీ, మకర జ్యోతి అనేది లక్షలాది మంది భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆధ్యాత్మిక అనుభవం. మకర జ్యోతి భావన, నమ్మకాలు, ఆచారాలు భారతీయ సంస్కృతిలో విలక్షణ స్థానం పొందాయి.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

# సంఘ సంస్కర్త త్రిపురనేని



'కవిరాజు'గా ప్రసిద్ధి చెందిన త్రిపురనేని రామస్వామి చౌదరి న్యాయవాది, ప్రముఖ హేతువాది రచయిత, మనసా, వాచా, కర్మణా సంఘ సంస్కర్త. హేతువాదం, మానవతా వాదం తెలుగు కవిత్వం, సాహిత్యాల్లోకి మొదటి సారిగా ప్రవేశపెట్టిన కవిగాత్రిపురనేని రామస్వామిని భావిస్తారు. త్రిపురనేని రామస్వామి 1887 జనవరి 15 న కృష్ణా జిల్లా, అంగలూరు గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. నాటికే భారత దేశంలో ప్రచారంలో ఉన్న సామాజిక-మత సంస్కరణ ఉద్యమాలలో పాల్గొన్నారు. రాజా రామ్‌మోహన్‌రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, గోవిందరనడే, దయానంద సరస్వతి మొదలైన వారి ఆదర్శాలను ప్రజల లోనికి తీసుకు రావడానికి ఉద్యమించిన వారిలో రామస్వామి ఒకరు.

రామస్వామి రైతు కుటుంబంలో పుట్టినా చిన్నప్పటినుడి సాహితీ జిజ్ఞాసతో పెరిగారు. 23వ యేట మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణుడైనారు. అదే సంవత్సరం ఆయన పల్నాటి యుద్ధం ఆధారంగా 'కారెంపూడి కదనం', మహాభారత యుద్ధం ఆధారంగా 'కురుక్షేత్ర సంగ్రామం' రెండు నాటికలు రచించారు. 1911లో ఇంటర్మీడియట్ చదవడానికి బందరులోని నోబుల్ కాలేజీలో చేరాక, అక్కడ అవధానము చేసి తన సాహితీ నైపుణ్యాన్ని, అద్భుతమైన జ్ఞాపకశక్తిని ప్రదర్శించారు.

1898లో పున్నమ్మను పెళ్ళి చేసుకున్నారు. 1910లో వారికి కలిగిన కుమారుడే ప్రఖ్యాత రచయిత, త్రిపురనేని గోపీచంద్. 1914లో న్యాయశాస్త్రం చదివేందుకు డబ్లిన్ వెళ్ళి, ఆంగ్ల సాహిత్యం, ఆధునిక ఐరోపా సంస్కృతి కూడా చదివారు. డబ్లిన్‌లో చదువుతున్న రోజుల్లోనే అనీ బీసెంట్ ప్రారంభించిన హోంరూల్ ఉద్యమానికి మద్దతు ఇవ్వవలసినదిగా భారతీయులకు విజ్ఞాపన చేస్తూ కృష్ణా పత్రికలో అనేక రచనలు చేశారు. రామస్వామి స్వాంతంత్ర్యోద్యం రోజులలో ప్రజలకు స్ఫూర్తినిచ్చి ఉత్తేజ పరచే అనేక దేశభక్తి గీతాలు రచించారు. 1917లో భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కొన్ని సంవత్సరాలు మచిలీ పట్నంలో న్యాయవాద వృత్తి నిర్వహించారు. కానీ ఆయన ముఖ్య వ్యాసంగం సంఘ సంస్కరణే. స్మృతులు, పురాణాలు, వ్యవస్థీకృత మతం వలన వ్యాపించిన కుల వ్యవస్థ మీద, సామాజిక అన్యాయాల మీద ఆయన పూర్తి స్థాయి ఉద్యమం ప్రారంభించారు. 1922లో గుంటూరు జిల్లా, తెనాలిలో స్థిరపడ్డారు. 1925లో తెనాలి పురపాలక సంఘ చైర్మనుగా ఎన్నికయ్యాడు. తెనాలి మున్సిపాలిటీ చైర్మెన్‌గా ఉన్నపుడు, గంగానమ్మ కొలుపులలో నిర్వహించే జంతుబలిని నిషేధించారు. ఫలితంగా ఆయనను చైర్మను పదవి నుండి తీర్మానం ద్వారా తొలగించగా, వెంటనే జరిగిన ఎన్నికల్లో మళ్ళీ ఎన్నికై, తిరిగి చైర్మను అయ్యారు. జంతుబలులు మాత్రం సాగలేదు. 1938 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. సూతాశ్రమం అనిపేరు పెట్టుకున్న ఆయన ఇల్లు రాజకీయ, సాహిత్య చర్చలతో కళకళలాడుతూ ఉండేది.

సంస్కృత భాషలో ఉన్న పెళ్ళి మంత్రాలను తెలుగులోకి అనువదించి, అచ్చులో సరళమైన వివాహవిధి అను పద్ధతిని తయారు చేసారు. ఆయన స్వయంగా అనేక పెళ్ళిళ్లకు పౌరోహిత్యం వహించి జరిపించారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1943 జనవరి 16న త్రిపురనేని రామస్వామి మరణించారు. 1987వ సంత్సరంలో భారతదేశ ప్రభుత్వం ఆయన స్మారక చిహ్నంగా ఆయన పేరు మీద తపాళా బిళ్ళను జారీ చేయడం జరిగింది.

ప్రజలను మేలుకొలిపే హేతువాద భావాలను వ్యక్తపరచడానికి సాహితీ రచనలను సాధనంగా త్రిపురనేని ఎంచుకున్నారు. రామస్వామి తన ఆలోచనలను సాహిత్యం ద్వారా వ్యక్త పరచడమే కాక ఆచరణలో పెట్టడానికి కూడా ప్రయత్నించారు.

'వీరగంధము తెచ్చినారము/ వీరుడెవ్వడో తెల్పుడీ
పూసి పోదుము మెడను వైతుము/ పూల దండలు భక్తితో'...
గేయం త్రిపురనేని రచనే.

ఒకరుడు 'వేదమే' భగవదుక్తమటంచు నుపన్యసించునిం
కొకరుడు 'బైబిలే' భగవదుక్త మటంచును వక్కణించు, వే
రొకరుడు మా 'ఖొరాన్' భగవదుక్త
మటంచును వాదులాడు, నీ
తికమక లేల పెట్టెదవు? తెల్పగరాదె నిజంబు నీశ్వరా...

మా మతం గొప్పదంటే కాదు మా మతం గొప్పదని వాదులాడే మతోన్మాదులను ఈసడిస్తూ రాశారు. సూత పురాణము, శంబుక వధ, సూతాశ్రమ గీతాలు, ధూర్త మానవ శతకము, ఖూనీ, భగవద్గీత, రాణా ప్రతాప్, కొండవీటి పతనము, కుప్పుస్వామి శతకం, గోపాల రాయ శతకం, పల్నాటి పౌరుషం, వివాహ విధి తదితరాలు త్రిపుర నేని ముఖ్య రచనలు. ఆయన సాహిత్య కృషిని గుర్తించి, ఆంధ్ర మహాసభ ఆయనకు కవి రాజు అనే బిరుదునిచ్చి గౌరవించింది. 1940లో గుడివాడ ప్రజానీకము గజారోహణ సన్మానము చేసారు.

త్రిపురనేని రామస్వామిగారిని తరచుగా పెరియార్ రామస్వామితో పోలుస్తారు. దానికి స్థూలమైన కారణం ఇద్దరూ బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంలో వున్నారు అనే భ్రమ. కాని నిజానికి పెరియార్కీ, రామస్వామికీ ఏ రకమైన పోలికలూ లేవు. పెరియార్ ఆవేశపరుడు, రామాయణం అంటే కోపం, బ్రాహ్మల వల్లే తమిళనాడంతా పాడయిందని పెద్ద ఉద్యమం లేవదీశాడు. కాని రామస్వామి పెరియార్ కన్నా చాలా ముందు తన ఆలోచనలు సిద్ధాంతపూర్వకంగా చెప్పాడు.

జనవరి 15 త్రిపురనేని రామస్వామి జయంతి
- ఆర్‌కేఎస్

# 18న సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేక దృష్టి



- ఆదివాసీ సంప్రదాయాలకు ప్రతిబింబంగా ల్యాండ్ స్కేపింగ్
- క్యూ లైన్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ములుగు, జనవరి 13(మనం ప్రతినిధి):** ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో, జాతర పనుల పురోగతిని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆమె మేడారం గద్దెల ప్రాంగణం చుట్టూ కొనసాగుతున్న ల్యాండ్స్కేపింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆదివాసీ-గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ల్యాండ్స్కేపింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణంలో ఔషధ వనమూలికలు, ఇప్ప పువ్వు వంటి సంప్రదాయానికి ప్రాధాన్యమైన మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. ఈ మొక్కలను మంత్రి సీతక్కతో పాటు జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ప్రత్యేకంగా ఎంపిక చేసినట్లు వివరించారు. ల్యాండ్స్కేపింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా సమీపంలో నిర్మాణంలో ఉన్న క్యూ లైన్ కాంప్లెక్స్ పనులను మంత్రి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఈ పంచాయతీ రాజ్ అధికారిని మంత్రి సీతక్క ఆదేశించారు. భక్తుల సౌకర్యాల దృష్ట్యా పనుల్లో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డి ఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్ అండ్ బి ఈ ఎన్ సి, ములుగు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఈ ఓ వీరస్వామి, పి ఆర్ ఈ ఈ అజయ్ కుమార్, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటికల సాకారం

## కాంగ్రెస్ హయంలో రోడ్లకు మహర్దశ

## కాంగ్రెస్ సర్కారులో పేదలకు ఘనంగా సంక్షేమ ఫలాలు

## ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**సుల్తానాబాద్ జనవరి 14 (మనం న్యూస్):** సుల్తానాబాద్ పట్టణంలోని 2,3,4,5 వార్డుల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అర్హులైన 47 మంది లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నూతన నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి బుధవారం భూమి పూజ శంకుస్థాపనలు చేసి వారికి ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కళ సాకారం అవుతోందని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో సొంతిల్లు లేని పేద ప్రజలు అనేక మంది ఉన్నారని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఇంటి ఓనర్లను చేస్తామని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పేరిట పేదలను మోసం చేసిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీ పేదలకు ఒక్క ఇల్లు కూడా అందించలేదని, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని అన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ సర్కార్ అండగా ఉంటుందని తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సుల్తానాబాద్ పట్టణం సుందరంగా మారుతుందని పేర్కొన్నారు. పట్టణ సుందరీకరణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. గతంలో నిర్వీర్యమైన అభివృద్ధి పనులు కాంగ్రెస్ హయంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం సుల్తానాబాద్ పట్టణాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. సుల్తానాబాద్ పట్టణంలో పాత తాలూకాలో ఉన్న కార్యాలయాలు, టీబీ హాస్పిటల్, పలు కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయంలో తరలి వెళ్లిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకులు కొత్త కార్యాలయాలు సుల్తానాబాద్ కు తీసుకురావడం మానేసి పట్టణంలో పాత తాలూకాలో ఉన్న కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలింపు ద్వారా సుల్తానాబాద్ పై అప్పటి బి.ఆర్.ఎస్ ప్రభుత్వానికి సవతి తల్లి ప్రేమ కనిపిస్తుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో, బైపాస్ రోడ్డు, సుల్తానాబాద్ లో సెంట్రల్ లైటింగ్లు, డబల్ లైన్ రోడ్లు, అనేక అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో చేస్తున్నట్లు తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని గుర్తు చేశారు. వాటిని ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సుల్తానాబాద్ పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తు చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రమేష్, మున్సిపల్ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## ములుగు రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

# దుప్పట్లు బట్టల పంపిణీ



**ములుగు, జనవరి 13, మనం ప్రతినిధిః** ములుగు జిల్లా ములుగు మండలం జగనన్న గూడెం బోడ రామయ్య గడ్డ గుత్తి కోయగూడెంలో ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ (స్టేట్ బ్రాంచ్) అధ్యక్షుడు జిష్ణు దేవ్ వర్మ ఆదేశాల మేరకు ములుగు జిల్లా కలెక్టర్, ములుగు జిల్లా ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ అధ్యక్షులు దివాకర టి.ఎస్. ఐఎఎస్ సూచన మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏ అప్పయ్య ఆధ్వర్యంలో అభయ ఫౌండేషన్ అందించిన దుస్తులను 20 కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ జి. శ్రీనివాస్, కోశాధికారి ఎస్.సతీష్, కార్యదర్శి సిహెచ్. రమేష్ ములుగు జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు జి. మహిపాల్ రెడ్డి, ములుగు జిల్లా వాలెంటీర్స్ ఎస్.రవీందర్రెడ్డి,పింగిలి నాగరాజు. సర్పంచ్ ఈక కుమార్, గూడెం పెద్ద మాడవి లింగమూర్తి లతో గూడెంలో నివసిస్తున్న గుత్తి కోయలకు కుర్తాలు, పెట్టీకోట్లు, బ్లౌజ్లు, దుప్పట్లు, షార్టు, పైజామాలు, ప్యాంటు, షర్టులు, ఇతర రకాల దుస్తులు అందజేయడం జరిగినది ఈ సందర్భం గా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ములుగు చైర్మన్ డాక్టర్ ఏ అప్పయ్య మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ గుత్తి కోయగూడాలను అభివృద్ధి చేసే దిశలో వారికి అవసరమగు సామాగ్రిని వస్తువులను అందజేస్తుం దని తెలియజేశారు. ఈ సందర్భంగా చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారికి వివరించారు. అనారోగ్యంగా ఉన్న మహిళను పరీక్షించి త్వరగా ఆసుపత్రికి తీసుకుపోయి చికిత్స అందజేయాలని గూడెం పెద్ద కు తెలియజేసి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులతోపాటు గొట్టి కోయ సంఘం పెద్దలు,గోత్తి కోయవాసులు పాల్గొన్నారు.



## వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ రఘు

**జగిత్యాల జనవరి 14(మనం న్యూస్):** వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా మెట్ పల్లి నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు నియామకం అయినట్లు జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుమండ్ల మహేష్ బుధవారం తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడ అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి, అదేవిధంగా జిల్లాలో యువ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి డాక్టర్ రఘు కృషి చేస్తారని పేర్కొంటూ ఈ నియామకం జరిపినట్లు తెలిపారు. జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడను మరింత ప్రోత్సహించడానికి డాక్టర్ రఘు చిట్నేని సలహాలను, సూచనలను పాటిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ రఘు నియామకం పట్ల అసోసియేషన్ సభ్యులు, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నూతనంగా జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ రఘు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన నియామకం పట్ల సహకరించిన అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

## మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ

## రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్




**గోదావరిఖని, జనవరి 14 (మనం న్యూస్)ః** సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యుడు ఎంఎస్ రాజ్ ఠాకూర్. ఈ మేరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో భాగంగా జరిగిన ముత్యాల ముగ్గుల పోటీలలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ లతో కలిసి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇటువంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముందుగా ముగ్గుల పోటీలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేత

**చేవెళ్ల, జనవరి 14(మనం న్యూస్):** మున్సిపల్ కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...హౌసింగ్ బోర్డు కాలనీలోని కూరగాయల మార్కెట్ లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని, ప్లాస్టిక్ కవర్లను శుభ్రం చేయించాలని కోరారు. అదేవిధంగా మల్కాపూర్ రోడ్డులో డ్రైనేజీ పగిలి డ్రైనేజీ నీరంతా రోడ్డుపై పారడంతో అటుగా వెళ్లే పాదచారులకు, వాహనదారులకు తీవ్రంగా దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. తక్షణమే అట్టి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ విషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు కాలనీ యువకులు తదితరులున్నారు.

# బోగి మంటల్లో.. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు..

## కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం... నమ్మి ఓటేస్తే ప్రజలను నట్టేట ముంచారు

## మోసపూరిత కాంగ్రెస్ పార్టీ పాలనకు చరమగీతం పాడాలి

## రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, జనవరి 14 (మనం న్యూస్)ః** కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని, నమ్మి ఓటేస్తే ప్రజలను నట్టేట ముంచారని, మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం గోదావరిఖని ప్రదాన చౌరస్తాలో బోగి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 420 హామీల పత్రాలను బోగి మంటల్లో వేసి బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే ప్రజలను నట్టేట ముంచారని అన్నారు. 2 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతంగానికి కన్నీళ్లే మిగిలాయన్నారు. కేసీఆర్ హాయంలో రైతులకు రైతుబంధు, రైతుభీమా, ఎరువుల పంపిణీ, 24 గంటల ఉచిత కరెంట్ అందించారని కొనియాడారు. రైతులను రోడ్డు మీదకు తీసుకువచ్చిన ఘనత రేవంత్ సర్కార్ కు దక్కుతుందని, యూరియా కోసం రోజుల తరబడి దుకాణాల ముందు ఎదురుచూడాల్సిన దుస్థితి కాంగ్రెస్ పాలనలో వచ్చిందన్నారు. రామగుండంలో రెండు సంవత్సరాలుగా కమీషన్లు, కుల్చివేతలు చిరువ్యాపారులను రోడ్డుమీద తీసుకువచ్చారే తప్ప ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిందేమి లేదన్నారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీ పాలనకు చరమగీతం పాడాలని, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలంతా బిఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం

- చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి.

**చేవెళ్ల, జనవరి 14(మనం న్యూస్):** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషిచేస్తామని చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్దలోని 10వ వార్డులో నీటి సమస్య ఉందని చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డికి తెలిజేయడం జరిగింది.నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసుల సమస్యను తీర్చేందుకు చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డిలు నూతన బోరు వేయించారు. ఈ సందర్భంగా 10వ వార్డు సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషిచేస్తామని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మలిపెద్ది వెంకటేషంగుప్తా, మధుసూదన్ గుప్తా, 10వ వార్డు ప్రజలు ఉన్నారు.

# ధర్మారం గ్రామపంచాయతీ ఆవరణలో ముగ్గుల పోటీ



**శంకరపట్నం జనవరి 14 (మనం న్యూస్):** శంకరపట్నం మండలం ధర్మారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ చింతి రెడ్డి పద్మ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గులపోటి నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు, చిన్నారులు ముగ్గుల పోటీలో పాల్గొని ప్రతిభను కనబరిచారు.ఆడపిల్లలకు ముగ్గులు వేయడమంటే సహజంగానే ఇష్టపడుతారన, వారిలో ఉత్సాహాన్ని నింపడానికే ముగ్గుల పోటీ నిర్వహించామని సర్పంచ్ పద్మ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మానకొండూర్ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కవ్వ పద్మ, లింగాపూర్ మాజీ సర్పంచ్ కవ్వ శ్రీనివాస్ రెడ్డి, కన్నపూర్ మాజీ సర్పంచ్ తాటకొండ సదానందం, అమ్ములు, హాజరై అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి ఎలుకపల్లి నాగేశ్వరి, రెండవ బహుమతి జంగా అంజలి, తృతీయ బహుమతి హరిప్రియ పొందారు. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి రైతు ఇంట కాంతిని నింపాలి

- మంత్రి సీతక్క సహకారం మరువలేనిది
- జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి
- రైతులకు పట్టు వస్త్రాలు పంపిణీ
- వికాస్ అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు




**ములుగు, జనవరి 14, మనం ప్రతినిధిః** సంక్రాంతి పండుగ రైతుల జీవితాల్లో కొత్త కాంతిని నింపాలని ఆ దిశగా ప్రభుత్వాల సహకారం, ప్రకృతి కరుణ ఉండాలని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు బుధవారం మంగపేట మండలం అకినేపల్లి మల్లారం గ్రామంలో వికాస్ అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా నాసిరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయరంగ అభివృద్ధిలో మంత్రి శీతక్క సహకారం మరువలేనిదన్నారు సంక్రాంతి పర్వదినం వ్యవసాయ రంగానికి ప్రతీకగా రైతులు భావిస్తారని అన్నారు ఈ మకర సంక్రాంతి పర్వదిన సందర్భంగా వివేక ఎ ఫ్పి ఓ , వికాస్ అగ్రి ఫౌండేషన్ మరియు వికాస్ ఫర్టిలైజర్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు జరీ పట్టు వస్త్రాలను బహుకరించటం ఈ కార్యక్రమంలో తాను కుటుంబ సభ్యులతో హాజరు కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని సాంబశివరెడ్డి అన్నారు తమ సంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంక్రాంతి పండుగ సందర్భంగా రైతుల కోసం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నామని ఈ సంవత్సరం ఎంపిక చేసిన తొంబై మంది రైతులకు పట్టు వస్త్రాలను బహూకరించినట్లు ఆయన తెలిపారు తమ సంఘం పరిధిలోని రైతులందరికీ ఉచిత ప్రమాద బీమా పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని ఇందుకు సంబంధించిన కార్యాచరణను రూపొందించినట్లు సాంబశివ రెడ్డి ప్రకటించారు అనంతరం సంక్రాంతి కానుక గా రైతులకు జరి పట్టు రామ్ రాజ్ పంచలు చొక్కా ల ను సాంబశివరెడ్డి పంపిణీ చేశారు ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి కి పుష్పగుచ్చం అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి నాగిరెడ్డి కటుకూరు శేషయ్య ధూళిపాల బాలకృష్ణ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్ మొయినుద్దీన్ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు రాజమల్ల సుకుమార్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్కీ వెంకన్న జిల్లా పేసా కమిటీ అధ్యక్షులు డబ్బుల ముత్యాలరావు దొడ్డ భాస్కర్ రమేష్ కృష్ణారెడ్డి పెండ్యాల హరి కృష్ణ వికాస్ అగ్రి ఫౌండేషన్ డైరెక్టర్లు చెట్టుపల్లి తిరుపతిరావు జడ్డి పూర్ణ ప్రసాద్ నేలపట్ల శేషారెడ్డి వంద మందికి పైగా స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి

- ఎన్నికలు రాగానే భావోద్వేగ ప్రసంగాలతో కొందరు రాజకీయాలు చేస్తారు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**వేములవాడ,జనవరి14 (మనం న్యూస్):** వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు..బుధవారం వేములవాడ పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు..

వారు మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు..వేములవాడ పట్టణాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా, టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట ప్రభుత్వం ముఖ్యమంత్రి శ్ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఇప్పటికే 150 కోట్ల రూపాయలు మంజూరు చేశామని,పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే పట్టణంలో సుమారు 47 కోట్ల రూపాయలతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టామని, ఇది గత 50 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కీలకమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా మల్లారం జంక్షన్ నుండి బతుకమ్మ తెప్ప, బ్రిడ్జి మీదుగా జగిత్యాల బస్ స్టాండ్ (సాయి రక్ష) వరకు మొత్తం 3.6 కిలోమీటర్ల పరిధిలో 146 పోల్స్తో సుందరీకరణ పనులకు సుమారు 5 కోట్ల 25 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. జంక్షన్ల అభివృద్ధి కోసం తిప్పాపూర్ జంక్షన్ వద్ద 1 కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు విడుదలవుతున్నాయన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని 28 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, అదనంగా మరిన్ని ప్రాంతాల్లో పనుల కోసం 4 కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. పర్యాటక అభివృద్ధి లక్ష్యంగా టూరిజం శాఖ ద్వారా గుడి చెరువులో బోటింగ్ సౌకర్యానికి 1 కోటి 40 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. దసరా పండుగ సందర్భంగా జమ్మి చెట్టు వద్ద నడకకు ఇబ్బందులు లేకుండా 35 లక్షల రూపాయలతో పనులు చేపట్టినట్లు వివరించారు. కుల,మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం 1.30 కోట్లు,బీసీ భవన్ - 1.30 కోట్లు,ఎస్టీ భవన్ - 1.30 కోట్లు,క్రిస్టియన్ భవన్ - 1.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వేములవాడ పట్టణంలో ముస్లిం సోదరులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న షాదీ ఖానా అసంపూర్తి భవన నిర్మాణానికి 80 లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామని తెలిపారు. మురుగు నీరు గుడి చెరువులో,మూలవాగులో కలవకుండా నివారించేందుకు 10 కోట్ల రూపాయలతో ప్రత్యేక మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయన్నారు. గంగమ్మ తల్లి దేవాలయానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గంగపుత్రులకు ఇచ్చిన హామీ మేరకు 80 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజల సూచనలతో మరిన్ని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకువస్తామని విప్ ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

### ఎన్నికలు రాగానే భావోద్వేగ ప్రసంగాలతో కొందరు రాజకీయాలు చేస్తారు

ఫెడరల్ స్ఫూర్తితో పాలన సాగాలంటే సర్పంచ్ చేయాల్సిన పని సర్పంచ్, ఎంపీపీ చేయాల్సిన పని ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ చేయాల్సిన పని మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేలు చేయాల్సిన పనులు ఎమ్మెల్యేలు, ఎంపీలు చేయాల్సిన పనులు ఎంపీలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఎన్నికలు రాగానే భావోద్వేగ ప్రసంగాలతో ప్రజలను గందరగోళానికి గురి చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న శక్తుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గతంలో వేములవాడ మున్సిపల్ను బిఆర్ఎస్ పార్టీకి ఇచ్చారని,అలాగే బీజేపీకి అవకాశం ఇచ్చినప్పుడు జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తుచేసుకోవాలన్నారు. ప్రస్తుతం తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన రెండు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించి, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పరిపాలన కోసం కాంగ్రెస్ పార్టీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కావడంతో, వేములవాడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ చేతుల్లో ఉంటే మరిన్ని నిధులు, మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వేములవాడను ఆధ్యాత్మిక పట్టణంగా, టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఒక కన్ను దేవాలయంపై, మరో కన్ను పట్టణ అభివృద్ధిపై పెట్టి పట్టణాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నది కాంగ్రెస్ పార్టీ నినాదమన్నారు. గతంలో బిఆర్ఎస్, బీజేపీ పాలనలతో పోల్చి, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రజలు విజ్ఞులు, చైతన్యవంతులు అని, జరుగుతున్న పరిణామాలను గమనించి తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు గెలిచి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరిస్తేనే వేములవాడ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. భోగి, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా మరోసారి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వేములవాడ పట్టణ ప్రజలు తమ ఆశీస్సులు, సహకారం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రాణం తీసిన మాంజా



- ఫసల్వాదిలో విషాద ఘటన

**సంగారెడ్డి జనవరి 14 మనం న్యూస్ ప్రతినిధి:** మాంజా గొంతుకు కోసుకొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన సంగారెడ్డి మండలం పసల్వాది లో చోటు చేసుకుంది సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి కథనం ప్రకారం ఉత్తర్ ప్రదేశ్ కు ప్రాంతానికి చెందిన హరీష్ కుమార్ 30 వరి కోసేందుకు బసవధి గ్రామానికి వచ్చి ఇక్కడ కొద్ది రోజులుగా ఉంటున్నాడని అయితే బుధవారం నాడు సంగారెడ్డి నుండి బసవది గ్రామానికి కూరగాయల నిమిత్తం తీసుకొని వెళుతున్న సమయంలో అడ్డంగా వచ్చిన మాంజా గొంతుకు తగిలి తీవ్ర గాయాలు అవ్వడంతో 108 ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలోని చనిపోయాడని ఎస్ఐ తెలిపారు

## జర్నలిస్టుల అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యంపై దాడి



- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి జనవరి 14 మనం న్యూస్ ప్రతినిధి :** ఆ కారణంగా ఓ జర్నలిస్టును అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడం. నే అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు ఒక కథనం ప్రసారం చేసిన కారణంగా జర్నలిస్టులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. రేవంత్ సర్కార్ పాలనలో మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రజల సమస్యలను ప్రశ్నించిన జర్నలిస్టులపై కేసులు పెట్టి, అరెస్టులు చేయడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియాను భయపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జర్నలిస్ట్ లపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని, అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పోరాటాలు తప్పవని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరించారు.

# జర్నలిస్టులను అర్ధరాత్రి అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదు

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి జనవరి 14 మనం న్యూస్ ప్రతినిధి :** జర్నలిస్టులను అర్ధరాత్రి అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదని ఇది ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉంటుందని సీట్ అధికారులు సమయపాలన పాటించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రులపై ఐఏఎస్ అధికారులపై ఆధారాలు లేకుండా కించపరిచే కథనాలు ప్రసారంఅవ్వడాన్ని వ్యతిరేకించామని అన్నారు. సజ్జనర్ లాంటి సీనియర్ అధికారి తో సిట్ వేసి. నిజ నిజాలు బయటికి వస్తాయి కానీ సీట్ అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. అధికారులకు ఎవరి పైన అనుమానాలు ఉంటే వారికి నోటీసులు ఇచ్చి విచారించాలని పండగపూట సమయంలో ఇలాంటి అరెస్టులు చేయడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు.

# చైనా మాంజా వినియోగం నిషిద్ధం

- వాడినా, అమ్మినా కఠిన చర్యలు
- సుఖసంతోషాల నడుమ పండగను జరుపుకోవాలి
- ఒకరి ఆనందం, మరికరికి విషాదం కాకూడదు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జనవరి 14. మనం న్యూస్ ప్రతినిధిః ప్రజల ప్రాణ రక్షణను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలకు కారణమవుతున్న చైనా మాంజా (నైలాన్ దారాలు) వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. తెలియజేశారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం ఈ రోజు జిల్లా వ్యాప్తంగా చైనా మాంజా అమ్మకాలపై దాడులు నిర్వహించి, నిషేధిత చైనా మాంజాను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. చైనా మాంజా కారణంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పక్షులు తీవ్రంగా గాయపడటంతో పాటు ప్రాణ నష్టం సంభవించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి చైనా మాంజాను వాడినా లేదా అమ్మినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ పిల్లలను చైనా మాంజా వినియోగానికి దూరంగా ఉండేలా ఉంచాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ, చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాల నుండి ప్రాణ భద్రతకు సహకరించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా నిషేధిత చైనా మాంజా వినియోగించినట్లు సమాచారం ఉన్నట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

## ఉరివేసుకొని వ్యక్తి మృతి



**ములుగు,జనవరి 14మనం ప్రతినిధి :** ఉరేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్త్రై టీవీ ఆర్ సూరి తెలిపిన వివరాలు ప్రకారం మండల కేంద్రానికి చెందిన రాళ్లపల్లి వీర కిషోర్ అనే వ్యక్తి 18 నెలలుగా మద్యానికి బానిసయ్యారు. మానేయమని అతని భార్య స్వాతి ఎన్నిసార్లు చెప్పిన వినలేదు. ఈ మేరకు ఈ నెల 13న మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య స్వాతి మద్యం మానేయాలని మందలించడంతో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్ కు నైలాన్ తో ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్త్రై సూరి తెలిపారు.

# కమనీయం రమణీయం శ్రీ గోదా రంగనాథస్వామి కళ్యాణం



**, చిగురుమామిడి: జనవరి 14 (మనం న్యూస్)** అపార తిరుమల తిరుపతి గా పేరుపొందిన, సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు అంగరంగ వైభోగంగా, జరిపించారు అశేష భక్తుల సమక్షంలో శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణ వేడుకలను, శేషం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా జరిపించారు ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువు తీర్చగా కళ్యాణ వేడుకల్లో ప్రాధాన ఘట్టమైన జిలకర బెల్లం, వేడుకనుంచి తలంబ్రాల వరకు, భక్తుల జనుల సమక్షంలో మంగళ వాయిద్యాల మధ్య వేదమంత్రోచనాలతో కనుల పండుగగా జరిపించారు శ్రీ గోదా రంగనాథస్వామి కళ్యాణానికి హాజరైన భక్తులు తమ తమ గృహాలల్లో, కళ్యాణ వేడుకలు జరిగినట్లు ఆను భూతికిలోనయ్యారు, వేద పండితులు వివాహ వేడుకల ప్రాముఖ్యతను భక్తులకు వివరిస్తూ కళ్యాణం జరిపించిన తీరును ,అక్కడికి వచ్చిన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది, స్వామివారి కల్యాణానికి, హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు కళ్యాణం అనంతరం, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలానికి చెందిన పొట్లపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నాంపల్లిశంకరయ్య, అన్నప్రసాదం వితర చేశారు, ఈ కార్యక్రమంలో, అర్చకులు శేషం సత్యనారాయణ చార్యులు,, శేషం శ్రీహర్ష కుమారాచార్యులు, మురళీకృష్ణ, కామేష్ శర్మ, రోహిత్ కుమార్ శర్మ,ఆలయ చైర్మన్ చొల్లేటిశంకరయ్య, సుందరగిరి గ్రామ సర్పంచ్



జంగా శిరీష రమణారెడ్డి, ఆలయ ఈవో కొండపర్తి రాజకుమార్, ఆలయ ధర్మకర్తలు శేషం నరసింహచార్యులు,, బూర వీరేశం, పూల లచ్చిరెడ్డి, జీల సంపత్, గందె రాజయ్య, ఉప సర్పంచ్ మెడబోయిన, రాజు మమత,మాజీ సర్పంచ్ శ్రీ మూర్తిరమేష్, రాజు,, మాజీఆలయ చైర్మన్ తాళ్ల పెల్లి రాజా గౌడ్, ఆలయ జూనియర్ రికార్డ్ అసిస్టెంట్ బూట్ల కవిత, చిగురుమామిడి మండల ఉదయలక్ష్మి సమైక్య అధ్యక్షులు, గందే రజిత ,పెసరి శ్రీనివాస్, చిట్టంపల్లి నారాయణ, గోగూరి రాజిరెడ్డి గుండా శ్రీకాంత్ హైదరాబాద్, దాసరి శ్రీనివాస్ పద్మ, మోలుగురి శ్రీనివాస్, కక్కెళ్ళ తిరుపతి గౌడ్,, డీజే రాజు,గ్రామ ప్రజలు ఆలయ సిబ్బంది తదితరులున్నారు

# ప్రతి ఒక్కరు తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల కోసం హెల్మెట్ ధరించండి ఎస్త్రై చిరంజీవి



**కోరుట్ల జనవరి 13 (మనం న్యూస్)** ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యుల, తల్లిదండ్రుల కోసం హెల్మెట్ ధరించి ప్రయాణించాలని కోరుట్ల సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి సూచించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు (అటటజీర్ఫి అజూజీర్ఫి) అనే ప్రోగ్రాంలో భాగంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ అనే విషయంపై బుధవారం కోరుట్ల బస్టాండ్ వద్ద రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు అందరికీ ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. దానిలో భాగంగా హెల్మెట్స్ లేకుండా బైక్ పై ప్రయాణం చేసే వారికి, హెల్మెట్ ధరించి రోడ్డుపైన వెళ్తున్న వాడితో రోజాపూలు ఇచ్చివారు కూడా వారిలాగాహెల్మెట్ ధరించాలి అనేసి చెప్పిస్తూ హెల్మెట్ స్వచ్ఛందంగా ధరించిన వారందరికీ , సీటు బెల్టు పెట్టుకొని కారులో ప్రయాణిస్తున్న వారందరికీ, స్థానిక ఎస్ఐ ఎం. చిరంజీవి వారి సిబ్బంది రోజా పూలు ఇచ్చి వారిని అభినందించారు. డిఫెన్స్ ఇవ్వు డ్రైవింగ్ లో భాగంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి మోటార్ సైకిల్ మీద ప్రయాణించాలని, కారులో వెళ్ళేటప్పుడు తప్పక సీట్ బెల్ట్ ధరించాలని, వాహనాలను ఓవర్ స్పీడ్ తో కాకుండా నార్మల్ స్పీడ్ తో వెళ్లాలని, తాగి వాహనాలను నడపొద్దని తెలియజేస్తూ ప్రతి ఒక్కరు కూడా వారి యొక్క ప్రయాణాన్ని ప్రారంభించే ముందు వాళ్ళ కుటుంబ సభ్యులు భార్యా పిల్లలను గుర్తు చేసుకొని వారి యొక్క ప్రయాణాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు.

# మకరజ్యోతి దర్శనం .. ముక్తికి సోపానం..!

- బొమ్మలమ్మ గుట్టపై కనువిందు చేసిన మకర జ్యోతి దర్శనం
- భక్తుల జయధ్వనులతో ప్రతిధ్వనించిన ఆనందగిరి
- స్వర్ణాభరణాలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ

**గంగాధర, జనవరి 13, ( మనం న్యూస్) :** గంగాధర మండలం కురిక్యాల, కొండన్నపల్లె గ్రామాల శివారులో గల బొమ్మలమ్మ గుట్టపై బుధవారం అయ్యప్ప మకర జ్యోతి భక్తులకు దర్శనం ఇచ్చింది. కేరళ రాష్ట్రంలోని శబరీశునికి జరుగుతున్న పూజల మాదిరిగానే మండలంలోని మధురానగర్ చౌరస్తాలో గల ఆనందగిరి సుందర శాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ నిర్మాణ ధర్మకర్త శ్రీరామ్ మధుకర్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి కైంకర్యాలు ప్రతి ఏటా జరిపిస్తారు. ఈ సందర్భంగా మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం హరిహర పుత్ర అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాలయాల లోని విఘ్నేశ్వరునికి, అలాగే సుబ్రమణ్యేశ్వర స్వామి, మాలికా పురోత్తమ, హరి హరులకు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప స్వాములు, భక్తులు ఆలయ నిర్మాణ ధర్మకర్త శ్రీరామ్ మధుకర్ స్వామి తన నివాసం నుండి స్వామివారి ఆభరణాల (తిరువాభరణం) శోభాయాత్ర గ్రామ పురవీధులలో కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకొని ఆభరణాలను మణికంఠునికి అలంకరించి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. సూర్యాస్తమయ సమయంలో స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాముల శరణుఘోషతో మారు మోగుతుండగా భక్తులకు మణికంఠుడు బొమ్మలమ్మ గుట్టపై మకరజ్యోతి రూపంలో కాంతులీనుతూ దర్శనం ఇవ్వడంతో భక్తి పారవశ్యం ఒక్కసారిగా తొణికిసలాడింది. జ్యోతి



దర్శనం కోసం మండలములోని ఆయా గ్రామాల నుండి అక్కడికి చేరుకున్న వందలాదిమంది భక్తులు, మాలధారులు మకర జ్యోతిని దర్శించుకుని దివ్యానుభూతిని పొందారు. మూడుసార్లు దివ్య కాంతిని చూసినప్పుడు "స్వామియే శరణం అయ్యప్ప'' అనే అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో ఆనందగిరి, అక్కడి పరిసరాలు ప్రతి ధ్వనించాయి. అరుదైన మణికంఠుని జ్యోతి దృశ్యాన్ని చూసి భక్తులు ఆనంద పరవశానికి లోనయ్యి భక్తి ప్రపత్తులతో వారి హృదయాలు పరవశించి పోయాయి. అయ్యప్ప



స్వామి వారికి అత్యంత ఇష్టమైన దినం..మకర సంక్రమణం. తాను ఆకాశంలో జ్యోతిరూపంలో దర్శనం ఇస్తానని స్వామి వారే వెల్లడించినట్లు చరిత్ర చెబుతోంది. అందుకే అయ్యప్ప మాల ధరించిన ప్రతి భక్తుడు మకర సంక్రాంతి రోజున మకరజ్యోతిని చూడాలని ఆశ పడుతుంటాడు. అయ్యప్ప స్వాములు, భక్తులు మకర జ్యోతిని తనివితీరా దర్శించి, ధన్యోహం ఓ శబరీశా... అంటూ మాటలకందని ఆధ్యాత్మికానందాన్ని పొందారు.

# 17న సాయుధ పోరాట అమరుల సంస్మరణ సభ

## మచ్చా వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ

## విలేకరుల సమావేశంలో మచ్చా విద్యాసాగర్



ఖమ్మం, జనవరి 14(మనం న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ అమరులు మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి 77వ సంస్మరణ సభ ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు మచ్చా విద్యాసాగర్ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సమ సమాజ నిర్మాణం కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1949 జనవరి 17న ఆనాడు నెహ్రూ సైన్యం కాల్చి చంపారని, ఈ పోరాటంలో మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి అమరులు అయ్యారని తెలిపారు. వారి జ్ఞాపకార్థం 77వ సంస్మరణ సభ ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏపీ అధికార ప్రతినిధి ఐఎఫ్టు ప్రసాద్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మచ్చ సూర్యనారాయణ , చావా రమేష్, దురుసోజు రమేష్ తో పాటు అనేకమంది అతిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఎన్ తిర్మల్ చే రచించిన మచ్చ వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గోకనపల్లిలో జరిగే సంస్మరణ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మోడెం వెంకన్న, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మచ్చ సూర్యనారాయణ, అడ్వకేట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 15 కోట్లతో మధిర పట్టణ అభివృద్ధికి కార్యాచరణ

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన డిప్యూటీ సీఎం

మధిర, జనవరి 14(మనం న్యూస్): 15 కోట్ల రూపాయల వ్యయంతో మధిర పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డిప్యూటీ సి.ఎం బుధవారం మధిర పట్టణంలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ భోగి పండుగ నాడు మధిర పట్టణ అభివృద్ధి కోసం 15 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని, వీటిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధిర పట్టణ ప్రజలకు మౌళిక వసతుల కల్పన లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఓ ఏ. శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, మధిర మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, పంచాయతీ రాజ్ ఇఇ మహేష్ బాబు, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## పర్ణశాల పుణ్యక్షేత్రంలో ఘనంగా శ్రీకృష్ణ గోదా కళ్యాణం

దుమ్ముగూడెం జనవరి 14 (మనం న్యూస్): ప్రముఖ పుణ్యక్షేత్రం 45 పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా బుధవారం చివరి రోజు స్వామివారు, అమ్మవారికి 30వ పాశురం విన్నపం చేసారు. అనంతరం 10 గంటల 30 నిమిషాలకు శ్రీకృష్ణ గోదా కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం యోత్రధారణ రక్షాబంధన, యజ్ఞోపవీత ధారణ స్వామి వారి అమ్మవారి ప్రవర్లు మహా సంకల్పం మంగళాష్టకాలు జిలకర బెల్లం సమర్పణ మాంగల్య పూజ మాంగల్య ధారణ స్వామివారికి అమ్మవారికి ఆశీర్వచనం మంగళహారతి విశేష ప్రసాద నివేదన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

## ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కొత్వాల



పాల్వంచ, జనవరి 14(మనం న్యూస్): ఫిబ్రవరి నెలలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్ లో మెజారిటీ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం పాత పాల్వంచ లో జరిగిన ఎన్నికల ప్రచారాన్నీ కొత్వాల ప్రారంభించారు. విజయాన్ని కాంక్షిస్తూ.. ఏర్పాటు చేసిన గోడ పత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలన్ని ప్రజాభిమానంతో కూడినవన్నారు కొత్తగూడెం కార్పొరేషన్ లోని 60 డివిజన్ లలో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించి మేయర్ పీఠం ఎక్కడం ఖాయం అన్నారు. అదే విధంగా పాల్వంచ 27 డివిజన్లలో మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆశాబావం వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పని చేసి, కాంగ్రెస్ గెలుపుకు ప్రచారం నిర్వహించాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వజ్జల రాము, కొండూరి లక్ష్మణ్, బొందిల బాలు, వెంకట కృష్ణ, సంపత్, ధర్మరాజుల రమేష్, యాట రాఘవ యాట వినయ్ యాట నరసింహారావు, పానుగంటి సాయి పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా ముగ్గుల పోటీలు



ఖమ్మం, జనవరి 14(మనం న్యూస్): దామా సేవా ఫౌండేషన్ ఫౌండర్ దామా స్వరూప కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 13వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో సంక్రాంతి ముగ్గుల పోటీ కన్నుల పండుగగా నిర్వహించారు. రెండు వందల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందించారు. మొదట ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు ముగ్గు వేసిన ప్రతి ఒక్కరికి బహుమతులు అందచేశారు. 20 సంవత్సరాలుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తు అవార్డులు తీసుకున్నారు. సేవా కార్యక్రమంలో భాగంగానే ముగ్గుల పోటీ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలియజేశా రు ఇలాగే ప్రతి సంవత్సరం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి ప్రెసిడెంట్ నూతి సత్యనారాయణ రీజోనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీధర్, సెంచరీ విద్యాసంస్థల డైరెక్టర్ డివిఎస్ ప్రభాకర్ రావు మాధవి లత, సంక్షేమ సంఘం సభ్యులు పంది మల్లయ్య ముత్తి నేని నాగేశ్వరావు పాల్వాయి వెంకటేశ్వరరావు లయన్ గ్రేట్ క్లబ్ మెంబర్స్ పెసర ప్రభాకర్ రెడ్డి నాగిరెడ్డి గోకుల్ కృష్ణ ట్రస్ట్ ఫౌండర్ కనక బండి విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీ నాయకులు టెలికం డైరెక్టర్ ఉమ్మనేని కృష్ణ గన్నోజు గోవిందమ్మ ఝాన్సీ సమీరా , స్నేహితులు రామచంద్రయ్య శ్రీవాణి కుటుంబ సభ్యులు నాగేంద్రమ్మ సత్యవతి అరుణాదేవి ,కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

# 18న సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు..



- జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఖమ్మం, జనవరి 14(మనం బ్యూరో): జనవరి 18న ఖమ్మం జిల్లాలో సీఎం పర్యటన ఉన్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డిలతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి పరిధిలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నర్సింగ్ కళాశాల ప్రక్కన హెలీ ప్యాడ్‌ను డిజిసిఏ స్టాండర్డ్ ప్రకారం ఏర్పాటు చేయాలని, అక్కడ ఫైర్ వాహనం సిద్ధంగా ఉంచాలని అన్నారు. సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్యులతో కూడిన బృందాన్ని ప్రోటోకాల్ ప్రకారం 108 వాహనంతో సహా ముఖ్యమంత్రి కాన్వాయ్ లో ఉంచే విధంగా సిద్ధం చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం మంచి వాహనాలను ఎంపిక చేయాలని ఇంచార్జ్ కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో చేస్తున్న కార్యక్రమ వివరాలను శాఖల వారీగా అందించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ వెంట ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అరుణావర్ణమవుతున్న ఖమ్మం

## శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు ముస్తాబు

## ఫ్లెక్సీలు, తోరణాలు, జెండాలతో నూతన శోభ






ఖమ్మం, జనవరి 14(మనం న్యూస్): ఖమ్మం నగరం అరుణావర్ణాన్ని పులుముకుంటున్నది. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో ఖమ్మం నగరాన్ని పార్టీ కార్యకర్తలు ఎరుపెక్కిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించిన విషయం విధితమే. సభా సమయం దగ్గర పడుతుండడంతో నగరాన్ని ఎర్ర తోరణాలతో అలంకరిస్తున్నారు. ఇల్లందు క్రాస్ రోడ్డు, మయూరిసెంటర్, జెడ్పి సెంటర్, వ్యవసాయ మార్కెట్ సెంటర్, వరంగల్ క్రాస్ రోడ్డు, చర్చికాంపౌండ్ సెంటర్, ముస్తఫానగర్, బోసుబొమ్మ సెంటర్, కాల్వొడ్డు తదితర కూడళ్లలో ఎర్ర తోరణాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. వైరా రోడ్డు, బైపాస్ రోడ్డులో భారీ ఎత్తున సిపిఐ జెండాలను ఏర్పాటు చేశారు. నగరంతో పాటు నరంలో ప్రవేశించే అన్ని రహదారుల్లో స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్రను తెలియజేసేవిధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభకు హాజరయ్యే సిపిఐ జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డికి స్వాగతం తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పాలకుల నిర్భంధాలలో, ప్రజా పోరాటాలలో మరణించిన కమ్యూనిస్టు పార్టీ నాయకులను యాది చేసుకోవడంతో పాటు తెలంగాణ సాయుధ పోరాట అమరులను స్మరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే కనిపిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజలు హాజరుకానుండడంతో పోలీస్ యంత్రాంగం సైతం అప్రమత్తమైంది. సభా స్థలి ఏర్పాట్లను పోలీస్ అధికారులు పలుమార్లు పరిశీలించారు. నగరంలో జరిగే ప్రదర్శనతో ట్రాఫిక్కు ఇబ్బందులు ఏర్పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

## కొత్తకొండకు బయలుదేరిన ఎడ్లబండ్లు



శంకరపట్నం జనవరి 14 (మనం న్యూస్) శంకరపట్నం మండలం కరీంపేట గ్రామం నుండి వరంగల్ జిల్లాలో నిర్వహించే కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు ఎడ్లబండ్లు ఊరేగింపుగా బయలుదేరాయి. గ్రామంలో అంకతి రాజయ్య కుటుంబ సభ్యులు ఆనవాయితీగా ప్రతి సంవత్సరం ఎడ్లబండ్లను కట్టుకొని ఊరేగింపుగా భోగి రోజున కొత్త కొండకు బయలుదేరుతారు. ఈ క్రమంలో గ్రామస్తులు బండ్లవద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఊరేగింపులో డప్పు దరువులతో, శివసత్తుల పూనకాలతో, కాగడాల వెలుగులతో శోభాయమానం సంతరించుకుంటుంది. ఈ కార్యక్రమంలో అంకతి భద్రయ్య, అంకతి కనకయ్య, అంకతి కుమారస్వామి, అంకతి ఐలయ్యలతోపాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వలపు వల... దంపతుల ఎర

## సోషల్ మీడియా వేదికకగా బ్లాక్ మెయిల్ చేస్తున్న భార్యాభర్తల బాగోతాన్ని బట్టబయలు చేశారు కరీంనగర్ రూరల్ పోలీసులు.




కరీంనగర్ ,జనవరి 14( మనం న్యూస్): గత రెండు సంవత్సరాల నుండి కరీంనగర్ రూరల్ మండలంలోని ఆరేపల్లి లో గల శ్రీ సాయి నివాస అపార్ట్మెంట్ లోని ఒక ఫ్లాట్లో భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఇన్స్టాగ్రామ్ లో తమ ఫోటోలను పెట్టుచు అట్టి ఫోనులో ఆమె పోస్టులు పెట్టుచు వాటిని చూసి కొంతమంది వ్యక్తులు చూసి ఆమెను ఇన్స్టాగ్రామ్ లో ఫాలో అవుతూ ఆమె నెంబరు తీసుకొని ఆమెను సంప్రదించగా డబ్బులు తీసుకొని రావాలని అయితేనే సెక్స్లో పాల్గొంటానని తన అడ్రస్ తెలుపగా దాదాపు 100 మంది వరకు కరీంనగర్, చుట్టూ ప్రక్కన ఏరియాలో నుండి కొందరు బడా వ్యాపారస్తులు, యువకులు ఆమె ఉంటున్న అపార్ట్మెంట్ కు వచ్చి ఆమె భర్త అనుమతితో ఆమెతో వారు సెక్స్లో పాల్గొంటూ డబ్బులు ఇచ్చేవారు వారు సెక్స్లో పాల్గొన్న సమయంలో నగ్నంగా ఉన్నప్పుడు తన భర్త ఫోన్లో వీడియో రికార్డు చేసేవారు వారు ఇచ్చిన డబ్బులతో అపార్ట్మెంట్ ఈఎంఐ లోన్ కట్టేవారు, ఒక టాటా కారు కొనుక్కొని దర్జాగా తిరుగుచుండేవారు వారి అపార్ట్మెంట్లో ఏసీలు సోఫా సెట్లు విలువైన బెడ్స్ కూడా ఉన్నవి వారు వారి దగ్గరకు వచ్చిన వారిని మీరు నగ్నంగా ఉన్న వీడియోలు మా దగ్గర ఉన్నవి, వాటిని వైరల్ చేస్తామని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసేవారు నగ్నంగా ఉన్న ఫోటోలు బయటపడితే పరువు పోతదని కొంతమంది పలుకుబడి ఉన్న వ్యక్తులు భయపడి ఇచ్చుచుండడి వారు ఒక సంవత్సరం కింద పరిచయమైన కరీంనగర్ కు చెందిన వ్యక్తి వారికి బాగా చనువుగా ఉండి ఆమె భర్తతో మందు త్రాగుతూ ఆమెతో ఎక్కువసార్లు సెక్స్లో పాల్గొనుచుండగా అతనికి మాయ మాటలు చెప్పి వారి అపార్ట్మెంట్ లోనులు కారు ఇఎంఐలు అతనితోనే కట్టించేవారు చివరకు అతని వద్ద డబ్బులు అయిపోయి కొన్ని రోజులు రాకపోగా అతనికి వాట్సాప్ కాల్స్ చేసి నీవు ఎందుకు రావడం లేదని అడిగితే నా దగ్గర డబ్బులు లేవు ఇక నన్ను మర్చిపోండి అని చెప్పగా వారిద్దరూ భార్యాభర్తలు అట్టి వ్యక్తిని మాకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వు నిన్ను మర్చిపోతాము అతనికి చెప్పగా అతడు నా వద్ద డబ్బులు లేవని చెప్పగా వారు అంతటితో ఆగక నీవు 5 లక్షల రూపాయల డబ్బులు ఇవ్వకపోతే నీ వీడియోలు మీ ఇంట్లో వారికి పంపుతామని అప్పటికీ నీవు ఇవ్వకపోతే నిన్ను ఎలాగైనా చంపుతామని బెదిరించినారు అతడు చంపుతారని భయపడి ఒక లక్ష రూపాయలు ఇస్తానని అనుకొని వాటిని తీసుకొని ఒంటరిగా వారి ఇంటికి పోయి ఇస్తానని శ్రీపురం కాలనీ బోర్డు వద్ద రాపిడో బుక్ చేయడానికి ఉండగా అప్పుడే తనను బెదిరించిన ఇద్దరు భార్యాభర్తలు వారి కారులో అట్టివ్యక్తి ఇంటికి వెళదామని రాగా అతడు కనపడగా అతనిని పిలిచి డబ్బులు ఇస్తావా లేదా లేకపోతే నిన్ను ఎలాగైనా చంపుతామని బెదిరించగా సదరు వ్యక్తి చంపుతారేమో అని భయపడి తన వద్ద ఒక లక్ష రూపాయలు ఉన్నావని అవివారికి ఇచ్చి మిగతా నాలుగు లక్షలు రెండు రోజుల్లో పంపిస్తామని ఇంతవరకు దాదాపు మీకు 14 లక్షల రూపాయల వరకు ఇచ్చానని నన్ను ఏమి చేయవద్దని వీడియోలను తీసివేయాలని వేడుకోగా వారు 4 లక్షలు ఇవ్వకపోతే తప్పకుండా వీడియోలు బయటపెట్టి నిన్ను ఏదో విధంగా చంపుతామని బెదిరించి వెళ్ళిపోయినారు సదరు వ్యక్తి భయపడుకుంటూ తన బంధువులకు మిత్రులకు జరిగిన మొత్తం విషయాన్ని చెప్పగా వారు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయమని చెప్పగా అతడు పోలీస్ స్టేషన్కు నిన్న అనగా 13.01.2026 న ఫిర్యాదు చేసి తాను వారికి ఇచ్చిన డబ్బులు ఫోన్ పే ద్వారా పంపానని చూపించగా పోలీస్ స్టేషన్లో భార్య భర్తల ఇద్దరిపై కేసు నమోదు చేయనైనది నేరస్తుల ఏసిపి శ్రీ విజయ్ కుమార్ ఆదేశానుసారం సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు సిబ్బందితో రెండు గ్రూపులుగా గాలిస్తుండగా ఈరోజు ఉదయం 8 సమయమున వారిద్దరు వారి కారు నడుపుకుంటూ వచ్చుచూ టేస్టీ దాబా వద్ద ఆగి ఫోన్ మాట్లాడుతుండగా అనుమానంతో వారిని పట్టుకొని విచారించగా వారు జరిగిన విషయం మొత్తం చెప్పి నేరమును ఒప్పుకొని వారు కొన్న కారును వారు నగ్నంగా ఉన్న వీడియోలు తీసిన మొబైల్ ఫోన్ లను వారి వద్ద ఉన్న ఫిర్యాదు ఇచ్చిన చెక్కును చూపించగా వాటిని స్వాధీన పరుచుకొని పీఎస్ కు తీసుకొని వచ్చి వారిని రిమాండ్ నిమిత్తం తదుపరి చర్య నిమిత్తం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా వారిని 14 రోజుల నిమిత్తం జైలుకు తరలించామని ఆదేశాలు ఇవ్వగా వారిని ఎస్కార్టులుగా తీసుకొని పోయి జైలులో అప్పగించినది - నేరస్తులైన భార్యాభర్తలది మంచిర్యాల జిల్లా వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు, గత కొంతకాలంగా కరీంనగర్లో ఉంటూ ఈ వ్యవహారం జరుపుతున్నారు. ఇట్టి కేసును 24 గంటల లోపు ఛేదించి పట్టుకున్నందుకు గాను

# పట్టణ కురుమ సంఘం యూత్ కమిటి ఏకగ్రీవం

## యూత్ సభ్యులు ఆదర్శంగా ఉండాలి..

## కురుమ సంఘం అధ్యక్షులు మారేటి రమేష్



ఖమ్మం, జనవరి 14(మనం న్యూస్): సమాజానికి ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు పాల్గొని పదిమందికి ఆదర్శంగా ఉండాలని ఖమ్మం నగర కురుమ సంఘ అధ్యక్షులు మారాటి రమేష్ పేర్కొన్నారు. ఖమ్మం నగరం కురుమ సంఘం పెద్ద కురుమ రాం మల్లేశం అధ్యక్షతన బుదవారం సమావేశాన్ని నిర్వహించారు. కురుమలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ కమిటి అధ్యక్షులుగా ఎమ్మె రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా గోరిగే సందీప్, కోశాధికారిగా ఏనుగు వినయ్ తో పాటు పలువురిని కోర్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురుముల కులదైవమైన శ్రీ బీరప్ప కామరాతి స్వామి ఆలయం వద్ద కుల పెద్దల సమక్షంలో కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యూత్ కమిటీ నూతన అధ్యక్షులు ఎమ్మె రాంబాబు కులపెద్దలకు ముందుగా భోగి,సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ... నగర కురుమ సంఘం పెద్దల ఆశీస్సులతో ఎన్నికైన మేము సంఘం అభివృద్ధి కోసం ఉపయోగపడతామని అన్నారు. యూత్ చెడు అలవాట్లకు బానిస కాకుండా సత్ప్రవర్తన కలిగి ఉన్నతమైన విద్యను అభ్యసించి పబ్లిక్ లేద ప్రైవేట్ సంస్థ రంగాలలో ఉద్యోగాలు చేసి పదిమందికి మార్గదర్శకులుగా ఉండాలని యూత్ కు పిలుపునిచ్చారు. నగర అధ్యక్షులు మరాటీ రమేష్ మాట్లాడుతూ యూత్ చేసే ప్రతి పని కూడా సమాజ హితవు కోసం పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని యూత్‌నుద్దేశించి ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి గౌరీ శంకర్, కోశాధికారి చిందం సైదులు, చెలోజి మల్గ మధు, జిల్లా , పట్టణ కురుమ సంఘం నాయకులు కుల పెద్దలు పాల్గొని యూత్ కమిటి సభ్యులను అభినందించారు.

## క్రీడలు క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి..!



● ఎస్సై నరేష్ కుమార్

మల్యాల, జనవరి14,( మనం న్యూస్): క్రీడాలు గ్రామీణ యువతలో క్రమశిక్షణతో పాటు ఐక్యత, క్రీడా స్ఫూర్తి పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని స్థానిక ఎస్సై నరేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మల్యాల మండలంలో సర్వపూర్ గ్రామంలో మకర సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గ్రామ యువకుల ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎస్సై నరేష్ కుమార్ మాట్లాడుతూ క్రీడాలు గ్రామీణ యువతలో క్రమశిక్షణ ఐక్యత క్రీడా స్ఫూర్తి పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తూ గ్రామంలోని యువకులు మద్యం మత్తుకు బానిస కాకుండా ఆటలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు.

యువతను చైతన్యం పరిచే మద్యం వద్దు మైదానం ముద్దు, గంజాయి వద్దు.. గ్రౌండ్ హద్దు అంటూ చేసిన నినాదం అందర్నీ ఆకట్టుకుంది. క్రీడలలో గెలుపు పొందిన వారికి ఎస్ ఐ బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగిలి హనుమంతు, ఉప సర్పంచ్ బనుక పర్సయ్య, వార్డ్ మెంబర్లు ఆది సుజాత నరేష్, గుడిసె అంజి, బైరి అనంతరెడ్డి, దాసరి గంగారం, బొద్దుల మహేందర్, నల్లగొండ బాబు, కోటగిరి ప్రభాకర్, బోద్దుల మహేష్ మల్యాల అనిల్ , నక్క అనిల్ , ఎడ్ల రమేష్, గుమ్మడి మధుసూదన్, తుడి తిరుపతి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దేశ్వర స్వామిగుట్టపై కనువిందు చేసిన మకర జ్యోతి దర్శనం

● అయ్యప్ప శరణు ఘోషతో మారుమ్రోగిన సిద్దేశ్వర స్వామి గుట్ట
● స్వర్ణాభరణాలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ



చిగురు మామిడి,జనవరి 13, ( మనం న్యూస్) : హుస్నాబాద్ లో వెలసిన గ్రామా శివారులో గల సిద్దేశ్వర స్వామిగుట్టపై బుధవారం అయ్యప్ప మకర జ్యోతి భక్తులకు దర్శనం ఇచ్చింది హుస్నాబాద్ మల్లె చెట్టుచౌరస్తా వద్ద ఆభరణాలతోటి ఘనంగా అయ్యప్ప స్వాములు పెట్టేతుళ్ళి ఆడి పాడారు ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ఘనంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం హరిహర పుత్ర అయ్యప్ప స్వామికి, పుష్పాలంకరణ ఘనంగా పనిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరునికి, అలాగే సుబ్రమణ్యేశ్వర స్వామి, మాలికా పురోత్తమ, హరి హరులకు అభిషేకాలు ఘనంగా పూజా అధికారి కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, అలాగేభక్తులు హుస్నాబాద్ శివాలయం నుండి స్వామివారి ఆభరణాల (తిరువాభరణం) శోభాయాత్ర హుస్నాబాద్,గ్రామ పురవీధులలో కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకొని ఆభరణాలను మణికంఠునికి అలంకరించి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. సూర్యాస్తమయ సమయంలో స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాముల శరణుఘోషతో భక్తులకు మణికంఠుడు సిద్దేశ్వర స్వామి గుట్టపై మకరజ్యోతి రూపంలో కాంతులీనుతూ దర్శనం ఇవ్వడంతో భక్తి పారవశ్యం ఒక్కసారిగా స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వామివారిని వేడుకున్నారు, జ్యోతి దర్శనం కోసం మండలములోని ఆయా గ్రామాల నుండి అక్కడికి చేరుకున్న అయ్యప్ప స్వాములు, భక్తులు,మకర జ్యోతిని దర్శించుకుని దివ్యానుభూతిని పొందారు. దివ్య కాంతిని చూసినప్పుడు ''స్వామియే శరణం అయ్యప్ప'' అనే అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో అక్కడి పరిసరాలు ప్రతి ధ్వనించాయి. అరుదైన మణికంఠుని జ్యోతి దృశ్యాన్ని చూసి భక్తులు ఆనంద పరవశానికి లోనయ్యి భక్తి ప్రపత్తులతో వారి హృదయాలు పరవశించి పోయాయి. అయ్యప్ప స్వామి వారికి అత్యంత ఇష్టమైన దినం..మకర సంక్రమణం. తాను ఆకాశంలో జ్యోతిరూపంలో దర్శనం ఇస్తానని స్వామి వారే వెల్లడించినట్లు చరిత్ర చెబుతోంది. అందుకే అయ్యప్ప మాల ధరించిన ప్రతి భక్తుడు మకర సంక్రాంతి రోజున మకరజ్యోతిని చూడాలని ఆశ పడుతుంటాడు. అయ్యప్ప స్వాములు, భక్తులు మకర జ్యోతిని వెలిగించి తనివితీరా దర్శించి, ధన్యోహం ఓ శబరీశా... అంటూ మాటలకందని ఆధ్యాత్మికానందాన్ని పొందారు.,

## అంగరంగ వైభవంగా శ్రీ గోదాదేవి కళ్యాణం

### పట్టువస్త్రాలు సమర్పించిన సర్పంచ్ కొండ అర్జున్ దంపతులు...



జమ్మికుంట, జనవరి 14 (మనం న్యూస్): ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో శ్రీ గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు అంగరంగ వైభవంగా జరిపించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య కళ్యాణ ఘట్టం కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ వేడుకలో గ్రామ సర్పంచ్ కొండ అర్జున్-హంస దంపతులు పాల్గొని స్వామివారికి మరియు అమ్మవారికి పట్టు వస్త్రాలను, పుస్తె మట్టెలను భక్తిశ్రద్ధలతో సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ అర్జున్ మాట్లాడుతూ... 'ముక్కోటి దేవతల ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ఈ మహోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు. గ్రామ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని అన్నారు. గ్రామాభివృద్ధికి దైవాశీస్సులతో పాటు ప్రజలందరి సహకారం అవసరం అని అన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# టారిఫ్‌లు ఆపితే నా దారులు నాకున్నాయ్

## సుప్రీంతీర్పునకు ముందు డోనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్,జనవరి 14 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానాలపై అక్కడి సుప్రీంకోర్టు నేడు తీర్పు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. ఒకవేళ తాను విధించిన సుంకాలను న్యాయస్థానం అడ్డుకుంటే.. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతామని ఆయన వెల్లడించారు.

''చైనా ప్రయోజనాలకు మద్దతు కల్పించే ఉద్దేశంతోనే కొందరు ఈ టారిఫ్‌లను సవాల్ చేస్తూ కేసులు వేశారు. ఒకవేళ కోర్టు సుంకాలను వ్యతిరేకిస్తే మా ప్రభుత్వం కచ్చితంగా ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషిస్తుంది. నేను విధించిన టారిఫ్‌ల వల్ల తక్కువ సమయంలోనే ఫెడరల్ బడ్జెట్ ద్రవ్యలోటు 27శాతం వరకు తగ్గింది. ఈ సుంకాల వల్ల అమెరికాలో వినిమయ ఖర్చులు పెరిగాయని విమర్శకులు అంటున్నారు. అది నిజం కాదు. ఈ టారిఫ్లను విదేశాలే చెల్లిస్తున్నాయి. అమెరికాలోని కొనుగోలుదారులకు ఎలాంటి సమస్యా ఉండదు. ఈ విషయంలో నేను తీసుకున్న నిర్ణయం సరైందే'' అని ట్రంప్ పేర్కొన్నారు.

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే పలు దేశాలపై సుంకాల బాదుడు మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా న్యాయస్థానాల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అగ్రరాజ్య సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. దీనిపై న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించనుంది. టారిఫ్‌ల విషయంలో ట్రంప్ అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని అతిక్రమించారా? లేదా? అనేది కోర్టు నిర్ణయించనుంది. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా ట్రంప్ వరుసగా పోస్టులు పెడుతున్నారు. తాను విధించిన సుంకాలను సుప్రీంకోర్టు కొట్టేస్తే తీవ్ర ఇబ్బందుల్లో ఇరుక్కుంటామని, ఇప్పటివరకు వసూలు చేసిన సుంకాలను తిరిగి చెల్లించడం అసాధ్యమని ఆయన అన్నారు.

## అలా కాకుంటే ... గ్రీన్‌లాండ్‌కు సమస్య

● అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ ,జనవరి 14 : గ్రీన్‌లాండ్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. అగ్రరాజ్యంలోకి చేరబోమని, డెన్మార్క్‌లోనే ఉంటామని గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ ప్రకటించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. ''అది అతడి సమస్య. నీల్సన్ అభిప్రాయంతో ఏకీభవించట్లేదు. అతడి గురించి నాకు సరిగా తెలియదు. కానీ డెన్మార్క్‌లోనే కొనసాగాలనుకుంటే అది గ్రీన్‌లాండ్‌కే పెను సమస్యగా మారుతుంది'' అని ట్రంప్ హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌కు ఏవైనా ఆఫర్లు ప్రకటించారా? అని మీడియా ప్రశ్నించగా.. అలాంటిదేమి లేదని బదులిచ్చారు. ''గ్రీన్‌లాండ్ తప్పకుండా అమెరికా భూబాగంలో చేరాలి. లేదంటే ఆ ప్రాంతాన్ని రష్యా, చైనా ఆక్రమిస్తాయి. ఇప్పటికే ఆ దేశాల రక్షణ బలగాలు అక్కడ పాగా వేశాయి. నేను తలుచుకుంటే అక్కడ అధిక సంఖ్యలో మా సైన్యాన్ని మోహరించగలను. గ్రీన్‌లాండ్‌లో అమెరికా జెండా ఎగరాలి'' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబు ఇంటి ముందు వృద్ధుడు ఆత్మహత్యాయత్నం



తిరుపతి, జనవరి 14 మనం : తన సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన చిత్తూరు జిల్లాకు చెందిన గోవింద రెడ్డి (65) నారావారిపల్లెలో ఏపీ సీఎం చంద్రబాబు ఇంటి ముందు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తనను లోపలికి పంపకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయన ఈ చర్యకు ఒడిగట్టారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని గోవింద రెడ్డితో వచ్చిన రెడ్డప్ప అనే వ్యక్తి మండిపడ్డారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, జనవరి 14,మనం న్యూస్: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఏపీ సీఎం సెక్రటరీ ఏ వి రాజమౌళి,తెలంగాణ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, నటుడు కొరియోగ్రాఫర్ ప్రభుదేవా,సినీ దర్శకుడు బాబీ,భారత చెస్ క్రీడాకారిణి హారిక స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా,ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల నటుడు ప్రభుదేవా మీడియాతో మాట్లాడుతూ స్వామివారి దర్శనం చాలా బాగా అయింది త్వరలో తమిళంలో మూన్ వాక్ అనే చిత్రాన్ని చేయబోతున్నానని తెలిపారు.





**త్వరలో చిరంజీవితో సినిమా చేయబోతున్నాను:**

శ్రీవారి దర్శనానంతరం మీడియాతో మాట్లాడిన సినీ దర్శకుడు బాబి సంక్రాంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శించుకున్నామని, త్వరలోనే చిరంజీవితో సినిమా తీస్తున్నామని షూటింగ్ ముగించుకుని రిలీజ్ టైం కి మళ్ళీ స్వామివారి దర్శనానికి వస్తాం అని అన్నారు దర్శకుడు బాబి.



## రేపు ఎస్వీ గోశాలలో 'గోపూజ మహోత్సవం

తిరుపతి(టిటిడి),జనవరి 14,మనం న్యూస్ : తిరుపతి శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో జనవరి 16వ తేదీ కనుమ పండుగ సందర్భంగా గోపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గం.ల నుండి 10.30 గం.ల వరకు శ్రీ వేణుగోపాల స్వామి వారికి అభిషేకం, పూజ, హారతి కార్యక్రమం జరుగనుంది. ఉదయం 10.30 గం.ల నుండి 11.15 గం.ల వరకు గోపూజ, కటమ, అశ్వ, వృషభ, గజ పూజ జరుగనుంది. తదుపరి 11.15 గం.లకు దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజన, కోలాటాలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుండి శ్రీవేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు. గోపూజ మహోత్సవం రోజున గోవులకు బెల్లం, బియ్యం, గ్రాసం భక్తులు స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. ఈ సదవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని గోమాత, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరడమైనది.

# చంద్రబాబు పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు




● రాష్ట్ర మంత్రి టీజీ భరత్

కర్నూలు జనవరి 14మనం న్యూస్ః సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని ధర్మపేట, పెద్దపడఖానా, బుధవారపేట, జొహరాపురంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గులు, క్రికెట్ పోటీల విజేతలకు ఆయన బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన సంప్రదాయాలు మరిచిపోకుండా కొనసాగించాలన్నారు. ఆర్థిక సమస్యలున్నా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంపై, కర్నూల్లో తనపై దీవెనలు ఎప్పటికీ ఉండాలని ఆయన ప్రజలను కోరారు. కర్నూలు నగరంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో కొందరు నాయకులు వారు ఓడిపోయిన వార్డుల్లో అభివృద్ధి పనులు చేయలేదని, తాము అలా కాకుండా అన్ని వార్డుల్లో ప్రజల కోరిక మేరకు పనులు చేస్తున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంబాలు, త్రాగునీటి సమస్యలు తీర్చుతున్నామన్నారు. కిడ్స్ వరల్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ చేపడుతున్నామన్నారు. అర్హులకు ఇల్లు, ఇళ్ల పట్టాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఓర్వకల్లుకు ఇప్పటికే రూ.10వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని, మరో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. డ్రోన్ సిటీని కర్నూలులో పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని.. దీని ద్వారా ఎన్నో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. రానున్న రోజుల్లో పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. మంచి చేసేది ఎవరో ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పరమేష్, జకియా అక్సారి, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్ సింగ్, టిడిపి కర్నూలు పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ సోమిశెట్టి శ్రీకాంత్, సీనియర్ నాయకులు అబ్బాస్, నౌషద్, రామాంజనేయులు, పామన్న, రమేష్, ఏపీఐఐసీ డైరెక్టర్ కౌశిక్, ఏపీఐడీసీఎల్ డైరెక్టర్ భీమిశెట్టి మనోజ్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ జేమ్స్, ఆనంద్, కస్తూరి వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, సీనియర్ నాయకులు, బూత్ ఇంచార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో బాధితునికి చికిత్స అందించాం

● స్విమ్స్ లో చేర్పించి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నాం

నారావారిపల్లి, జనవరి 14 మనం న్యూస్ : బాధితున్ని స్విమ్స్ లో చేర్పించి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. .బుధవారం ఉదయం నారావారిపల్లి గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వగృహం సమీపంలో జరిగిన సంఘటనపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించారు. సంఘటన సమాచారం అందిన వెంటనే బాధితుడికి ప్రథమ చికిత్స అందించడంతో పాటు, అత్యవసర అంబులెన్స్ ద్వారా తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్సలు అందించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యులు నిరంతరం పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్సలు అందించారని, బాధితుడు ఆరోగ్యంగా ఉన్నాడని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# రాంపురం జాతరకు సర్వం సిద్ధం

● 16న మహా రథోత్సవం
● హాజరు కానున్న ఎమ్మెల్యే లు, మాజీ ఎమ్మెల్యే లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు.



మంత్రాలయం, జనవరి 14(మనం న్యూస్): మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం గ్రామంలోని తుంగభద్ర నది తీరంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి మహా రథోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. పెద్దాయన టీటీడీ మాజీ పాలక మండలి సభ్యులు, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వై. సీతారామిరెడ్డి , ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైస్సార్సీపీ నేత లు వై. ప్రదీప్ రెడ్డి , వై. ధరణి రెడ్డి నేతృత్వంలో జాతర ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. 16వ తేది శుక్రవారం జరిగే మహా రథోత్సవం కు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి అయ్యాయి.. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

**ఆలయ చరిత్ర :**

ఆనాడు శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూ తుంగభద్ర నది తీరంలో పర్యటించారు. ప్రాంతకాల పూజ నిమిత్తం సైకత లింగాన్ని పూజలు గావించారు.. శ్రీ రాముడిచే ప్రతిష్టంచబడిన లింగమే రామలింగేశ్వరుడిగా అవతరించాడని ప్రతి ఏటా కనుమ రోజున రామలింగేశ్వరుడి జాతర, మహా రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ......

అందరూ ఆహ్వానితులే: వై. సీతారామిరెడ్డి వై. బాలనాగిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు, మంత్రాలయం ఎమ్మెల్యే.. శ్రీ రామలింగేశ్వర స్వామి మా ఊరి దైవం. జాతర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రథయాత్రను పురస్కరించుకుని ఆలయానికి రంగులద్ది, విద్యుత్ దీపాలతో అలంకరణ చేశాం... ఉత్సవానికి అందరూ ఆహ్వానితులే. వేడుకలకు హాజరైన వారికి ప్రత్యేక భోజన వసతి ఏర్పాటు చేయడం జరుగుతుంది... కావున ప్రతి ఒక్కరూ తరలివచ్చి వేడుకలను విజయ.వంతం చేయాలని కోరుతున్నా.

## ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకురావాలి



మహానంది, జనవరి14,మనంన్యూస్ః మహానంది దేవస్థానం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఈఓ శ్రీనివాసరెడ్డి కోరారు. బుధవారం మహానంది పుణ్యక్షేత్రం పరిధిలో దాత పోగుల మహేశ్వర రెడ్డి సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేదపండితులు రవిశంకర్ అవదానితో కలసి పరిశీలించారు. పర్వదినాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంతంలో భక్తులకోసం దాదాపు 40 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆలయ పరిధిలో జరిగే వివిధ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులకు భక్తులు సహకరించాలన్నారు.అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడైనా అపరిశుబ్రన్ గా వుండకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వుండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే లడ్డు పోటును తనిఖీ చేశారు.వారివెంట సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య,మనోజ్, వున్నారు.

# థాయ్‌లాండ్‌లో ప్రమాదం



- రైలుపై జారిపడిన క్రేన్
- 29 మంది మృతి

**బ్యాంకాక్, జనవరి 14 :** థాయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదులుతున్న రైలుపై ఓ క్రేన్ జారిపడటంతో బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో 29 మంది మృతి చెందినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు.

బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ నిర్మాణ పనుల్లో ఉన్న ఓ క్రేన్ అదుపుతప్పి ఒక్కసారిగా కింద పడింది. అదే సమయంలో కింద ఉన్న పట్టాలపై నుంచి ఓ ప్రయాణికుల రైలు వెళ్తోంది.

క్రేన్ పడటంతో ఆ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో మంటలు చెలరేగాయి. ఈ సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 29 మంది మృతిచెందగా.. మరో 60 మందికి పైగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బోగీల్లో చిక్కుకున్న వారిని వెలికితీస్తున్నట్లు తెలిపారు. రైలు బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాచథాని ప్రావిన్స్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రైలుకు మొత్తం 3 బోగీలు ఉండగా.. చివరి రెండు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో రైల్లో 195 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఇరాన్‌లో మారణహోమం..

- 2,571కి పెరిగిన మృతులు

**దుబాయ్, జనవరి 14 :** ఆర్థిక సంక్షోభంతో ఇరాన్‌లో మొదలైన ఆందోళనలు మారణహోమంగా మారాయి. ఆందోళనకారులను అణచివేసే క్రమంలో ఆ దేశంలో భారీ విధ్వంసమే చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని వారాలుగా జరుగుతున్న ఈ ఘర్షణల్లో మృతుల సంఖ్య వేలల్లో ఉన్నట్లు తెలియడం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఇరాన్ ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మృతి చెందినట్లు అమెరికా కేంద్రంగా పని చేసే మానవ హక్కుల ఉద్యమకారుల వార్తా సంస్థ బుధవారం వెల్లడించింది.

వీరిలో 2,403 మంది ఆందోళనకారులు కాగా.. 147 మంది భద్రతా సిబ్బంది, ప్రభుత్వానికి చెందినవారు ఉన్నట్లు తెలుస్తోంది. ఆందోళనలతో సంబంధం లేని 12 మంది చిన్నారులు, 9 మంది పౌరులు చనిపోయినట్లు సదరు సంస్థ పేర్కొంది. ఇప్పటివరకు 18,000 మందికి పైగా నిరసనకారులను భద్రతాధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఘర్షణల్లో మరణాల సంఖ్య మరింత పెరగవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ఆందోళనల నేపథ్యంలో ఇరాన్లో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో కమ్యూనికేషన్ కోసం శాటిలైట్ ఇంటర్నెట్ ప్రొవైడర్ స్టార్‌లింక్ ఉచిత సేవలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మానవ హక్కుల సంఘాలు వెల్లడించగా.. స్టార్‌లింక్ మాత్రం ఇంకా ధ్రువీకరించలేదు.

**'నిరసనలు కొనసాగించండి'.. ఇరాన్‌పై ట్రంప్ కీలక పోస్ట్**

ఆందోళనకారులపై ఉక్కుపాదం మోపిన ఇరాన్.. తాజాగా ఓ నిరసనకారుడికి మరణశిక్ష అమలుచేసేందుకు సిద్ధమైంది. ఆందోళనల్లో పాల్గొన్న 26 ఏళ్ల ఇర్ఫాన్ సోల్తానిని ఇటీవల అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం అతడిని బహిరంగంగా ఉరితీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు మానవహక్కుల సంఘాలు, మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ వార్తలపై ట్రంప్ స్పందించారు. అలాంటి పనులు చేస్తే తమ ప్రతిచర్య చాలా తీవ్రంగా ఉంటుందని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించారు.



ఇదిలాఉండగా.. అమెరికా బెదిరింపులపై ఇరాన్ స్పందించింది. ఇరాన్ పౌరుల పాలిట ప్రధాన హంతకులు ఇద్దరే ఇద్దరంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఇరాన్‌లో ఆందోళనలు జరిగేలా ఆ రెండు దేశాలే రెచ్చగొడుతున్నాయని దుయ్యబట్టింది.

# 'డిజిటల్ ఐడీ'లపై వెనక్కి తగ్గిన బ్రిటన్!

**లండన్, జనవరి 14 :** దేశంలో వలసలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలకు డిజిటల్ ఐడీలు దోహదపడతాయని భావించిన బ్రిటన్.. తాజాగా ఈ ప్రణాళికపై వెనక్కి తగ్గింది. దేశంలో ఉద్యోగం పొందడానికి డిజిటల్ ఐడీ కార్డు తప్పనిసరి కాదని పేర్కొంది. ఈ విధానంపై ప్రతిపక్షాలతో పాటు అధికార పక్షం నుంచీ విమర్శలు రావడంతో యూకే ప్రధాని కీర్ స్టార్మర్ దీనిపై యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

బ్రిటన్ పౌరులు, నివాసితులు దేశంలో పనిచేయాలంటే డిజిటల్ ఐడీ కార్డులు ఉండాలని ప్రధాని కీర్ స్టార్మర్ గతంలో స్పష్టం చేశారు. దేశంలో అక్రమ వలసలను నియంత్రించడంలో దోహదపడుతుందని గత సెప్టెంబర్లో పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం, చిన్నారుల రక్షణతోపాటు ప్రభుత్వ సర్వీసులను మరింత సులభతరం చేస్తుందన్నారు. ఈ క్రమంలో భారత్‌లోని 'ఆధార్' వ్యవస్థ గురించి తెలుసుకునేందుకు స్టార్మర్ ఆసక్తి చూపారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సామాన్య పౌరులకు ఈ తరహా డిజిటల్ ఐడీ కార్డులను బ్రిటన్ తప్పనిసరి చేయలేదు. ఈ అంశం దశాబ్దాలుగా వివాదాస్పదంగానే ఉంది. మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కూడా వీటిని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. ఉగ్రవాదంపై పోరు, మోసాలను నియంత్రించడానికి ఇదో మార్గమని అప్పట్లో ఆయన చెప్పారు. కానీ, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను



ఉల్లంఘించడంతోపాటు వారి సమాచారానికి ముప్పు ఏర్పడుతుందని పౌర హక్కుల కార్యకర్తల వాదనతో ఆయా ప్రభుత్వాలు వెనకడుగు వేస్తున్నాయి.

# అమెరికాలో 'పాలక్ పనీర్'కు దక్కిన న్యాయం

## భారత విద్యార్థులకు రూ.1.8 కోట్ల పరిహారం

కొలరాడో,జనవరి 14 : అగ్రరాజ్యం అమెరికాలో ఇద్దరు భారతీయ విద్యార్థులు రెండేళ్ల పాటు చేసిన న్యాయపోరాటం ఎట్టకేలకు ఫలించింది. 'పాలక్ పనీర్' విషయంలో ఎదురైన వివక్షపై వారు చేసిన పోరాటానికి గానూ రూ.1.8 కోట్ల పరిహారం లభించింది.

భారత్‌కు చెందిన ఆదిత్య ప్రకాశ్, ఊర్మి భట్టాచార్య రెండేళ్ల క్రితం యూనివర్సిటీ ఆఫ్ కొలరాడోలో పీహెచ్‌డీ చదువుతున్న సమయంలో వారికి వివక్ష ఎదురైంది. 2023 సెప్టెంబరు 5న ఆదిత్య లంచ్ కోసం మైక్రోవేవ్లో పాలక్ పనీర్ వేడి చేసుకునేందుకు తన డిపార్ట్‌మెంట్ స్టాఫ్ క్యాంటీన్‌కు వెళ్లారు. అయితే, అక్కడ ఉన్న సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. ఇలాంటి ఆహారంతో భరించలేని వాసన వస్తోందని, దాన్ని



వేడి చేయొద్దని చెప్పారు. దీంతో అసహనానికి గురైన ఆదిత్య తన స్నేహితురాలు ఊర్మితో కలిసి యూనివర్సిటీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. కానీ, అటువైపు నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

ఆ తర్వాత కూడా పలుమార్లు ఆసియా వంటకాలపై యూనివర్సిటీ సిబ్బంది నుంచి వివక్ష ఎదురైనా యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలోనే ఎలాంటి కారణం చెప్పకుండా ఊర్మిని టీచింగ్ అసిస్టెంట్ జాబ్‌ను తొలగించడం మరింత వివాదానికి దారితీసింది. మరోవైపు, వీరి మాస్టర్స్ డిగ్రీలను ఇచ్చేందుకు విశ్వవిద్యాలయం నిరాకరించడంతో వీరిద్దరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొలరాడోలోని డిస్ట్రిక్ట్ కోర్టులో సివిల్ దావా వేశారు. దీంతో దిగొచ్చిన యూనివర్సిటీ వీరితో సెటిల్మెంట్ చేసుకుంది. భారతీయ విద్యార్థులకు 2లక్షల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.1.8కోట్లు) పరిహారం చెల్లించేందుకు అంగీకరించింది. వారి మాస్టర్స్ డిగ్రీలను కూడా ఇచ్చేస్తామని తెలిపింది. దీంతో ఈ వివాదం సద్దుమణిగింది. ఇటీవలే వీరిద్దరూ స్వదేశానికి తిరిగొచ్చారు.

ఈ విషయంపై తాజాగా ఊర్మి భట్టాచార్య పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. 'తినే తిండి విషయంలో స్వేచ్ఛ కోసం మేం పోరాటం చేయాల్సి వచ్చింది. ఇది మన ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. రెండేళ్ల ఈ పోరాటంలో మేం పరిహారంతో గెలిచి తలెత్తుకుని భారత్‌కు తిరిగొచ్చాం'' అని ఊర్మి రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఆదిత్య స్వస్థలం మధ్యప్రదేశ్లోని భోపాల్ కాగా.. ఊర్మి పశ్చిమబెంగాల్కు చెందినవారు. వీరిద్దరూ పీహెచ్‌డీ కోసం 2022లో అమెరికాకు వెళ్లారు.

# మానవాళికి పెద్ద ముప్పు ఏఎంఆర్

- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా

**అహ్మదాబాద్, జనవరి 14 :** యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) మానవాళికి అతిపెద్ద ముప్పు అని కేంద్ర హోంమంత్రి అమిత్



షా వ్యాఖ్యానించారు. రోజురోజుకు అధికమవుతున్న ఈ సవాలును ఎదుర్కొనేందుకు అనుగుణంగా నిర్దిష్ట ప్రణాళికను తయారుచేయాలని నిపుణులను ఆయన కోరారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న బయోటెక్నాలజీ పరిశోధనా కేంద్రానికి చెందిన బయో కంటైన్మెంట్ ఫెసిలిటీ-బీఎస్ఎల్ 4కు మంగళవారం శంకుస్థాపన చేసిన ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఔషధాలపై ప్రజల్లో అవగాహన అవసరమని మంత్రి అమిత్‌షా నొక్కిచెప్పారు. ''ఏఎంఆర్ అనేది యాంటీబయోటిక్స్‌కు వ్యతిరేకంగా అభివృద్ధి చెందిన నిరోధకత. ఈ విజ్ఞానశాస్త్రాన్ని మరింత కచ్చితం, దృఢంగా చేసేందుకు పరిశోధనలు అవసరం. గర్భిణుల్లో ఏఎంఆర్ తల్లి నుంచి బిడ్డకు వ్యాపిస్తుంది. దీనిని అరికట్టేందుకు నిర్దిష్ట ప్రణాళిక అవసరం. అంటువ్యాధులను నివారించడం, భవిష్యత్తు తరాలను ఏఎంఆర్ నుంచి రక్షించడం మన లక్ష్యం. యాంటీ బయోటిక్స్ కోర్సును పూర్తి చేయకపోవడం, వీటిపై అవగాహన లేకుండా వైద్యులు మందులు సిఫార్సు చేయడం. డాక్టర్ సూచనలు లేకుండా విపరీతంగా యాంటీ బయోటిక్స్‌ను వాడటం వంటివి ఈ పెనుముప్పుకు ప్రధాన కారణాలు. వీటిపై ఏఎంఆర్ అనేది వ్యక్తులకే కాదు, మొత్తం సమాజానికి తీవ్ర ముప్పు. ఇది పుణెలోని వైరాలజీ ల్యాబ్ తర్వాత రెండో అతిపెద్ద, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న మొట్టమొదటి ల్యాబొరేటరీ'' అని అమిత్ షా వ్యాఖ్యానించారు.

# ఆరోపణలు సులువే.. ఆధారాలెక్కడ

- కెనడాపై భారత రాయబారి ఫైర్

**ఒట్టావా, జనవరి 14 :** ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా 40 ఏళ్లుగా విఫలమవుతూనే ఉందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ అన్నారు. అందువల్లే భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని విమర్శించారు. కెనడా మీడియా సంస్థ సీబీసీకి దినేశ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటన ప్రస్తావనకు రాగా.. ఈ కేసులో భారత్‌పై కెనడా ఆరోపణలను ఆయన మరోసారి తిప్పికొట్టారు.

''కెనడా గడ్డ నుంచి జరుగుతోన్న ఉగ్ర కుట్రల గురించి మేం 40 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. ఉగ్రవాద కట్టడికి ఈ దేశ నేతలెవరైనా చర్యలు చేపట్టారా? ఈ కేసుల్లో కనీసం ఒక్కరికైనా శిక్ష పడిందా? కెనడా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఉగ్రవాదుల గురించి భారత్ లేవనెత్తినప్పుడు ఆధారాలు కావాలని డిమాండ్ చేస్తోంది. మరి మా దేశంపై కెనడా ఆరోపణలు చేసినప్పుడు కూడా ఆధారాలు చూపించాలి కదా. ఆరోపణలు చేయడం సులువే. ఆ ఘటనలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని చెప్పేందుకు కచ్చితమైన సమాచారం ఉందని పదే పదే చెబుతోంది. మరి అందుకు తగిన ఆధారాలెక్కడ?'' అని భారత రాయబారి ప్రశ్నించారు. నిజ్జర్ హత్య



కేసుకు సంబంధించి కెనడాలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదైందని, ఇప్పటివరకు భారత ప్రభుత్వంపై ఎలాంటి అభియోగాలు లేవని దినేశ్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందంటూ గతంలో కెనడా చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య విభేదాలు రాజుకున్న సంగతి తెలిసిందే.

# చిచ్చురేపిన చైనా కామ్రేడ్లు

- బీజేపీ, కాంగ్రెస్ నేతలతో సీపీసీ భేటీలు
- రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం

**ఢిల్లీ, జనవరి 14 :** కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) ప్రతినిధి బృందం జరిపిన భేటీలు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. చైనా నుంచి వచ్చిన బృందం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంతో పాటు ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్‌తో భేటీ అయింది. కాంగ్రెస్ నేతలతోనూ సమావేశమైంది. సీపీసీ అంతర్జాతీయ విభాగం ఉపమంత్రి సన్ హైయన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం కాంగ్రెస్ విదేశాంగ వ్యవహారాల విభాగం అధినేత సల్మాన్ ఖుర్షీద్‌తో భేటీ అయింది. భారత సందర్శనకు వచ్చిన ప్రతినిధి బృందం కోరిక మేరకు ప్రభుత్వ అనుమతితో భేటీ జరిగిందని కాంగ్రెస్ స్పష్టంచేసింది. బృందం బీజేపీ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన ఒకరోజు అనంతరం ప్రతిపక్ష నేతలను కలిసింది. చైనా ప్రతినిధి బృందంతో సమావేశంలో జాతీయ ప్రయోజనాలకు దోహదపడే అంశాలేవైనా బీజేపీ,ఆర్ఎస్ఎస్‌లు లేవనెత్తాయా అని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ప్రశ్నించారు. భారత్‌తో చైనా సంబంధాలు మెరుగుపడిన నేపథ్యంలో ఆ దేశ ప్రతినిధి బృందంతో తాము బహిరంగంగా సమావేశమయ్యామని, కాంగ్రెస్ మాత్రం సీపీసీతో రహస్య ఒప్పందం కుదుర్చుకుందని బీజేపీ ఆరోపించింది.

# ప్రయత్నాలు విఫలమైనా..

- డీకే శివకుమార్ పోస్ట్‌కు అర్థమేంటీ?

**బెంగళూరు, జనవరి 14 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కర్ణాటక పర్యటనతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై మరోసారి జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల వేళ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన పోస్ట్ మరింత చర్చనీయాంశంగా మారింది. 'ప్రయత్నాలు విఫలమైనా.. ప్రార్థనలు ఎన్నటికీ విఫలం కావు' అంటూ డీకే తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. దీంతో సీఎం మార్పుపైనే ఆయన పరోక్షంగా మాట్లాడారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. రాహుల్ గాంధీ మంగళవారం మైసూరులో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితర నేతలతో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. రాష్ట్రంలో అధికార పంపిణీ వ్యవహారంపై వీరు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పష్టతనివ్వాలని ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య రాహుల్ గాంధీని కోరినట్లు సమాచారం.

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారని అప్పట్లో వార్తలూ వచ్చాయి. అయితే, ఈ ఊహాగానాలను ఖండిస్తూ ఐదేళ్లూ తానే సీఎంగా




ఉంటానని సిద్ధరామయ్య పలుమార్లు స్పష్టం చేశారు. అదే సమయంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే ఆశ తనకు ఉందనే అర్థం వచ్చేలా డీకే కూడా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# కెనడాలో భారతీయుడి హత్య

**ఒట్టావా,జనవరి 14 :** కెనడాలో ఓ భారతీయుడు హత్యకు గురయ్యాడు. సర్రే నగరంలో మంగళవారం మధ్యాహ్నం పంజాబ్‌కు చెందిన వ్యాపారవేత్త బిందర్ గర్చా (48) తన ఇంటికి కొంత దూరంలో తీవ్ర గాయాలతో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడు బుల్లెట్ గాయాలతో ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. బిందర్ కొన్నేళ్లుగా



కెనడాలోనే నివాసం ఉంటూ స్టూడియో-12 పేరుతో ఫొటో స్టూడియో నడుపుతున్నట్లు తెలిపారు. అయితే ఈ హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాల్పులకు తెగబడిన దుండగులు వాడినదిగా భావిస్తున్న కాలిపోయిన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

# 'సీఎం' గందరగోళంపై స్పష్టతనివ్వండి

## రాహుల్‌గాంధీని కోరిన సిద్ధరామయ్య..!

**బెంగళూరు,జనవరి 14 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం మైసూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీఎం మార్పు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. రాహుల్‌గాంధీతో భేటీలో సీఎం మార్పు అంశంపై స్పష్టతనివ్వాలని సిద్ధరామయ్య ఆయనను కోరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అధికార మార్పు విషయంలో రాష్ట్ర ప్రజలు, పార్టీ, నేతలు కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారని.. దీనిపై వారికి స్పష్టతనివ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు సమాచారం. గత నవంబరు 20తో సిద్ధరామయ్య సర్కారుకు రెండున్నరేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో సిద్ధు, డీకే మద్దతుదారులు అదే పనిగా ఢిల్లీలో కాంగ్రెస్ నేతలతో సమావేశమవుతున్నారు. సిద్ధరామయ్య, డీకే అల్పాహార భేటీల పేరుతో మద్దతుదారులతో సమావేశమవడం, తాను సీఎం కావాలనే కోరికను శివకుమార్ పలుమార్లు పరోక్షంగా వ్యక్తపరుస్తుండడంతో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సమయంలో రాహుల్ కర్ణాటకకు వెళ్లడం



ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే రాహుల్‌గాంధీతో తాము మర్యాదపూర్వకంగానే భేటీ అయినట్లు సిద్ధరామయ్య పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణపై త్వరలో రాహుల్‌తో మరోసారి సమావేశమవ్వనున్నట్లు తెలిపారు.

# ఐఎన్ఎస్‌వి కౌండిన్య 'వింటేజ్' యానం

- నౌకాయానంలో భారత్ ఘనత

**మస్కట్ ,జనవరి 14 :** నౌకాయాన రంగంలో భారత్ అరుదైన ఘనత సాధించింది. ఇటీవల గుజరాత్లోని పోరుబందర్ నుంచి బయల్దేరిన 'ఐఎన్ఎస్వీ కౌండిన్య' బుధవారం ఒమన్‌లోని మస్కట్‌కు విజయవంతంగా చేరుకుంది. ఎటువంటి ఇంజిన్ లేకుండా పూర్తిగా తెరచాపల సాయంతో పయనించి తన గమ్యాన్ని చేరుకుంది. దాదాపు 1400 కిలోమీటర్ల ప్రయాణాన్ని.. 17 రోజుల్లో పూర్తి చేసింది. మస్కట్‌కు చేరుకున్న అనంతరం ఓడలోని సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. అజంతా గుహల్లోని 5వ శతాబ్దం నాటి పెయింటింగ్‌లోని ఒక నౌక నుంచి ప్రేరణ పొందిన ఆధునిక భారత నిపుణులు.. 'ఐఎన్ఎస్వీ కౌండిన్య' రూపంలో దాన్ని పునఃసృష్టించారు. దీని తయారీలో పురాతన విధానాలనే అవలంబించారు. లోహాలు, మేకులను ఉపయోగించలేదు. చెక్కలను వాడారు. వీటిని కొబ్బరి పీచుతో తయారుచేసిన తాళ్లతో గుదిగుచ్చారు. అందువల్ల ఈ



నౌకను 'స్టిచ్డ్ షిప్'గా పిలుస్తున్నారు. సముద్ర ఉప్పునీటి నుంచి రక్షణ కోసం దీనికి సహజసిద్ధ జిగురు పూతను వేశారు.

# బ్యాంకు ఖాతాలో....కోత సాధ్యమా..?

- సీఎం రేవంత్ ప్రకటనతో వాహనదారుల్లో జోరుగా చర్చ
- రహదారుల తీరు తెన్నులపై ప్రజల కన్నెర్ర
- ముఖ్యమంత్రి తాజామాటపై తర్జన భజన
- అడలెత్తిపోతున్న వాహనాల యాజమాన్లు
- ఎన్నికల ముందు 50 శాతం కోత హామీ మాట ఏమైంది




సూర్యాపేట జనవరి 14 (మనం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన అంశం రాష్ట్రవ్యాప్తంగా వాహన యజమానుల గుండెల్లో గుబులు రేపుతోంది.. ముఖ్యమంత్రి నోటి నుండి వెలువడిన వాక్కు ఎప్పుడు అమల్లోకి వస్తుందని ఆందోళన వాహనా దారులను కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది వాహనదారులపై నమోదైన చాలానా మొత్తం వారి పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలో నుండి ప్రభుత్వం నేరుగా జమ చేసుకోవడం ఎలా సాధ్యం..? అంటూ చర్చ జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో జోరుగా కొనసాగుతుంది గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మరచిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు తగుతున్నమ్మ అంటూ బ్యాంకు ఖాతా ఉన్న వాహనాల యాజమాన్యాల పేరిట నెలకొన్న ఖాతాలో నుంచి చలానా రూపంలో ప్రభుత్వ ఖజానాలో జమ చేసుకునేందుకు సిద్ధపడుతున్న తీరు చాప కింద నీరులా ప్రజల్లో వాహనదారులు చర్చగా సాగుతుంది.. ఇప్పటికే కొని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై విమర్శలు గుప్పిస్తున్న ప్రజానీకం తాజాగా ముఖ్యమంత్రి ప్రకటనతో అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ విధానాన్ని చాలామంది నేటిజెన్లు బహిరంగంగా వ్యతిరేకిస్తుండటం గమనార్హం. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం రోడ్ల నిర్మాణ విషయంలో ఎక్కడికక్కడ రహదారుల నిర్వహణ సరిగా లేక అధ్వాన స్థితికి చేరుకొని ప్రజలను వాహన దారుల ప్రాణాలు ఒకపక్క గాలిలో కలుస్తుంటే మరోపక్క బ్యాంక్ ఖాతాలో చాలానా రాబట్టుకునే తీరు సర్కార్ పై సర్వత్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా ప్రజలు సీఎం రేవంత్ తీరును తప్పుపడుతూ తమ అసహనాన్ని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు ఇలాంటి సందర్భాల్లో ప్రజల నుండి ప్రభుత్వానికి ఎన్నో ప్రశ్నలు సంధిస్తున్నారు... ముఖ్యంగా గుంతల మాయమైన రోడ్లు పునర్నిర్మాణం తో పాటు గత సార్వత్రిక ఎన్నికల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చాలానా పేరుతో వాహనదారుల్లో పేరుకుపై ఉన్న బాకీలలో 50 శాతం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాఫీ చేస్తామని స్పష్టం చేసింది.. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన... కాంగ్రెస్ ప్రభుత్వం చాలానా 50 శాతం మాఫీ పై మాట... ఏమైందంటూ.. గుర్తు చేస్తూ... వాహనదారులు ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నారు.... గత ప్రభుత్వం చిన్న చితక దానికి అతిగా స్పందించి అనవసరంగా వాహనాదారులకు చాలానాలు వేస్తూ ప్రజల సొమ్మును కొల్లగొట్టడం తగునా అంటూ ఆనాడు బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ నేడు అవేవీ తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తూ ఏకంగా బ్యాంకు ఖాతాలో నుండి డబ్బులు చాలానా పేరుతో గుంజుకోవడం ఎంతవరకు సాధ్యం అంటూ ప్రజలు వాహనదారులు గొల్లుమంటున్నారు రాష్ట్రంలో విపక్ష పార్టీలు సైతం చాలా నా రూపంలో నేరుగా ప్రజల నుండి డబ్బులు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన విధానాన్ని



వ్యతిరేకిస్తూ.. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకొని రద్దు చేయాలని డిమాండ్ అటు విపక్షాలు నుండి..

ఇటు నేటిజనుల నుండి భారీ ఎత్తున వినిపిస్తోంది.

# రెండేళ్ల అభివృద్ధి సంక్షేమం... గాలికి



- కాంగ్రెస్ పాలనలో అరాచక అక్రమాలు తప్ప ఏమీ లేదు
- ఈ ఏడాది నుంచైనా మంచి పాలన సాగాలి
- రైతుల ధాన్యరాశి సంక్రాంతి
- ప్రతి ఇల్లు ఆయురా ఆరోగ్యాలు సిరి సంపదతో నిండాలి
- భోగి మంటల వేడుకల్లో మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, జనవరి 14 (మనం ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ప్రజల అభివృద్ధి నిరుపేదల సంక్షేమనీ గాలికి వదిలేసిందని సూర్యాపేట శాసనసభ్యులు మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి విమర్శించారు.బోగి పండుగ పురస్కరించుకొని సూర్యాపేట పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన బోగి మంటల వేడుకలో పాల్గొని అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ... రైతులకు ధాన్య రాశి పంటల పండుగ సంక్రాంతి అని భోగి మంటల్లో చెడు ఆలోచనలు వదిలేసి మంచి ఆలోచనతో ముందుకు పోవాలని తెలిపారు. ఈ పండుగ పతంగులతో చిన్నారులు.. ముగ్గులతో మహిళలు మురిసే పండుగని సిరి సంపదలతో ప్రతి ఇంటా వెలుగులు ఉండాలని ఆకాంక్షించారు. పతంగులు ఎగరవేసే సమయంలో చిన్నారులు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఎగురవేయాలి అన్నారు.

### రెండేళ్ల ప్రభుత్వ పాలనపై ధ్వజం

కాంగ్రెస్ చెడు ఆలోచనలు భోగిమంటల్లో పోవాలని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి



రెండేళ్లుగా ప్రజా వ్యతిరేకపాలన సాగుతోంది రాష్ట్రంలో కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల, సంక్షేమం పట్ల సోయిలేని కాంగ్రెస్ ప్రభుత్వం బూతుల పంచాంగానికి మాత్రం తెర లేపింది అన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు అరెస్టు చేస్తున్నారని ఇప్పటికే ప్రజలు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీ పాలనలను ఎండగాడుతునా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గోసపెడుతుందని ముఖ్యంగా దేశానికి అన్నం పెట్టే రైతన్నల సమస్యలపై చిత్తశుద్ధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆపార్టీ పాలకుల తీరు ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా నడుస్తోందని.రెండేళ్ల పాలనలో అరాచకాలు, అక్రమాలు తప్ప చేసింది ఏందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ మంత్రుల చెడు ఆలోచనలు కూడా భోగిమంటల్లో కాలిపోయి.ఈ ఏడాది నుంచైనా మంచి పరిపాలన కొనసాగాలని ఆకాంక్షిద్దామన్నారు. అనంతరం చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్. మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమళ్ళ అన్నపూర్ణ. మాజీ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్. బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ. నాయకులు ముదిరెడ్డి అనిల్ రెడ్డి. జీడి బిక్షం. గండూరి పావని కృపాకర్. భాష. వాంకుడోత్ పద్మ. తదితరులు పాల్గొన్నారు.

# భోగభాగ్యాల భోగి సంబరాలు



నేరేడుచర్ల జనవరి 14 మనం న్యూస్ : నేరేడుచర్ల పట్టణంలో గల శ్రీ సరస్వతి విద్యా మందిర్ ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భోగ భాగ్యాల భోగి ఉత్సవ సంబరాలు బుధవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. చీకట్లను చీల్చుకుంటూ వచ్చే వెలుగులు అందరి జీవితాలలో ఆనందం నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఒకరికొకరు భోగి శుభాకాంక్షలు తెలుపుకుంటూ జైశ్రీరామ్ జై జై శ్రీరామ్ రామలక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి భారత్ మాతాకీ జై అంటూ అగ్నిసాక్షిగా సంబరాలు నిర్వహించారు. ఈ భోగి సంబరాలలో ముఖ్యఅతిథిగా మిర్యాలగూడ న్యాయవాది గూడూరు శ్రీనివాస్ పాల్గొని నాలుగు రోజులు జరుపుకునే భోగి సంక్రాంతి కనుమ ముక్కనుమ పండుగ ప్రాధాన్యతను సాంప్రదాయాలను వివరించారు. ఈ వేడుకలలో గెల్లి శ్రీనివాసరావు, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, మాశెట్టి మోహన్, చామకూరి. వీరయ్య గౌడ్, నోముల మల్లేశం, వెంపటి వెంకన్న, బలగం రాము, కంది బండ రవి,నీల శ్రీనివాస్, కొత్త లక్ష్మణ్, రాచకొండ శ్రీనివాస్, గరినే సతీష్, పివిటి, బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నారద మోహన్ రెడ్డి, పమ్మి రాంబాబు, శేఖరా చారి, మల్లికంటి శ్రీను, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# ఆలయ ముఖద్వారాల నిర్మాణానికి శంకుస్థాపన



నేరేడుచర్ల జనవరి 14 మనం న్యూస్: నేరేడుచర్ల పట్టణంలో గల శ్రీ కోదండ రామాలయం, శ్రీ విజయ దుర్గ ఆలయాల ముఖద్వారాల నిర్మాణానికి మండలంలోని కల్లూరు గ్రామ సర్పంచ్ చలసాని శ్రీనివాసరావు మంజుల కుమారుడు ఆడ్రాయిట్ సొల్యూషన్స్ అధినేత చలసాని రాజీవ్ 6 లక్షల రూపాయలు విరాళంగా అందించారు. బుధవారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణ రెడ్డి,శ్రీ కోదండ రామాలయం ఆలయ ధర్మకర్త రాచకొండ రామచంద్రరావు, శ్రీ విజయ దుర్గ ఆలయ కమిటీ చైర్మన్ కొణతం ఆదిరెడ్డి,మేడారం సర్పంచ్ పారేపల్లి సత్యనారాయణ, సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు ధూళిపాల ధనుంజయ నాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, బెల్లంకొండ నరసింహారావు,వల్లపు రెడ్డి, పేర్వాల రంగారెడ్డి, నీల రామ్మూర్తి, కుంకు శ్రీనివాసరావు, తుమ్మలూరు సైదిరెడ్డి, కుంకు చిన్నయ్య, కోనేరు బుజ్జిబాబు, కుంకు మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు

# గృహ జ్యోతి పథకం పేదలకు వరం



నడిగూడెం, జనవరి 14(మనం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకం పేదలకు వరం అని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాస్ అన్నారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పొందుతున్న గృహ జ్యోతి లబ్ధిదారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పేరున పంపిన సంక్రాంతి శుభాకాంక్షలు కాపీలను విద్యుత్ అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. గతంలో విద్యుత్ బిల్లులు కట్టలేక ఎంతోమంది పేదలు ఇబ్బందులు పడ్డారని, గృహ జ్యోతి పథకంతో కరెంటు బిల్లుల కష్టాలు తొలగి పేదల ఇళ్లలో కరెంటు కష్టాలు తొలగి ఆనందంగా ఉన్నారన్నారు.గ్రామంలో 1229 విద్యుత్ కనెక్షన్ లు ఉండగా 829 విద్యుత్ కనెక్షన్లకు గృహ జ్యోతి పథకం ద్వారా లబ్ధిదారులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు.రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో గ్రామంలో విద్యుత్ సమస్యలు రాకుండా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో లైన్ మెన్ భూక్య శ్రీను, విద్యుత్ సిబ్బంది లవకుశ రెడ్డి, గోపి లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సందర్భంగా మహిళలకు లక్ష్మీపూర్ లో ముగ్గుల పోటీలు

- హాజరైన ఎస్సై భీమినీ సర్పంచ్....



భీమిని జనవరి 14 మనం న్యూస్ : భీమిని మండలం లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను మాజీ ఎంపీపీ పోతరాజుల రాజేశ్వరి శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు ఆధ్వర్యంలోనిర్వహించారు ముగ్గుల పోటీలలో మహిళలు మరియు అమ్మాయిలు చాలా ఉత్సాహంగా పాల్గొని, ముగ్గులు వేయడం జరిగినది. ముఖ్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిని ఎస్ఐ విజయ్ కుమార్ భీమిని సర్పంచ్ బండి శ్రీకాంత్ గౌడ్ మరియు న్యాయ నిర్ణేతలుగా బండి శ్రీవాణి శ్రీకాంత్ గౌడ్ అక్కలపల్లి ఉపసర్పంచ్ రమాదేవి ముక్తేశ్వర్, మహిళా కానిస్టేబుల్లు దీపిక, మహేశ్వరి పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి పి. భానుమతి, రెండవ బహుమతి పి వైష్ణవి, మూడవ బహుమతి కే. అంజలి లకు మరియు పోటీలలో పాల్గొన్న వారందరికీ కూడా కన్సోలేషన్ బహుమతులను భీమిని మాజీ ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్, ఎస్ ఐ విజయ్ కుమార్ పోతురాజుల రాజయ్య శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్ రమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోలింగ్ స్టేషన్ ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై పార్టీల నాయకులతో సమావేశం...



జమ్మికుంట, జనవరి 14 (మనం న్యూస్): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్ ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ... జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో పోలింగ్ స్టేషన్ లలో వచ్చిన ఫిర్యాదుల మేరకు మరొక్కసారి పునః పరిశీలిస్తున్నామని అన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చిన పోలింగ్ స్టేషన్ ల సమస్యలను ఆయన విశదీకరించి, దానిపై రెండు, మూడు రోజుల్లో పోలింగ్ స్టేషన్ లను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ వాణి లతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# భోగి పండగ సందర్భంగా భోగి మంటల కార్యక్రమం



గోదావరిఖని, జనవరి 14 (మనం న్యూస్): భోగి అంటే త్యాగమని, పనికి రాని వస్తువులను భోగి మంటల్లో వేసి, కొత్త జీవన ప్రయాణానికి శ్రీకారం చుట్టడం భోగి పండుగ ఉద్దేశ్యం అని అన్నారు గోదావరిఖని కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులు. ఈ మేరకు స్థానిక కళ్యాణ్ నగర్ గోదావరిఖని కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ... భోగి అంటే త్యాగమని, పనికి రాని వస్తువులను భోగి మంటల్లో వేసి, కొత్త జీవన ప్రయాణానికి శ్రీకారం చుట్టడం భోగి పండుగ ఉద్దేశ్యం అని అన్నారు. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ముందు రోజు కావడంతో ప్రకృతికి కృతజ్ఞత తెలుపుకునే పండుగగా భోగి నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చొక్కారపు వెంకటేశ్వర్లు, చిట్టిమల్ల కిషోర్, రేణిగుంట చందర్, నగునూరి సత్య ప్రసాద్, రావికంటి శశిధర్, గడ్డం సత్యనారాయణ, రామిడి నవీన్, రావికంటి విజయ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ కలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు



సుల్తానాబాద్ జనవరి 14 (మనం న్యూస్)

గ్రామీణ కళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు ఎంత దోహదపడతాయని మంచరామి సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల సహాయక కార్యదర్శి ఉప్పు లక్ష్మి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని మంచరామి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం సర్పంచ్ ఉప్పు లక్ష్మితిరుపతి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. హరిదాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జడ్జిలుగా లక్ష్మణ్, శారదలు వ్యవహరించారు. అనంతరం విజేతలకు సర్పంచ్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. మొదటి, రెండవ, మూడో బహుమతితో పాటు ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక మహిళకు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎగుర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

# మంథనిలో వైభవంగా గోదాదేవి కళ్యాణం



మంథని,జనవరి14(మనంన్యూస్) మంథని పట్టణంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో గోదాదేవి కల్యాణాన్ని బుధవారం భోగి పండుగ రోజున అత్యంతవైభవంగా నిర్వహించారు.పవిత్ర హృదయంతో శ్రీరంగనాథుడిని నిత్య పూలమాలతో పూజించి, స్వామివారికే తన జీవితాన్ని అర్పించిన మహా భక్తురాలు అయిన గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకుడు తిరువరంగం ప్రసాదాచార్యులు- వైష్ణవి దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా చేపట్టారు.వేద పండితులు దుద్దిళ్ల మారుతి శర్మ,దుద్దిళ్ల శ్రీనివాస్ శర్మ,తల్లం శ్రీనివాస్ ల మంత్రోచ్చారణల మధ్య గోదాదేవి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా సాగింది.ఈ కళ్యాణంలో పాల్గొనడం వల్ల కోరిన కోరికలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. కళ్యాణం తర్వాత, గోదాదేవి రచించిన 'తిరుప్పావై'లోని 10 పాశురాలను పఠిస్తూ 'వారణ మాయిరం' క్రతువు నిర్వహిస్తారు. ఏటా ధనుర్మాసంలో 30 రోజులపాటు సాగే ఆండాళ్ అమ్మవారి తిరుప్పావై పాశురాల పఠనం అనంతరం గోదాదేవి కల్యాణంతో ధనుర్మాస వ్రతం ముగుస్తుంది.ఈ కళ్యాణంలో పాల్గొంటే వివాహం కానివారికి వివాహం,సంతానం లేనివారికి సంతానం కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.కన్నుల పండువగా నిర్వహించిన గోదాదేవి కల్యాణ మహోత్సవంలో మంథని పట్టణ పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సాంప్రదాయ సంస్కృతి, ఐక్యతకు ముగ్గుల పోటీలు



ఎలిగేడు జనవరి 14 (మనం న్యూస్) ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలో సర్పంచ్ మద్దెల రమా సంపత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళ యువతుల ప్రతిభను ప్రోత్సహించేందుకు, సంస్కృతిని నిలుపుకోవడానికి గ్రామంలో ప్రతిబింబించేలా ఈ ముగ్గుల పోటీ ఏర్పాటు చేశామని అన్నారు.పోటీల్లో మహిళలు పోటాపోటీగా ముగ్గులు వేశారు రంగు రంగుల కలర్లతో మహిళలు వేసిన ముగ్గులను చూపరులను మంత్ర ముద్దులను చేశాయి. మహిళలు ఒకరిని మించి మరొకరు రంగు రంగుల అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నాయి ముగ్గుల పోటీల్లో ఉత్తమమైన ముగ్గులను ఎంపిక చేసి విజేతలను ప్రకటించారు. పోటీలో ఉత్తమమైన ముగ్గులను ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి - సంపత్, మాజీ సర్పంచ్ సంగీత- సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రేమలత - కమలాకర్ రెడ్డి, కార్యదర్శి హరిబాబు ,వార్డ్ మెంబర్స్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ అభివృద్ధి కోసం విరాళం.

చేవెళ్ల, జనవరి 14 (మనం న్యూస్) : చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని నల్ల పోచమ్మ దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయంగా మున్సిపల్ భాజపా అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు రూ.21వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, విరాళం అందించిన వారికి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

# మల్లన్నను దర్శించుకున్న దేవాదాయ, ధర్మాదాయ మంత్రి



పర్వతగిరి జనవరి 14 ( మనం న్యూస్)ః భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో సంక్రాతి 'భోగి పండుగ 'పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ శైవ క్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రివర్యులు కొండ సురేఖ తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నెనీ రవీందర్ రావు లు ఐనవోలు ( మల్లన్న) స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన మంత్రి సురేఖ పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నెనీ రవీందర్ రావు లకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు అందించి, తీర్థ-ప్రసాదాలు అందజేశారు. తదనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంత్రి, ఎమ్మెల్యేలు పరిశీలించారు. భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన బస్ బస్టాండ్ ను ప్రారంభించి జెండా బస్సులో మంత్రి సురేఖ ఎమ్మెల్యే నాగరాజు ఉప్రయాణించినారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ. భోగి పర్వదినం సందర్భంగా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఐనవోలు ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, బ్రహ్మోత్సవాలు, జాతరల నిర్వహణకు అన్ని విధాలా సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ. భోగి పర్వదినం సందర్భంగా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం తనకు అపారమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయం తెలంగాణకే కాదు, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రమని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం అభినందనీయమని అన్నారు. భక్తుల సౌకర్యాల దృష్ట్యా తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత మరింత మెరుగుపర్చాలని అధికారులను కోరారు. భోగి పండుగ రైతులకు, ప్రజలకు పాత కష్టాలను విడిచిపెట్టి కొత్త ఆశలతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని, అలాగే ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి కృపతో వర్ధన్నపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే నాగరాజు గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ శ్రీ మార్నెనీ రవీందర్ రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేగొండలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

- 63 మంది లబ్ధిదారులకు రూ.18,12,000 విలువైన చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే..



రేగొండ, 14 జనవరి(మనంన్యూస్)ః బుధవారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో కొత్తపల్లిగోరి మరియు రేగొండ మండలాల్లోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 63 మంది లబ్ధిదారులకు రూ.18,12,000 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల కష్టసుఖాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు తక్షణ సహాయం అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను నిరంతరం కృషి చేస్తానని, రేగొండ మండల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు.. .మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో భోగి పర్వదినం సందర్భంగా కొత్తపల్లి(బి) గ్రామానికి చెందిన క్యాతం ఐలయ్య - వసంత గార్లు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే అట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన ముగ్గుల పోటీల్లో ఎమ్మెల్యే పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముగ్గులు మన సంస్కృతి, సంప్రదాయాలకు మహిళల సృజనాత్మకతను ప్రతిబింబించే కళారూపమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మన సంప్రదాయాలు భావి తరాలకు చేరుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళల భాగస్వామ్యంతో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మరింత విస్తరించాలన్నారు.

## గోధా రంగనాధుల కళ్యాణంలో పాల్గొన్న జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్



రేగొండ జనవరి 14, మనం న్యూస్ః భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో ఉన్న రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారంనిర్వహించిన గోధా రంగనాధుల కళ్యాణం కార్యక్రమం వేదమంత్రాల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్, భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి గారు ముఖ్య అతిథిగా పాల్గొని గోధా రంగనాధుల కళ్యాణాన్ని వీక్షించారు. అలాగే సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి-సునీత దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన కళ్యాణ కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో వీక్షించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# భూపాలపల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యం



- భూపాలపల్లి- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ జనవరి 14 మనం న్యూస్ః భూపాలపల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు కారల్ మారక్స్ కాలనీలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపాలిటీ ల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర పనులు ఈ అభివృద్ధి కార్యక్రమాలలో భాగమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన భూపాలపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా సహకరించి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగా పుల్లూరిరామయ్యపల్లిలో జరిగిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, బహుమతులను అందజేశారు.

# జర్నలిస్టుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

- ఇది మీడియా స్వేచ్ఛపై నేరుగా దాడి..
- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్ యూజే-ఐ)..



రేగొండ జనవరి 14 మనం న్యూస్ః భూపాలపల్లి జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులైన దొంతు రమేష్,చారి,సుధీర్లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్.యూజే-ఐ) తీవ్రంగా ఖండిస్తుందని టీఎస్ జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్,జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ లు తెలిపారు.బుధవారం వారు మాట్లాడుతూ

ఈ అరెస్టులు మీడియా స్వేచ్ఛను హరించే చర్యలని అన్నారు.ఈ అరెస్టుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం,మీడియో స్వేచ్ఛగా రాయొద్దు,ప్రభుత్వాన్ని ప్రశ్నించొద్దు,అధికారంలో ఉన్నవారి మీద కథనాలు రాస్తే జైలు తప్పదు అని చెప్పాలనుకుంటున్నట్టుగా ఈ చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు.ఒక పత్రికలో లేదా మీడియాలో ఒక అంశంపై కథనం వచ్చినప్పుడు,అందులోని నిజానిజాలపై అధికారులు విచారణ జరిపించాలి.కానీ ఆ అంశాన్ని బయటికి తీసుకొచ్చిన జర్నలిస్టుల మీదే కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యంలో ఎక్కడా సమంజసం కాదన్నారు.

అనేక సోర్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆధారంగానే కథనాలు తయారవుతాయన్నారు.ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన మంత్రులు, అధికారులు మీద ఆరోపణలు వస్తే,ఆ ఆరోపణల నిజానిజాలు నిగ్గు తేల్చాల్సింది ప్రభుత్వం,తప్పు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి కానీ ఆ పని చేయకుండా,జర్నలిస్టుల మీద పడి కేసులు పెట్టడం అంటే,ప్రభుత్వంలో ఉన్నవారు ఏం చేసినా చెల్లుతుందనే సంకేతాన్ని ప్రజలకు ఇవ్వడమేనని చెప్పారు.ఏ వ్యక్తిగత ఫిర్యాదు లేకుండా,ఆ కేసులో పేర్లు లేకున్న కేవలం ఒక సంఘం ఫిర్యాదును ఆధారం చేసుకొని జర్నలిస్టులను అరెస్ట్ చేయడం పూర్తిగా తప్పని, ఇది చట్టం కాదనీ ,ఇది భయపెట్టే ప్రయత్నం అన్నారు.ప్రభుత్వం ఈ కేసు ను వెంటనే ఎత్తివేసి,జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు.మీడియా స్వేచ్ఛపై దాడులు ఆపకపోతే పెద్ద జర్నలిస్ట్ ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్,సంయుక్త కార్యదర్శులు కడపాక రవి,పల్నాటి రాజు,మారెపల్లి చంద్ర మౌళి, భూపాల్,జగన్, కారుకూరి సతీష్ హేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న.. ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు



పర్వతగిరి, జనవరి 14 ( మనం న్యూస్ )ః ఐనవోలు మండలంలో సంక్రాంతి పండుగ పర్వదినం సందర్భంగా భోగి పండుగ ఉత్సవాల నేపథ్యంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషా - దయాకర్ రావుఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి ఉషా గారితో బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్, మాజీ వైస్ ఎంపీపీ తంపుల మోహన్, మాజీ నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్ రావు ఐనవోలు గ్రామ సర్పంచ్ గడ్డం రఘు వంశీ గౌడ్ ,
కొండపర్తి గ్రామ సర్పంచ్ కంజర్ల అశోక్ రావు ఆయా గ్రామల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

# కోర మీసాలోడి జాతరకు... పోటెత్తిన జనం

**కోర మీసాలు, గుమ్మడికాయతో భక్తుల సమర్పణ**

**శాలివాహనులు సమర్పించిన వీర బోనం**

భీమదేవరపల్లి జనవరి 14 మనం న్యూస్: తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన వీరభద్ర జాతరకు పోటెత్తిన జనంతో జన సముద్రమైంది. సంక్రాంతి పర్వదినమున భోగి పండుగ రోజున వీరభద్రునికి ప్రత్యేక అభిషేకములు భద్రకాళి అమ్మవారికి శ్రీ చక్ర అర్చన, నవావరణ పూజ అర్చకులు నిర్వహించిన అనంతరం శాలివాహనులు సమర్పించి ఆలయ ప్రవేశం చేసి స్వామివారికి అమ్మవారికి సమర్పించడం ఆనవాయుతుగా వస్తున్నది. రాష్ట్రంలోని నలుమూలల జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వీరభద్రను దర్శించుకొని కోరికలు తీర్చేందుకు కోరమీసాలు, గుమ్మడికాయలతో, కోడె మొక్కులతోసమర్పించుకొని వీరభద్రుని దర్శించుకుంటారు. ఉచిత దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్: వీరభద్రుని దర్శించుకునే భక్తులకు చలవ పందిళ్లతో క్యూ లైన్లు ఏర్పాటు, వృద్ధులకు వికలాంగులకు ప్రత్యేక వాహనాల ద్వారా ఆలయానికి చేరువేసి ప్రత్యేక దర్శనంకు ఏర్పాటు



చేయడం విశేషం.

**శాలివాహముల వీరబోణ సమర్పణం:**

భోగి పండుగ రోజున స్వామివారికి అభిషేకములు అమ్మవారికి శ్రీ చక్ర అర్చన నవావరణ పూజ అర్చకులు నిర్వహించిన అనంతరం కడిపికొండ, ఉల్లిగడ్డ దామర ,గ్రామాలకుమ్మరి కులస్తులు శివసత్తుల, వీరశైవలుల నృత్యాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామివారికి,అమ్మవారి లకు వీర బోనమును ఆనవాయితీగా సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్ రావు ఉత్సవ కమిటీ చైర్మన్ బొజ్జ పూరిఅశోక్ ముఖర్జీ పర్యవేక్షణలో భక్తుల సౌకర్యాలను అధికారులను సమన్వయం చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు సీఐ పులి రమేష్ ఎస్సై ఎం రాజు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

# అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో ముగ్గుల పోటీలు



మల్హార్, జనవరి 14(మనం న్యూస్)ః మండలంలోని వల్లెంకుంటలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ముక్కులో పోటీలు నిర్వహించిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మారపాక వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ బొమ్మ రజిత రమేష్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శనిగరం రవీందర్ ప్రధాన కార్యదర్శి శనిగరం శ్రీనివాస్ కోశాధికారి మారుపాక సంజీవ్, ఉపసర్పంచ్ కటకం స్వప్ననరేష్, వార్డు సభ్యులు శనిగరం సరస్వతి, మరపాక కవితా, కాసిపేట రాజేందర్,ఎడ్ల అరుణ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శనిగరా సురేష్, అంబేద్కర్ మాల మహా సంఘం అధ్యక్షులు వేల్పుల రవి, మాజీ సర్పంచ్ శనిగరం రమేష్, యువకులు మహిళలు పాల్గొని ఈ యొక్క ముగ్గుల పోటీని విజయవంతంగా నిర్వహించారు.

# వైభవంగా గోదా కళ్యాణం ఉత్సవం



సుల్తానాబాద్ జనవరి 14 (మనం న్యూస్) సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద హనుమాన్ ఆలయంలో గోదా రంగనాథ స్వామి కల్యాణము వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొండపలకల అభిలాష్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ చైర్మన్ ఆకుల రామేశ్వర్ రెడ్డి విజయలక్ష్మి దంపతులు గోదారి రంగనాయక స్వామి వారికి ఫుడ్ బియ్యం నూతన వస్త్రాలు సమర్పించారు పలువురు మహిళలు గోదా అమ్మవారికి సారే కానుకలు సమర్పించారు. ఆలయ అర్చకులు కొండపక్కల అభిలాష్ స్వామి మాట్లాడుతూ దరువు మాస వ్రత విశిష్టత గురించి ఈ మాసంలో ఆచరించవలసిన తిరుప్పావై వ్రతం గురించి 30 పాశురాల గురించి భక్తులకు వివరించారు 30 రోజులలో ఒక్కసారైనా పాశురాలను చూస్తే ధర్మబద్ధమైన కోరికలు నెరవేరుతాయి అని అన్నారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల విజయ లక్ష్మి రామేశ్వర్ రెడ్డి, గుబుడే రేణుకా సంతోష్ , వికాస తరంగిణి కో ఆర్డినేటర్,సీనియర్ జర్నలిస్ట్ సాదుల సుగుణాకర్ సునీత , మెంగాణీ రాధ చంద్రశేఖర్ , డైరెక్టర్ పిడుగు విమల ఓదెలు , కత్తెర్ల స్వరూప పోషమల్లు , గొట్టం మహేష్ , అంజయ్య , జలజ,శివ , శ్రీనివాస్ , బ్యాంక్ శేఖర్,మొండయ్య, అల్లాడి భగవాన్,భూలింగం పాల్గొన్నారు.

# కబడ్డీ పోటీలు నిర్వహించు కున్న గిరిజన తండా యువత క్రీడాకారులు



పర్వతగిరి జనవరి 14 ( మనం న్యూస్ ) : పర్వతగిరి మండలంలో బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించు కున్న గిరిజన తండా యువత క్రీడాకారులు క్రీడలతో శారీరక ధృడత్వం , మానసికోల్లాసం కలుగుతుందని ప్రజా ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఇస్లావత్ తండా, ధరంసోత్ తండా, మూడు తండా, భూక్యా తండా యువకులు ఉత్సాహంగా పాల్గొని కబడ్డీ ఆడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఇస్లావత్ రాజేందర్, మాజీ వార్డు సభ్యులు ఇస్లావత్ రవీందర్, శ్రీనివాస్, ఆయా తండాల యువకులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఉపసర్పంచ్



మల్హర్ .జనవరి .14. మన .న్యూస్: మండలంలోని వల్లెంకుంట గ్రామంలో ఇటీవల వల్లెంకుంట గ్రామంలో అకస్మాత్తుగా మరణించిన తలారి మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ 25 కేజీ ల బియ్యం అందజేసిన గ్రామ ఉపసర్పంచ్ కటకం స్వప్న నరేష్ ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యుడు జక్కల రమేష్ అంబేద్కర్ యువజన అధ్యక్షులు మారుపాక వినయ్ ఉపాధ్యక్షులు శనిగరం రవీందర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నవీన్ సలాది తో పాటు యూత్ నాయకులు వేల్పుల రఘు వరుణ్, శనిగరం నితిన్ పాల్గొన్నారు

## ‘పెద్ది’తో డివోషనల్ మోడ్‌లో బుచ్చిబాబు



ప్రస్తుతం మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో చేస్తున్న అవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది కోసం అందరికీ తెలిసిందే. భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ సాంగ్ ఆల్రెడీ చార్ట్ బస్టర్ అయ్యింది. ఇక ఈ సాంగ్ తర్వాత నెక్స్ట్ అప్డేట్ కోసం అభిమానులు ఎదురు చూస్తుండగా ఈ పండుగకి తన పెద్ది తో కలిసి బుచ్చిబాబు దిగిన డివోషనల్ పిక్ ని షేర్ చేసుకున్నాడు. దీనితో ఈ పిక్ మంచి ఫోటో మూమెంట్ గా మారింది. మరి ఇందులో ఇద్దరు స్టార్స్ కూడా దేవుని చిత్ర పటాల మధ్యలో కనిపిస్తుండగా రామ్ చరణ్ మంచి డైనమిక్ లుక్ లో ఉన్నాడు. మరి ఈ కొత్త పిక్ తో అభిమానులు సినిమా కోసం మరింత ఎగ్జైట్ అవుతున్నారు. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించగా వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ మార్చ్ 27న గ్రాండ్ గా ఈ చిత్రాన్ని రిలీజ్ కి తీసుకొస్తున్నారు.

## నేనెందుకు క్షమాపణలు చెప్పాలి..



ఐటమ్ సాంగ్స్ తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్ గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ‘‘నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు’’ అని మలైకా అన్నారు.‘ఛల్ ఛయ్యా ఛయ్యా ఛయ్యా’.. ‘మున్నీ బద్నామ్ హుయీ’.. నుంచి ‘అనార్కలీ డిస్కో చాలి’ వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్ తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్ తో కలిసి ‘చిల్ గమ్’, ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన ‘థామా’లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.

# రాహుల్ సెంచరీ వృథా..

## రాజ్ కోట్ వన్డేలో టీమిండియా ఓటమి



రాజ్ కోట్ వేదికగా భారత్ తో జరిగిన రెండో వన్డేలో 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్ ల సిరీస్ ను 1-1తో బ్లాక్ క్యాప్స్ జట్టు సమం చేసింది. 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ ఆడుతూ పడుతూ 47.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి చేధించింది. మిడిలార్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్ మరోసారి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మిచెల్ అజేయ శతకంతో చెలరేగాడు.

114 బంతులు ఎదుర్కొన్న మిచెల్.. 10 ఫోర్లు,2 సిక్సలతో 130 పరుగులు చేశాడు. అతడితో విల్ యంగ్ కూడా కీలక నాక్ ఆడాడు. యంగ్ 98 బంతుల్లో 87 పరుగులు చేసి ఔటయ్యాడు. చివరిలో గ్లెన్ ఫిలిప్స్ (21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సో 30) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కష్ణ, హర్షిత్ రాణా తలా వికెట్ సాధించారు.

రాహుల్ సెంచరీ వథా..

అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(12) విరోచిత శతకంతో చెలరేగగా.. కెప్టెన్ శుభ్ మన్ గిల్(56) హాఫ్ సెంచరీతో రాణించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టేన్ క్లార్క్ మూడు వికెట్లు పడగొట్టగా.. జేమీసన్, పౌల్క్స్, బ్రెస్వెల్ తలా వికెట్ సాధించారు. ఇక సిరీస్ డిసైడర్ మూడో వన్డే ఇండోర్ వేదికగా జనవరి 18న జరగనుంది.

## నం.1 స్థానం సొంతం చేసుకున్న విరాట్ కోహ్లి



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి తాజాగా ఐసీసీ విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్ లో నం.1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. దాదాపు నాలుగేళ్ల తర్వాత అతడు ఈ ఘనతను సాధించాడు. విరాట్.. చివరిసారిగా జులై 2021లో నం.1 ర్యాంకులో ఉన్నాడు. వడోదర వేదికగా న్యూజిలాండ్ తో జరిగిన మొదటి మ్యాచ్ లో అతడి అద్భుత ప్రదర్శన కారణంగా టాప్ లోకి దూసుకెళ్లాడు. ఈ మ్యాచ్ లో అతడు 91 బంతుల్లో 93 పరుగులు సాధించాడు.

వన్డేల్లో పునరాగమనం తర్వాత విరాట్ నిలకడగా రాణిస్తున్న విషయం తెలిసిందే. గత అయిదు ఇన్నింగ్సో వరుసగా 50 ప్లస్ స్కోర్లు సాధించాడు. ఓవరాల్ గా 469 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలున్నాయి. ప్రస్తుతం అతడు 785 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లి మొదటి సారిగా అక్టోబర్ 2013లో నం.1 ర్యాంకుకు చేరుకుని, రికార్డ్ స్థాయిలో 825 రోజుల పాటు కొనసాగిన విషయం తెలిసిందే.

టీమ్ఇండియాతో జరిగిన మొదటి మ్యాచ్ లో 84 పరుగులు చేసిన న్యూజిలాండ్ కు చెందిన డారిల్ మిచెల్ 784 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ మొదటి స్థానం నుంచి మూడో స్థానానికి పడిపోయాడు. అతడి ఖాతాలో 775 రేటింగ్ పాయింట్లున్నాయి.

## పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రయాణం.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రాన్ని రిలీజ్ కు రెడీ చేస్తున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత పవన్ తన నుంచి పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వరక్స్ బ్యానర్ పై సరికొత్త కంటెంట్ ను ఎంకరేజ్ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇక తాజాగా భోగి పండగపూట ఆయన తన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వరక్స్ తో ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కొలాబొరేట్ అవుతున్నట్లు ప్రకటించారు. తమ ద్వారా సరికొత్త కంటెంట్, ట్యాలెంట్ ను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇక పవన్ కళ్యాణ్తో చేతులు కలపడం సంతోషంగా ఉందని.. ఇకపై తమ ప్రయాణంలో కొత్తవారికి అవకాశాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామంటూ టీజీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు.

ఈ రెండు బ్యానర్ల కలయికతో టాలీవుడ్ కు సరికొత్త బూస్ట్ రావడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక ఈ కాంబినేషన్ లో ఎలాంటి సినిమాలు వస్తాయా.. అవి ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుంటాయా.. అనేది వేచి చూడాలి.

## తెర పైకి చిరు, మారుతీ కాంబినేషన్..!



ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి అభిమానులు అలాగే మెగా ఫ్యాన్స్ అంతా కూడా మన శంకర వరప్రసాద్ గారు మేనియాలో ఉన్న సంగతి తెలిసిందే. బ్లాక్ బస్టర్ దర్శకుడు అనీల్ రావిపూడి తెరకెక్కించిన ఈ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ అదరగొడుతుండగా ఇప్పుడు దీని తర్వాత మెగాస్టార్ లైనప్ లో మరో షాకింగ్ కాంబినేషన్ ఉన్నట్టుగా బయటికి వచ్చింది. లేటెస్ట్ గా భారీ చిత్రం ది రాజా సాబ్ తో వచ్చిన దర్శకుడు మారుతీ అసలు విషయం రివీల్ చేశారు. తాను మెగాస్టార్ తో సినిమా చేయబోతున్నట్టు కన్ఫర్మ్ చేశారు. దీనితో ఈ ఊహించని కలయిక ఇప్పుడు సినీ వర్గాల్లో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రస్తుతానికి అయితే అంత సానుకూల రెస్పాన్స్ ఈ కాంబినేషన్ పై వినిపించడం లేదు. మరి ఫ్యూచర్ లో ఎలా ఉంటుందో చూడాలి. ఇక ప్రస్తుతం మెగాస్టార్ యువ దర్శకులు బాబీ, వశిష్ఠ అలాగే శ్రీకాంత్ ఓదెల లతో మొత్తం మూడు సినిమాలు లైనప్ లో ఎంచుకున్న సంగతి తెలిసిందే.

## స్టార్ డైరెక్టర్‌తో అల్లు అర్జున్ మూవీ



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కోలీవుడ్ బాటపట్టారు. వరుసగా సినిమాలు అనౌన్స్ చేస్తున్నారు. ఇప్పటికే అట్లీతో జతకట్టిన బన్నీ.. మరో కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ తో మూవీకి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని మైత్రి మూవీ మేకర్స్ అఫీషియల్ గా ప్రకటించింది. ఈ మేరకు ప్రత్యేక వీడియోను షేర్ చేసింది. వీరిద్దరి కాంబోలో వస్తోన్న సినిమాకు ఏఏ23 వర్కింగ్ టైటిల్ ను ప్రకటించింది.

అల్లు అర్జున్.. స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటించనున్నారు. తొలిసారి వీరిద్దరు కాంబోలో వస్తోన్న చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతమందిస్తున్నారు. ఈ మూవీ అల్లు అర్జున్ కెరీర్ లో 23వ చిత్రంగా రానుంది. దీంతో బన్నీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభం కానుందని మేకర్స్ వెల్లడించారు.










Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.